www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఎలక్ట్రిక్ వాహనాలకు సౌండ్ అలర్ట్ సిస్టమ్!

ఈవీలు నడిచేటప్పుడు కృత్రిమంగా శబ్దం చేసే ఏవీఏఎస్

2026 అక్టోబరు తర్వాత తయారయ్యే ఈవీలన్నింటికీ ఈ వ్యవస్థ తప్పనిసరి

ప్రస్తుత వాహనాలకు అమర్చేందుకు 2027 అక్టోబరు 1 దాకా గడువు

2



మంగళవారం | 30-9-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 183 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం; తిథి: అష్టమి సా.6.06 తదుపరి నవమి; నక్షత్రం: మూల ఉ.6.18 తదుపరి పూర్వాషాఢ; వర్జ్యం: ఉ.6.37-6.20; దుర్ముహూర్తం: ఉ.8.31-9.18, రా.9.59-10.46; అమృతఘడియలు: రా.2.56-4.39; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 6.08; సూర్యాస్తమయం: 6.01 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



సమరానికి సై

స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూలు ప్రకటించిన రాష్ట్ర ఎన్నికల సంఘం


ఎన్నికల షెడ్యూల్ వివరాలను వెల్లడిస్తున్న కమిషనర్ రాణి కుముదిని

రెండు దశల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు

అక్టోబరు 23, 27న పోలింగ్.. నవంబరు 11న ఫలితాలు

పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యులకు మూడు దశల్లో

వీటికి పోలింగ్ రోజే ఫలితాలు.. రాష్ట్రంలో అమల్లోకి కోడ్

ప్రభుత్వ గెజిట్ ఆధారంగా షెడ్యూల్: రాణి కుముదిని

స్థానిక సమరానికి పార్టీలు సన్నద్ధం

పథకాలు, బీసీ రిజర్వేషన్‌పై కాంగ్రెస్ ఆశలు

ప్రభుత్వ వ్యతిరేకతపై బీఆర్ఎస్ నేతల ఆశాభావం

ఆ పార్టీల వైఫల్యాలపై ప్రచారానికి బీజేపీ నిర్ణయం

8న హైకోర్టు ఇవ్వనున్న ఆదేశాలపై పార్టీల్లో ఉత్కంఠ

హైదరాబాద్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కొద్ది నెలలుగా రాజకీయ వర్గాల్లో నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది! స్థానిక సమరానికి రంగం సిద్ధమైంది! స్థానిక సంస్థల ఎన్నికలకు నగారా మోగింది! జడ్పీటీసీ, ఎంపీటీసీ, పంచాయతీ సర్పంచి, వార్డు సభ్యుల ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) షెడ్యూల్‌ను ప్రకటించింది. జడ్పీటీసీ, ఎంపీటీసీలకు రెండు (అక్టోబరు 23, 27 తేదీలు) దశల్లో, సర్పంచి, వార్డు సభ్యుల పదవులకు మూడు (అక్టోబరు 31, నవంబరు 4, 8వ తేదీల్లో) దశల్లో ఎన్నికలు నిర్వహిస్తారు. ఈ ప్రక్రియ అక్టోబరు 9న ప్రారంభమై.. నవంబరు 11న ముగియనుంది. సర్పంచి, వార్డు సభ్యుల పదవులకు పోలింగ్ రోజునే ఓట్లు లెక్కించి అదే రోజు ఫలితాలు ప్రకటిస్తారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ పదవులకు మాత్రం నవంబరు 11న ఓట్లను లెక్కించి, ఫలితాలను ప్రకటించనున్నారు. ఇక, కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) జూలై 15వ తేదీ వరకు సిద్ధం చేసిన ఓటర్ల తుది జాబితా ఆధారంగా

మిగతా 13వ పేజీలో...

అభ్యర్థే లేరు.. సర్పంచ్ ఎవరు?

- బీసీల్లేని చోట బీసీలకు రిజర్వేషన్లు
- ఎస్సీల్లేని చోట ఎస్సీలకు కేటాయింపు
- ఖమ్మం జిల్లాలో మంగలితండా బీసీ మహిళకు
- ఆ ఊర్లోని 829 మందిలో బీసీ మహిళ ఒక్కరే
- రాఘవాపురం ఎస్సీలకు.. అక్కడ తల్లీకొడుకులు ఇద్దరే
- నల్లగొండ జిల్లాలో ఏడు తండాలు బీసీలకు
- ఆ తండాల్లో ఒక్కరంటే ఒక్క బీసీ ఓటరు లేరు
- రాష్ట్రవ్యాప్తంగా పలుగ్రామాల్లో విచిత్రమైన పరిస్థితి

13

పంచాయతీ కార్యదర్శులకు రూ.104 కోట్ల బకాయిల విడుదల: మంత్రి సీతక్క

విడతల వారీగా ఎన్నికల షెడ్యూల్ ఇలా...!

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు	తొలి విడత	రెండో విడత
నామినేషన్ల స్వీకరణ మొదలు	అక్టోబరు 9	అక్టోబరు 13
నామినేషన్ల స్వీకరణకు చివరి తేది	అక్టోబరు 11	అక్టోబరు 15
నామినేషన్ల పరిశీలన	అక్టోబరు 12	అక్టోబరు 16
నామినేషన్ల ఉపసంహరణ	అక్టోబరు 15	అక్టోబరు 19
పోలింగ్ తేదీ	అక్టోబరు 23	అక్టోబరు 27
ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి	నవంబరు 11	నవంబరు 11



ఒక్కో పిటిషన్‌పై గంటసేపు విచారణ

అనర్హత పిటిషన్లపై స్పీకర్ ప్రసాద్‌కుమార్ చాంబర్‌లో ప్రారంభం

ఎమ్మెల్యేలు ప్రకాష్‌గౌడ్, కాలె యాదయ్య, మహిపాల్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తరఫు లాయర్ల వాదనలు

పిటిషనర్లను క్రాస్ ఎగ్జామిన్ చేసిన న్యాయవాదులు

రేపు ఎమ్మెల్యేలను ప్రశ్నించనున్న పిటిషన్‌దారుల లాయర్లు

13


పైరసీ ముఠా వివరాలు వెల్లడిస్తున్న సీపీ సీవీ ఆనంద్

'సినిమా' దొంగలు దొరికారు!

అంతర్రాష్ట్ర ముఠాకు చెందిన ఐదుగురి అరెస్ట్

5ఏళ్లలో 500 చిత్రాల పైరసీ

సినీ పరిశ్రమకు రూ.22,400 కోట్ల నష్టం

2024లోనే టాలీవుడ్‌కు రూ.3700 కోట్ల నష్టం

సినీ ప్రముఖులతో సీపీ సీవీ ఆనంద్ సమీక్ష

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ మీడియాను హ్యాక్ చేసి.. థియేటర్లలో రికార్డ్ చేసి.. పైరేటెడ్ సినిమాలను వివిధ వెబ్‌సైట్ల ద్వారా పంపిణీ చేసి చిత్రపరిశ్రమకు రూ.వేల కోట్ల నష్టాన్ని కలిగిస్తున్న అతిపెద్ద అంతర్రాష్ట్ర ముఠాను సైబర్ క్రైమ్ పోలీసులు పట్టుకున్నారు. ఈ ముఠాలోని.. బిహార్, తమిళనాడు, ఏపీ రాష్ట్రాలకు చెందిన ఐదుగురు ప్రధాన నిందితులను అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టారు. వారి వద్ద నుంచి సీపీయూ, ట్యాబ్స్, హార్డ్ డిస్కులు, స్మార్ట్‌ఫోన్లు, వెబ్‌కామ్, మెమొరీ కార్డులు, మొబైల్స్, ల్యాప్‌టాప్‌లు, డాంగెల్స్, పెన్‌డ్రైవ్‌లు తదితర ఎలక్ట్రానిక్ వస్తువులను

మిగతా 10వ పేజీలో...

విదేశీ సినిమాలపై 100% టారిఫ్

ఫర్నిచర్‌పైనా సుంకాల పెంపు.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన ప్రకటన

భారత చిత్ర పరిశ్రమపై ప్రభావం

నెట్‌ఫ్లిక్స్ షేరు ధరలో 1.5% తగ్గుదల

వాషింగ్టన్, సెప్టెంబరు 29: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం మరోసారి టారి‌ఫ్‌ల కొరడా ఝుళిపించారు. ఈసారి విదేశీ సినిమాలపై సుంకాలను 100% మేర పెంచారు. విదేశీ ఫర్నిచర్‌పైనా సుంకాలను పెంచనున్నట్టు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన వివరాలను తర్వాత ప్రకటిస్తామని తెలిపారు. వినోద, తయారీ రంగాల ఉద్యోగాలను తిరిగి అమెరికాకు తీసుకొచ్చేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని

మిగతా 2వ పేజీలో...

శ్వేత సౌధం.. స్వర్ణమయం!

ఓవల్ ఆఫీస్, క్యాబినెట్ రూంలకు 24 క్యారెట్ల బంగారంతో తాపడం

ప్రపంచ నేతలు విస్తుబోతారన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

ఈ ఆడంబరం ఎందుకు: అమెరికన్లు

2



సరూర్‌నగర్‌లో భారీ బతుకమ్మ, చుట్టూ చేరి ఆడుతున్న మహిళలు

మహా బతుకమ్మ

63.11 అడుగుల ఎత్తు.. 10.7 టన్నుల పూలతో ఏర్పాటు

300 మంది మూడు రోజుల పాటు శ్రమించి రూపకల్పన

ఆడిపాడిన 1354 మంది మహిళలు

సరూర్‌నగర్ స్టేడియంలో మహా వేడుక

కార్యక్రమంలో పాల్గొన్న జూపల్లి, సీతక్క

మిస్ వరల్డ్, అందాల భామల సందడి

రికార్డు పత్రాలను మంత్రులకు అందజేసిన గిన్నిస్ ప్రతినిధి స్వప్నిల్

మన్సూరాబాద్/వనస్థలిపురం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అది భారీ బతుకమ్మ. 30-40 మంది కలిసినా ఎత్తలేనంత బరువుగల బతుకమ్మ! ఆ బతుకమ్మ ఎత్తు 63.11 అడుగులు. వెడల్పు 36 అడుగులు. ఇంతటి భారీ బతుకమ్మను పేర్చేందుకు 10.7 టన్నుల మేర వివిధ రకాల పూలను ఉపయోగించారు. 300 మంది మూడు రోజుల పాటు శ్రమించి ఈ మెగా బతుకమ్మను రూపొందించారు. 11 స్టేజీలుగా పేర్చిన ఈ మహా బతుకమ్మ కోసం తొమ్మిది రకాల పూలను వాడారు. ఎల్బీనగర్‌లోని సరూర్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో

మిగతా 12వ పేజీలో...

మళ్లీ సాగునీటి వినియోగ సంఘాలు!

తొలుత చెరువులు, కాలువలకు, తర్వాత భారీ ప్రాజెక్టులకూ..

సంఘాల కింద లష్కర్‌ల విధులు

కన్వీనర్లుగా ఇరిగేషన్ అధికార్లు

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి

3



విదేశీ సినిమాలపై 100% టారిఫ్



(మొదటిపేజీ తరువాయి)

పేర్కొన్నారు. ఈ మేరకు ట్రూత్ సోషల్‌లో పోస్టులు పెట్టారు. హాలీవుడ్‌పై దృష్టి సారించిన ఆయన విదేశీ పోటీదార్ల కారణంగా సినిమా పరిశ్రమపై అమెరికా ఆధిపత్యం తగ్గిందని అభిప్రాయపడ్డారు. "మన సినీ నిర్మాణ వ్యాపారాన్ని ఇతర దేశాలు దొంగిలించాయి. చిన్న పిల్లల చేతిలోని క్యాండీని లాక్కొన్నట్టు తీసుకెళ్లిపోయాయి. ముఖ్యంగా బలహీన, అసమర్థ గవర్నర్ కారణంగా కాలిఫోర్నియా నష్టపోయింది. చిరకాలంగా, ముగింపంటూ లేకుండా సాగుతున్న ఈ సమస్యను పరిష్కరించడానికి అమెరికా బయట నిర్మించిన అన్ని సినిమాలపై 100%టారిఫ్ విధించాలని ప్రతిపాదిస్తున్నా" అని పేర్కొన్నారు. తర్వాత మరో పోస్టు పెడుతూ ఒకప్పుడు ఫర్నిచర్ తయారీ రంగంలో ఒక వెలుగువెలిగిన నార్త్ కరోలినా రాష్ట్రానికి పూర్వ వైభవం తెచ్చేందుకు విదేశీ ఫర్నిచర్‌పై టారిఫ్‌లు పెంచుతామని తెలిపారు. "చైనా, ఇతర దేశాల కారణంగా నార్త్ కరోలినా ఫర్నిచర్ వ్యాపారాన్ని పూర్తిగా కోల్పోయింది. ఆ రాష్ట్రాన్ని మళ్లీ 'గ్రేట్'గా మార్చేందుకు అమెరికాలో తయారుచేయని ఫర్నిచర్‌పై టారిఫ్‌లు పెంచుతాం" అని పేర్కొన్నారు. ట్రంప్ నిర్ణయం భారత సినీ పరిశ్రమపై భారీగా ప్రభావం చూపనుంది. ఫోర్బ్స్ నివేదిక ప్రకారం అమెరికా, కెనడాల్లో ఏ సమయంలో చూసినా 1,000కిపైగా భారత భాషల సినిమాలు ఆడుతుంటాయి. భారత దేశ నిర్మాతలు, అమెరికా డిస్ట్రిబ్యూటర్లు కలిసి వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. అందువల్ల విదేశాల్లో నిర్మించిన సినిమాలపై 100% టారిఫ్ విధించే చట్టబద్ధమైన అధికారం అధ్యక్షుడికి ఉందా అన్నదానిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, నెట్‌ఫ్లిక్స్ షేరు ధర 1.5% మేర తగ్గింది.

శ్వేత సౌధం.. స్వర్ణమయం!

వాషింగ్టన్, సెప్టెంబరు 29: అమెరికా అధ్యక్షుడి నివాసం శ్వేత సౌధాన్ని(వైట్ హౌస్) 24 క్యారెట్ల మేలిమి బంగారంతో అలంకరించనున్నట్టు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. ప్రస్తుతం ఓవెల్ ఆఫీసు, క్యాబినెట్ రూంలకు బంగారు తాపడం పనులు జరిగినట్టు పేర్కొన్నారు. దీనికి సంబంధించిన వీడియోలను ఆయన సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ పోస్ట్'లో పంచుకున్నారు. ఈ బంగారు అలంకరణలు చూసి ప్రపంచ దేశాల నేతలు విస్తుబోవడం ఖాయమని వ్యాఖ్యానించారు. "శ్వేత సౌధంలోని ఓవల్ ఆఫీసు, క్యాబినెట్ రూమ్‌లకు అత్యంత నాణ్యమైన 24 క్యారెట్ల బంగారాన్ని వినియోగించాం." అని ట్రంప్ పేర్కొన్నారు. ఈ వీడియోలో అలంకరణకు సిద్ధంగా ఉన్న బంగారు గోడల ఆకృతులు కనిపించాయి. "మిరిమిట్లు గొలిపే అందాలను చూసి.. ప్రపంచ దేశాల నేతలే కాదు.. ప్రతి ఒక్కరూ సంభ్రమాశ్చర్యాలకు గురవుతారు. విస్తుబోతారు. ఇప్పటి వరకు అత్యుత్తమ అందాన్ని, విజయాన్ని సొంతం చేసుకున్నది ఓవల్ ఆఫీస్ ఒక్కటే!." అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈ వీడియో ఆన్‌లైన్‌లో వైరల్ అయింది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఇంత ఆడంబరం ఎందుకని చాలా మంది విమర్శించారు. కాగా, ఈ బంగారు తాపడాలకు అయ్యే ఖర్చును ట్రంప్ సొంత నిధుల నుంచి వెచ్చిస్తున్నట్టు వైట్‌హౌస్ అధికార ప్రతినిధి తెలిపారు.

లోకం తీరు



జీఎస్టీ తగ్గింపుతో పెరిగిన పొదుపు

» ఒక్కో కుటుంబానికి ఏటా రూ.20వేలు ఆదా: ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, సెప్టెంబరు 29: వస్తు-సేవల పన్ను (జీఎస్టీ) విషయంలో ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలను ప్రధాని మోదీ సమర్థించుకున్నారు. ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొడుతూ 'ప్రగల్భాలు పలికేవారి' (బయాన్ బహదూర్) మాటలకేమిగానీ జీఎస్టీ తగ్గింపు కారణంగా ప్రజలకు సొమ్ము ఆదా అయిందని చెప్పారు. యూపీఏ పాలనతో పోల్చినప్పుడు సంవత్సరానికి రూ.లక్ష వ్యయం చేసే కుటుంబం ప్రస్తుతం రూ.20వేలను మిగుల్చుకోగలుగుతోందని చెప్పారు. సోమవారం ప్రధాని మోదీ ఇక్కడ బీజేపీ ఢిల్లీ శాఖ ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ జీఎస్టీ తగ్గింపుతో పాటు ఆదాయపు పన్నులో మినహాయింపులు ఇచ్చిన కారణంగా ప్రతియేటా ఒక్కో కుటుంబానికి రూ.2.5 లక్షల మేర ఆదా అవుతోందని తెలిపారు. ఈ సంస్కరణలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ముఖ్యంగా ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో ప్రచారం చేయాలని కార్యకర్తలను కోరారు.

ఇది ఆత్మకథ కాదు.. మీ 'మన్ కీ బాత్'!

» ఇటలీ ప్రధాని మెలోనీ పుస్తకానికి మోదీ ముందు మాట

న్యూఢిల్లీ, సెప్టెంబరు 29: ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ఆత్మకథకు ప్రధాని మోదీ రాసిన ముందుమాట ఆసక్తికరంగా మారింది. 'అయాం జార్జియా-మై రూట్స్, మై ప్రిన్సిపుల్స్' అనే ఈ పుస్తకం కేవలం ఆత్మకథ కాదని.. ఆమె 'మన్ కీ బాత్ (మనసులో మాట)' అని పేర్కొన్నారు. 'ప్రధాని మెలోనీ ఆత్మకథ రాస్తుండడం నాకు సంతోషం కలిగిస్తోంది. 11 ఏళ్లుగా పలువురు ప్రపంచ నేతలతో కలిసి నడిచే అవకాశం నాకు కలిగింది. ఒక్కొక్కరిదీ ఒక్కో విధమైన జీవనయానం. కాలక్రమంలో అవి వ్యక్తిగత కథలను మించిన విస్తృతార్థాన్ని ఇస్తాయి. శతాబ్దాల తరబడి భిన్న సంస్కృతుల్లో నెలకొన్న విలువలను గుర్తుచేస్తాయి. తన పరిపూర్ణ జీవనంలో ప్రధాని మెలోనీకి ఇలాంటి దృష్టాంతాలు ఎన్నో ఎదురై ఉంటాయి' అని పేర్కొన్నారు.

లారెన్స్ బిష్ణోయ్ ముఠా ఉగ్రవాద సంస్థ: కెనడా

అట్టావా, సెప్టెంబరు 29: గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌ను ఉగ్రవాద సంస్థగా కెనడా ప్రకటించింది. భారత్‌తో పాటు విదేశాల్లో హత్యలు, దోపిడీలు, ఆయుధాలు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా వంటి కార్యకలాపాల నేపథ్యంలో దేశ క్రిమినల్ కోడ్ ప్రకారం ఉగ్రవాద సంస్థగా ప్రకటిస్తున్నట్లు కెనడా మంత్రి గ్యారీ ఆనందసంగరీ తెలిపారు. దీని ప్రకారం కెనడాలో ఉన్న బిష్ణోయ్ గ్యాంగ్ ఆస్తులను, నగదును, వాహనాలను ప్రభుత్వం స్వాధీనం లేదా స్తంభింపచేయవచ్చు. గ్యాంగ్ సభ్యులను కెనడా లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విచారణ చేయవచ్చు. ఇమ్మిగ్రేషన్ అధికారులు బిష్ణోయ్ గ్యాంగ్ సభ్యులను కెనడాలోకి ప్రవేశించకుండా అడ్డుకోవచ్చు. మార్క్ కెర్నీ కెనడా ప్రధాని అయ్యాక భారత్-కెనడా మధ్య మెరుగవుతున్న సంబంధాలకు తాజా చర్యను ఉదాహరణగా పరిశీలకులు చెబుతున్నారు.

వాయుసేన చీఫ్ స్టెప్పులు.. వీడియో వైరల్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 29: ఒకవైపు యుద్ధరంగంలో శత్రువులకు చుక్కలు చూపిస్తే.. మరోవైపు తన నృత్యంతో ప్రజల మనసులు గెలుచుకున్నారు భారత వాయుసేన చీఫ్, ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్. ఓ పార్టీకి హాజరైన ఆయన అక్కడున్న వారితో కలిసి ప్రముఖ హిందీ పాట 'హవన్ కరేంగే'కు ఉత్సాహంగా స్టెప్పులు వేస్తూ కనిపించారు. ఓ నెటిజెన్ ఆ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేయగా ప్రస్తుతం అది వైరల్ అవుతోంది.



ఆకాశాన్నంటే ఎత్తు.. ఐఫిల్ టవర్ కన్నా బరువు!

» చైనా ఇంజనీరింగ్ అద్భుతం.. ప్రపంచంలోనే ఎత్తైన బ్రిడ్జి

బీజింగ్, సెప్టెంబరు 29: చైనా మరోసారి తన ఇంజనీరింగ్ అద్భుతంతో ప్రపంచాన్ని అబ్బురపరిచింది. నైరుతి చైనాలోని గిజౌ ప్రావిన్స్‌లోని ఓ భారీ లోయపై 625 మీటర్ల ఎత్తులో నిర్మించిన వంతెనను ఆదివారం అధికారికంగా ప్రారంభించింది. 'హువాజియాంగ్ గ్రాండ్ కెన్యాన్ బ్రిడ్జ్' పేరిట నిర్మించిన ఈ వంతెన ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన బ్రిడ్జిగా నిలిచింది. మొన్నటివరకు లోయ చుట్టూ తిరిగి అవతలి వైపుకు చేరుకునేందుకు 2 గంటల సమయం పట్టేది. ఇప్పుడు రెండు నిమిషాల్లోనే వంతెనపై రయ్యిమంటూ దూసుకెళ్లొచ్చు. వంతెన పొడవు 2,890 మీటర్లు కాగా, 22 వేల టన్నుల ఉక్కుతో నిర్మించడం గమనార్హం. అంటే ప్రపంచ ప్రఖ్యాత ఐఫిల్ టవర్ కన్నా మూడు రెట్ల అధిక బరువుతో దీన్ని నిర్మించారు.

ఆ 'పాపం' విజయ్‌దే!

జనాన్ని పోగేయడానికే కరూర్‌కు ఆలస్యంగా వచ్చారు

» అనుమతి లేకుండా రోడ్‌షో చేశారు
» విద్యుత్ సరఫరానూ ఆపేయమన్నారు
» కరూర్ ఘోరంపై పోలీసుల ఎఫ్ఐఆర్
» 41కి చేరిన తొక్కిసలాట మృతుల సంఖ్య



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, మురుగన్

చెన్నై/న్యూఢిల్లీ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని కరూర్ జిల్లాలో ఈ నెల 27న నిర్వహించిన తమిళ వెట్రి కళగం(టీవీకే) ర్యాలీలో జరిగిన తొక్కిసలాట ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు.. టీవీకే అధ్యక్షుడు, ఇళయ దళపతి విజయ్‌ను తప్పుబట్టారు. ఈ ర్యాలీకి విజయ్ ఉద్దేశపూర్వకంగానే ఆలస్యంగా వచ్చారని, అనుమతి లేకుండా రోడ్ షో నిర్వహించారని పేర్కొన్నారు. టీవీకే జిల్లా కార్యదర్శి మథియాళగన్.. 10 వేల మందికి మాత్రమే అనుమతి తీసుకున్నారని.. కానీ, 25వేల మందికి పైగా ర్యాలీకి వచ్చారని పేర్కొన్నారు. జనసమూహాన్ని పోగేయడానికే.. ఉద్దేశపూర్వకంగా విజయ్ ఆలస్యం చేశారని తెలిపారు. "నిర్ణీత సమయం కంటే 4 గంటల పాటు విజయ్ ఆలస్యంగా వచ్చారు. జనాలు భారీగా వచ్చారని రాజకీయంగా ప్రకటించుకునేందుకే ఇలా చేశారు. అప్పటికే వేలాదిగా చేరుకున్న ప్రజలు ఎండలో నిలబడి అలసిపోయారు. ఈ కారణంగానే తొక్కిసలాటలో 11 మంది అక్కడే చనిపోయారు" అని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. "వాస్తవానికి కరూర్ జిల్లా సరిహద్దుకు విజయ్ సాయంత్రం 4.45 గంటలకే చేరుకున్నారు. కానీ, అక్కడి నుంచి ఆయన కదలికలు ఆలస్యం చేశారు. ఎలాంటి అనుమతి లేకుండా రోడ్ షో నిర్వహించారు. రాత్రి 7 గంటలకు వేలుసామిపురానికి చేరుకున్నారు. కానీ, అప్పటికే నియంత్రించలేని స్థాయిలో జనాన్ని సమీకరించారు. ఈ విషయాన్ని గుర్తించిన పోలీసు అధికారులు.. పరిస్థితి తీవ్రంగా మారిందని, ప్రజలకు ఊపిరాడే పరిస్థితి కూడా ఉండకపోవచ్చని మథియాళగన్‌ను హెచ్చరించారు. కానీ, ఆయన పట్టించుకోలేదు. చాలా మంది ప్రజలు విజయ్‌ను చూసేందుకు సమీపంలోని చెట్లెక్కారు. మరికొందరు రోడ్డు పక్కన ఉన్న నిర్మాణాల పైకప్పులపైకి ఎక్కారు. దీంతో వారి బరువుతో అవి కుప్పకూలాయి. వాటి కింద ఉన్నవారు ఊపిరి ఆడక ప్రాణాలు కోల్పోయారు. ఒకదశలో టీవీకే నేతలు విద్యుత్ సరఫరాను కూడా ఆపేయమన్నారు." అని ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశారు. దీనిలో టీవీకే జిల్లా కార్యదర్శి మథియాళగన్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుషి ఆనంద్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సీటీఆర్ నిర్మల్ కుమార్ పేర్లను చేర్చారు. మరోవైపు, రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ సభ్యురాలు జస్టిస్ అరుణ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను కలుసుకుని వివరాలు సేకరించారు. అదేవిధంగా ఘటన జరిగిన ప్రాంతంలోనూ పర్యటించి స్థానికులతో మాట్లాడారు.

సెలవుల తర్వాతే విచారణ: హైకోర్టు

కరూర్ తొక్కిసలాట ఘటనపై సీబీఐ విచారణ చేపట్టాలంటూ టీవీకే దాఖలుచేసిన పిటిషన్‌పై అత్యవసర విచారణ చేపట్టేందుకు హైకోర్టు మదురై ధర్మాసనం నిరాకరించింది. తొక్కిసలాటలో డీఎంకే కుట్ర ఉందని టీవీకే తన పిటిషన్‌లో ఆరోపించింది. ఈ నేపథ్యంలో దీనిపై సీబీఐ దర్యాప్తు చేయించాలని కోరింది. అయితే, ప్రస్తుతం దసరా సెలవులు కావడంతో ఆ తర్వాతే పిటిషన్‌పై విచారణ చేపడతామని కోర్టు తెలిపింది.

విద్యుత్‌కోత విధించాలని టీవీకే కోరింది!

కరూర్‌లో విజయ్ ప్రసంగిస్తున్న సమయంలో స్టాలిన్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా విద్యుత్ సరఫరా నిలిపివేసిందంటూ జరుగుతున్న ప్రచారాన్ని రాష్ట్ర విద్యుత్ బోర్డు ఖండించింది. విజయ్ ప్రసంగిస్తున్న సమయంలో విద్యుత్ సరఫరాను నిలిపేయాలని టీవీకే నిర్వాహకులు లేఖ ఇచ్చారని, అయితే ఆ వినతిని తాము తిరస్కరించామని బోర్డు అధికారులు తెలిపారు. ఆ లేఖను మీడియాకు విడుదల చేశారు. కాగా, తొక్కిసలాట ఘటనలో మృతుల సంఖ్య 41కి పెరిగింది. కరూర్ ప్రభుత్వాసుపత్రిలో ఓ మహిళ(61) సోమవారం కన్నుమూశారు. ప్రస్తుతం 11మంది ఐసీయూలో చికిత్స పొందుతుండగా, ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కాగా, కరూర్ తొక్కిసలాట ఘటనపై బీజేపీ.. ఎనిమిది మంది ఎన్డీయే ఎంపీలతో కూడిన నిజనిర్ధారణ కమిటీని నియమించింది. ఈ బృందం కరూర్‌కు వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించనుంది. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులను విశ్లేషించి నివేదికను నడ్డాకు సమర్పించనుంది.

ఎవరినీ తప్పుబట్టలేం: నిర్మల

కరూర్ దుర్ఘటనలో ఎవరినీ తప్పుబట్టలేమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. సోమవారం కరూర్ ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలను కలిసి ఓదార్చారు. అనంతరం, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రధాని సూచనల మేరకు తాము కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులుగా బాధితులను పరామర్శించేందుకు వచ్చామని తెలిపారు. నిర్మల వెంట కేంద్ర మంత్రి మురుగన్ తదితరులు ఉన్నారు. కాగా, ఈ ఘటనపై సీఎం స్టాలిన్ సోమవారం మరోమారు స్పందించారు. ఏ పార్టీ నాయకుడైనా తన కార్యకర్తలు, ప్రజలు మరణించాలని కోరుకోరని, ఘటనపై తప్పుడు ప్రచారం చేయొద్దని విజ్ఞప్తి చేశారు.

2 గంటల సలహాకు రూ. 11 కోట్లు తీసుకున్నా

» మూడేళ్లలో రూ.241 కోట్లు గడించా
» వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ వెల్లడి

పట్నా, సెప్టెంబరు 29: రాజకీయ వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ సోమవారం తన ఆదాయ వివరాలను ఓ బహిరంగ సభలో వెల్లడించారు. ఇతరుల మాదిరిగా తాను దొంగను కానని, ఆదాయ వ్యయాలను స్పష్టంగా అందరికీ చెప్పగలనని అన్నారు. సలహాలు ఇచ్చి కోట్లు గడించానని చెప్పారు. రెండు గంటలపాటు సలహాలు ఇచ్చినందుకు రూ.11 కోట్లు ఫీజుగా తీసుకున్నానని తెలిపారు. రాజకీయాల్లోకి రాకముందు రాజకీయ పార్టీలకు, సంస్థలకు, కంపెనీలకు సలహాలు ఇచ్చినా ఎలాంటి ఫీజులు తీసుకోలేదని స్పష్టం చేశారు. రాజకీయాల్లోకి వచ్చాక మాత్రం సలహాలు ఇవ్వడం ద్వారా సంపాదన మొదలుపెట్టానని, ఇది సమాజం కోసమేనన్నారు. "వ్యక్తులకు, కంపెనీలకు సలహాలు ఇవ్వడం ద్వారా గత మూడేళ్లలో రూ.241 కోట్లు సంపాదించా. ఇందులో 18 శాతం అంటే రూ.30.98 కోట్లు జీఎస్టీ చెల్లించా. రూ.20 కోట్లు ఆదాయపు పన్నుగా కట్టాను. రూ.98.95 కోట్లు జన్ సురాజ్ పార్టీకి విరాళంగా ఇచ్చా. ఒక కంపెనీకి రెండు గంటల పాటు సలహా ఇచ్చినందుకు రూ.11 కోట్లు తీసుకున్నా. ఇదీ బిహార్ కుర్రాడి శక్తి. మేం దొంగలం కాము" అని వివరించారు. చెల్లింపులు చెక్కుల రూపంలో జరిగాయని తెలిపారు. రాజకీయాల కోసం ప్రశాంత్ కిశోర్ ఎక్కడ నుంచి డబ్బులు తీసుకొస్తున్నారో వెల్లడించాలని బీజేపీ నాయకుడు సంజయ్ జైశ్వాల్ తదితరులు డిమాండ్ చేసిన నేపథ్యంలో ఆయన ఈ వివరణ ఇచ్చారు. బీజేపీ నాయకుడు, బిహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరిపైనా ప్రశాంత్ ఆరోపణలు చేశారు. హత్య కేసులో 1995లోనే సామ్రాట్‌కు శిక్ష పడిందని, కానీ మైనర్‌నంటూ నకిలీ సర్టిఫికెట్ చూపించి బయటపడ్డారని ఆరోపించారు. ఆయనను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.



ఈవీలకు సౌండ్ అలర్ట్ సిస్టమ్

» 2027 నుంచి కొత్త నిబంధన

న్యూఢిల్లీ, సెప్టెంబరు 29: రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. శబ్దం లేకుండా దూసుకెళ్లే ఎలక్ట్రిక్ వాహనాల వల్ల ఇతర వాహనదారులకు ప్రమాదాలు జరగకుండా.. ఇకపై అన్ని ఎలక్ట్రిక్ కార్లు, బస్సులు, ట్రక్కులకు 'సౌండ్ అలర్ట్ సిస్టమ్' (ఏవీఏఎస్)ను తప్పనిసరి చేయాలని రోడ్డు రవాణా, రహదారుల శాఖ ప్రతిపాదించింది. ఈ కొత్త నిబంధన 2027, అక్టోబరు 1 నుంచి అమలులోకి రానుంది. ఈ మేరకు మంత్రిత్వ శాఖ ఒక ముసాయిదా నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎలక్ట్రిక్ వాహనాలు నిశ్శబ్దంగా నడుస్తాయి. దీంతో అవి వస్తున్నాయన్న విషయం పాదచారులకు, ఇతర వాహనదారులకు తెలియదు. ఈ పరిస్థితి వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని, ఎలక్ట్రిక్ వాహనాలు వస్తున్నప్పుడు కృత్రిమంగా శబ్దం చేసే ఏవీఏఎస్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని రవాణా శాఖ నోటిఫికేషన్‌లో పేర్కొంది. 2026 అక్టోబరు తర్వాత తయారయ్యే కొత్త మోడల్ ఎలక్ట్రిక్ వాహనాలు (కార్లు, బస్సులు, ట్రక్కులు) వెంటనే ఈ సౌండ్ సిస్టమ్‌తో రావాలని సూచించింది. అలాగే, ప్రస్తుతం నడుస్తున్న పాత మోడల్ వాహనాలు ఈ సిస్టమ్‌ను అమర్చుకోవడానికి 2027 అక్టోబరు 1 వరకు గడువు ఇచ్చింది. అమెరికా, జపాన్, కొన్ని యూరోపియన్ దేశాలు ఇప్పటికే ఏవీఏఎస్ వినియోగాన్ని తప్పనిసరి చేశాయి.

హైఫాకు విముక్తి కల్పించింది భారత జవాన్లే

బ్రిటిషర్లు కాదు.. చరిత్ర పుస్తకాల్లోనూ ఆ మార్పు చేస్తున్నాం.. ఇజ్రాయెల్‌లోని హైఫా నగర మేయర్ వెల్లడి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 29: మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో హైఫా నగర విముక్తి కోసం తమ ప్రాణాలర్పించిన భారతీయ సైనికులకు.. ఆ నగర మేయర్ డాక్టర్ ఐనత్ కాలిష్-రోటెమ్ నివాళులర్పించారు. భారతదేశానికి-హైఫా నగరానికి మధ్య ఉన్న సుసంపన్నమైన చరిత్రను ప్రేరణాత్మకమైనదిగా ఆయన అభివర్ణించారు. హైఫా నగర భవిష్యత్తుకు సంబంధించి తమ వద్ద భారీ ప్రణాళికలు ఉన్నాయని.. వాటిలో భారత్‌ను ముఖ్యమైన భాగస్వామిగా చేయాలనుకుంటున్నామని పేర్కొన్నారు. ఒట్టోమాన్ సామ్రాజ్యం నుంచి హైఫా నగరానికి విముక్తి కల్పించింది భారతీయ సేనలైతే.. చరిత్ర పుస్తకాల్లో మాత్రం ఆ ఘనత బ్రిటిష్ సేనలకు ఆపాదించారని.. దాన్ని ఇప్పుడు మారుస్తున్నామని ఆయన తెలిపారు. 'నేను హైఫా నగరంలోనే పుట్టి పెరిగాను. ఈ నగరానికి స్వేచ్ఛనిచ్చింది బ్రిటిషర్లంటూ మాకు చెబుతూ వచ్చారు. కానీ, ఒట్టోమాన్స్ నుంచి ఈ నగరానికి విముక్తి కల్పించింది భారతీయులు.. బ్రిటిషర్లు కాదని తెలుసుకున్నట్టు హిస్టారికల్ సొసైటీకి చెందిన వారు నాకు చెప్పేదాకా తెలియదు' అని ఆయన వివరించారు. ఆ కథేంటంటే.. అప్పటికి దాదాపు 400 సంవత్సరాలుగా హైఫా నగరం ఒట్టోమాన్‌ల పాలనలో ఉంది. మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో 1918లో సెప్టెంబరు 23న.. బ్రిటిష్ సైన్యంలోని మైసూర్ లాన్సర్స్, హైదరాబాద్ లాన్సర్స్, జోధ్‌పూర్ లాన్సర్స్ రెజిమెంట్లకు చెందిన 400 మంది అశ్విక దళ సైనికులు హైఫా నగర విముక్తికి నడుం బిగించారు. కత్తులు, బల్లాలు ధరించి, అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో కార్మెల్ పర్వతాన్ని అధిరోహించి అక్కడున్న 1500 మందికిపైగా ఒట్టోమాన్ టర్కులు, జర్మనీ, ఆస్ట్రియా సేనలపై విరుచుకుపడ్డారు. మెషీన్ గన్ల తూటాలు దూసుకొస్తున్నా వెనక్కి తగ్గక శత్రుసైనికులను తరిమికొట్టారు. ఆ యుద్ధంలో అసమాన ప్రతిభాసాహసాలు చూపిన కెప్టెన్ అమన్‌సింగ్ బహదూర్, దఫాదార్ జోర్ సింగ్‌కు అప్పట్లో ఇండియన్ ఆర్డర్ ఆఫ్ మెరిట్‌ను ప్రదానం చేశారు. అలాగే, కెప్టెన్ అనోప్ సింగ్, సెకండ్ లెఫ్టినెంట్ సగత్ సింగ్‌లను మిలటరీ క్రాస్‌తో సన్మానించారు. 'హైఫా వీరుడు'గా పేరొందిన మేజర్ దల్పత్ సింగ్‌ను (జోధ్‌పూర్ లాన్సర్స్ కమాండర్) కూడా మిలటరీ క్రాస్ వరించింది. ఆ యుద్ధంలో ఆయన వీరోచితంగా పోరాడి వెన్నులో తూటాలతో నేలకొరిగాడు. చరిత్రకారులు ఈ యుద్ధాన్ని 'చరిత్రలోనే చివరి, అత్యంత గొప్ప అశ్విక దళ యుద్ధం'గా అభివర్ణిస్తుంటారు. ఇండియన్ ఆర్మీ ఏటా సెప్టెంబరు 23వ తేదీని 'హైఫా దినం'గా పాటిస్తుంది. వీరిలో జోధ్‌పూర్ లాన్సర్స్ రెజిమెంట్ 8 మంది సైనికులను కోల్పోయినప్పటికీ.. 700 మందిని ఖైదీలుగా పట్టుకుంది.

ముగ్గులో 'ఐ లవ్ మహమ్మద్' నినాదం!

» మహారాష్ట్రలో ఉద్రిక్తత.. 30 మంది అరెస్టు

ముంబై, సెప్టెంబరు 29: రోడ్డుపై ముగ్గు వేసి 'ఐ లవ్ మహమ్మద్' అనే నినాదాన్ని రాయడంతో మహారాష్ట్రలోని అహల్యానగర్‌లో మతపరమైన ఉద్రిక్తతలు చెలరేగి ఆందోళనలకు దారి తీసింది. నిరసనకారులను అదుపుచేసేందుకు పోలీసులు లాఠీచార్జ్ చేసి.. 30 మందిని అదుపులోకి తీసుకున్నారు. దేవీ నవరాత్రుల నేపథ్యంలో ఆదివారం రాత్రి అహల్యానగర్ (గతంలో అహ్మద్‌నగర్) మిల్లివాడ ప్రాంతంలో రోడ్డుపై ముగ్గుతో పాటు 'ఐ లవ్ మహమ్మద్' అనే నినాదాన్ని ఎవరో రాశారు. దీనికి సంబంధించిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో స్థానికులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు.. అందుకు కారణమైన వ్యక్తిని అరెస్టు చేశారు. అయితే అతడి సామాజిక వర్గానికి చెందిన యువకులు నిరసన చేపట్టారు. పోలీసులు అక్కడికి చేరుకొని శాంతింపజేసేందుకు యత్నించగా.. వారిపైకే రాళ్లు రువ్వారు. పరిస్థితి అదుపు తప్పడంతో పోలీసులు లాఠీ చార్జ్ చేసి.. 30 మంది నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై సీఎం ఫడ్నవీస్ స్పందించారు. 'మతపర ఉద్రిక్తతలను రెచ్చగొట్టేందుకు కుట్ర జరుగుతోంది. దీనిపై సమగ్ర దర్యాప్తు జరపాలి. ఇటువంటి చర్యలను ఉపేక్షించేది లేదు' అని హెచ్చరించారు. కాగా, మిలాద్-ఉన్-నబీ సందర్భంగా ఈనెల 4న యూపీలో ముస్లింలు నిర్వహించిన ర్యాలీలో తొలిసారి 'ఐ లవ్ మహమ్మద్' బ్యానర్లు, ప్లకార్డులను ప్రదర్శించారు. దీంతో పోలీసులు 24 మందిని అరెస్టు చేయడంతో వివాదాస్పదమైంది. దీనిపై పలు రాష్ట్రాల్లో ఆందోళనలు జరిగాయి.

ఆందోళనకరంగా బడిఈడు పిల్లల ఆరోగ్యం

» పెరుగుతున్న విటమిన్ డీ, జింక్ లోపాలు, జీవనశైలి సంబంధిత వ్యాధులు
» చిల్డ్రన్ ఇన్ ఇండియా 2025 నివేదికలో వెల్లడి

లోపాలు	1-4 ఏళ్లు	5-9 ఏళ్లు	10-19 ఏళ్లు
విటమిన్ డీ	14	18	24
జింక్	19	17	32
ప్రీడయాబెటిస్	--	--	10.4
డయాబెటిస్	--	--	0.6
అధిక కొలెస్ట్రాల్	--	--	3.7
హైపర్‌టెన్షన్	--	--	4.9
ట్రైగ్లీజరైడ్ స్థాయిలు	--	34	16

(శాతాల్లో)

హైదరాబాద్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దేశంలో బడిఈడు పిల్లల ఆరోగ్య పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని, చిన్న వయసులోనే విటమిన్ డీ, జింకు లోపాలతో పాటు జీవనశైలి సంబంధిత వ్యాధులు, కొలెస్ట్రాల్, బీపీ, ట్రైగ్లిజరైడ్ స్థాయిలు ఎక్కువగా ఉన్నట్లు ఓ అధ్యయనంలో వెల్లడైంది. కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు శాఖ తాజాగా విడుదల చేసిన "చిల్డ్రన్ ఇన్ ఇండియా 2025" నివేదికలో ఆందోళనకర విషయాలు వెలుగులోకి వచ్చాయి. ముఖ్యంగా 10 నుంచి 19 ఏళ్ల వయసు పిల్లల్లో విటమిన్ డీ, జింక్ లోపాలు తీవ్రంగా పెరుగుతున్నాయని ఆ నివేదిక వెల్లడించింది. పిల్లల ఎముకల ఆరోగ్యం, శరీర వృద్ధి, రోగనిరోధక శక్తికి కీలకమైన విటమిన్ డీ లోపం చిన్న వయసు నుంచే కనిపిస్తోందని పేర్కొంది. విటమిన్ డీ లోపానికి ప్రధాన కారణాలు సూర్యరశ్మి, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, కాలుష్యం, గాఢవర్ణ చర్మం, అధిక కొవ్వు, జన్యుపరమైన మార్పులు వంటి అంశాలేనని నివేదిక స్పష్టం చేసింది. జింక్ లోపం వలన పొట్టితనం (స్టంటింగ్), తరచూ వ్యాధులకు గురయ్యే అవకాశాలు పెరుగుతున్నాయని వైద్యులు హెచ్చరించారు. జింక్ లోపం వల్ల చిన్నారుల్లో మరణాలు, అనారోగ్యాలు ప్రపంచవ్యాప్తంగా 4 శాతం వరకు నమోదవుతున్నాయని గత అధ్యయనాలు తెలుపుతున్నాయి.

జీవనశైలీ సంబంధిత వ్యాధులు:

విటమిన్ డీ, జింకు లోపాలతో పాటు పిల్లల్లో జీవనశైలి సంబంధిత వ్యాధులు కూడా ఎక్కువగా కనిపిస్తున్నట్లు 'చిల్డ్రన్ ఇన్ ఇండియా 2025' నివేదికలో వెల్లడైంది. చిన్న వయసులోనే ట్రైగ్లిజరైడ్లు అధికంగా ఉంటే, గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

తగ్గిన శిశు మరణాలు:

దేశంలో శిశు మరణాల రేటు (ఐఎంఆర్) 2023లో ప్రతి వెయ్యి జననాలకు 25గా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో 28 ఉండగా, పట్టణాల్లో 18గా నమోదైంది. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లలో అత్యధికంగా (37), అత్యల్పంగా కేరళలో (5)గా నమోదైంది. అదేవిధంగా దేశంలో ఐదేళ్లలోపు పిల్లల మరణాల రేటు 29గా నమోదైంది. గ్రామీణ ప్రాంతాల్లో 33, పట్టణాల్లో 20గా ఉంది.

దోహాపై దాడికి సారీ!

» ఖతార్ ప్రధానికి వైట్‌హౌస్ నుంచి ఫోన్ చేసి చెప్పిన నెతన్యాహు



వాషింగ్టన్, సెప్టెంబరు 29: ఈ నెల 9న ఖతార్ రాజధాని దోహాలో ఉన్న హమాస్ నేతలపై ఇజ్రాయెల్ దాడులు చేసి చంపేసింది గుర్తుందా? ఆ దాడులపై ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు సోమవారం వైట్‌హౌస్‌లో ట్రంప్ సాక్షిగా.. ఖతార్ ప్రధాని మహ్మద్ బిన్ అబ్దుల్ రహమాన్ బిన్ జాసిమ్ అల్ తనీకి ఫోన్ చేసి క్షమాపణలు చెప్పినట్టు రాయ్‌టర్స్ వార్తా సంస్థ ఒక కథనంలో పేర్కొంది. గాజాలో యుద్ధాన్ని ముగించేందుకు సంబంధించిన ఒప్పందంపై చర్చించేందుకు నెతన్యాహును ట్రంప్ వైట్‌హౌస్‌కు ఆహ్వానించారు. ఈ సందర్భంగానే వారిద్దరూ ఖతార్ ప్రధానితో మాట్లాడినట్టు తెలుస్తోంది. హమాస్ నేతలపై దాడిలో భాగంగా ఖతార్ సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించినందుకే నెతన్యాహు క్షమాపణ చెప్పినట్టు సమాచారం. ఇజ్రాయెల్ దాడిలో హమాస్ నేతలతోపాటు ఖతార్‌కు చెందిన సెక్యూరిటీ గార్డ్ ఒకరు చనిపోయాడు. అతడి కుటుంబసభ్యులకు తాము పరిహారం చెల్లిస్తామని కూడా నెతన్యాహు హామీ ఇచ్చినట్టు తెలిసింది.

పీవోకేలో షెహబాజ్ సర్కారుకు సెగ

» హక్కుల కోసం గళమెత్తిన జనం.. వేలమందితో వీధుల్లో ప్రదర్శనలు
» హింసాత్మకంగా ఆందోళనలు.. ఇద్దరు మృతి.. 22 మందికి గాయాలు

ఇస్లామాబాద్/న్యూఢిల్లీ, సెప్టెంబరు 29: పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)లో ఆందోళనలు మిన్నంటాయి. అవామీ యాక్షన్ కమిటీ(ఏఏసీ) ఆధ్వర్యంలో పీవోకే వ్యాప్తంగా సోమవారం వేలాది మందితో ప్రదర్శనలు నిర్వహించారు. ఈ ఆందోళనలు హింసాత్మకంగా మారడంతో ముజఫరాబాద్‌లో ఇద్దరు మరణించగా, 22 మంది గాయాలపాలయ్యారు. నిరవధిక బంద్‌కు ఏఏసీ పిలుపునివ్వడంతో పాక్ ప్రభుత్వం భారీగా భద్రతా బలగాలను రంగంలోకి దించింది. పీవోకే వ్యాప్తంగా ఇంటర్నెట్‌ను నిలిపివేసింది. ప్రాథమిక హక్కుల కోసం నినదిస్తున్న పౌరులపైకి పాక్ సైన్యం కాల్పులు జరిపిందని ఆందోళనకారులు ఆరోపించారు.

ప్రభుత్వంతో చర్చలకు లేహ్ అపెక్స్ బాడీ షరతులు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 29: లద్దాఖ్‌కు రాష్ట్రహోదా, రాజ్యాంగపరమైన హామీల కోసం ఉద్యమాన్ని నడుపుతున్న లేహ్ అపెక్స్ బాడీ (ల్యాబ్) అక్టోబర్ 6న ఢిల్లీలో ప్రభుత్వంతో జరగనున్న చర్చలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. సెప్టెంబరు 24న జరిగిన కాల్పుల్లో నలుగురు ప్రాణాలు కోల్పోయిన ఘటనపై సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తిచే విచారణ జరపాలని, సోనమ్ వాంగ్‌చుక్‌తో సహా అరెస్టు చేసిన నిరసనకారులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేసింది. లద్దాఖ్‌లో ప్రశాంత వాతావరణం నెలకొల్పకపోతే తాము చర్చల్లో పాల్గొనడం అసాధ్యమని లేహ్ అపెక్స్ బాడీ అధ్యక్షుడు చెవాంగ్, ఉపాధ్యక్షుడు దోర్జె తేల్చిచెప్పారు.

చక్కని ర్యాంకులతో డిప్యూటీ కలెక్టర్లుగా..

- సిద్దాల కృతికకు ఐదో ర్యాంకు.. యాదాద్రిలో రిపోర్టు
- అనూషారెడ్డికి ఏడో ర్యాంకు.. సూర్యాపేటలో కొలువు
- హైదరాబాద్ రూరల్ సీటీవోగా కల్యాణ్ గౌడ్


సిద్దాల కృతిక, అనూషారెడ్డి

సరూర్‌నగర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1లో రాష్ట్ర స్థాయిలో ఐదో ర్యాంకు సాధించిన మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడకు చెందిన సిద్దాల కృతిక డిప్యూటీ కలెక్టర్‌గా నియామక పత్రం అందుకున్నారు. ఆమెను యాదాద్రి భువనగిరి జిల్లాకు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి సరూర్‌నగర్ మండల పరిషత్ మాజీ అధ్యక్షురాలు, మీర్‌పేట్ మాజీ కార్పొరేటర్ సిద్దాల లావణ్య బీరప్ప కుమార్తె కృతిక ఎలాంటి కోచింగ్ తీసుకోకుండా సొంతంగా ఇంట్లోనే పట్టుదలతో చదివి గ్రూప్-1లో ఐదో ర్యాంకు సంపాదించారు. గత ఏడాది గ్రూప్-4లో 511వ ర్యాంకు సాధించి కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సంపాదించారు. కాగా సోమవారం ఆమె తాను ప్రస్తుతం చేస్తున్న జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం నుంచి రిలీవ్ అయి యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్‌లో డిప్యూటీ కలెక్టర్‌గా రిపోర్ట్ చేశారు. ఉమ్మడి సరూర్‌నగర్ మండల రెవెన్యూ కార్యాలయంలో, అనంతరం బాలాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోగా, ఆ తర్వాత బడంగ్‌పేట్ మునిసిపల్ కార్పొరేషన్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించిన ఎల్బీనగర్‌కు చెందిన కె.అనూషారెడ్డి గ్రూప్-1 పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో 7వ ర్యాంకు సాధించారు. శనివారం ఆమెకు నియామక పత్రం అందజేసిన అధికారులు.. ఆమెను సూర్యాపేట జిల్లాకు కేటాయించారు. ఈ క్రమంలో సోమవారం ఆమె బడంగ్‌పేట్‌లో సీనియర్ అసిస్టెంట్ ఉద్యోగం నుంచి రిలీవ్ అయి సూర్యాపేట్‌కు వెళ్లి జాయినింగ్ రిపోర్ట్ అందజేశారు. బడంగ్‌పేట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న అనుషారెడ్డితో పాటు జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ముద్దగోని కల్యాణ్‌గౌడ్ గ్రూప్-1లో పరీక్షల్లో 173వ ర్యాంకు సాధించారు. బాలాపూర్ మండలంలోని నాదర్‌గుల్‌కు చెందిన కల్యాణ్.. గ్రూప్-4 ద్వారా జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరి, పట్టువదలకుండా గ్రూప్-1 పరీక్షల రాసి ఉత్తమ ర్యాంకు సొంతం చేసుకున్నారు. ఆయన తాజా నియామకాల్లో హైదరాబాద్ రూరల్ సీటీవో(కమర్షియల్ టాక్స్ ఆఫీసర్)గా ఎంపికయ్యారు. ఆయన కూడా సోమవారం బడంగ్‌పేట్ నుంచి రిలీవ్ అయి సీటీవో కార్యాలయంలో రిపోర్ట్ చేశారు. కాగా తమ మునిసిపల్ కార్యాలయం నుంచి ఇద్దరు ఉద్యోగులు మంచి ర్యాంకులతో ఉన్నత ఉద్యోగాలు సంపాదించినందుకుగాను మునిసిపల్ కమిషనర్ పి.సరస్వతి ఆధ్వర్యంలో అనుషారెడ్డి, కల్యాణ్‌గౌడ్‌లను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపి వీడ్కోలు పలికారు.

వైద్య పరిషత్ ఆస్పత్రుల్లో 50 పీజీ సీట్లు

- త్వరలో ప్రత్యేక కాలేజీలుగా ఏర్పాటు.. 6 ప్రాంతీయ ఆస్పత్రుల ఎంపిక

హైదరాబాద్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వైద్యవిధాన పరిషత్ (టీవీవీపీ) పరిధిలోని ఆరు ప్రాంతీయ ఆస్పత్రుల్లో కొత్తగా మొత్తం 50 పీజీ సీట్లతో ప్రత్యేక కళాశాలల(స్టాండ్ ఎలోన్ కాలేజీ)ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2026 విద్యా సంవత్సరం నుంచి ఇవి అందుబాటులోకి తెచ్చేందుకు యత్నిస్తోంది. ఈ మేరకు సోమవారం వైద్య ఆరోగ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తు టీవీవీపీ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ ప్రత్యేక కాలేజీలకు అదనపు అధ్యాపక సిబ్బందిని మంజూరు చేయాలని ఇప్పటికే టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ ప్రభుత్వానికి లేఖ కూడా రాశారు. ఈ 50 పీజీ సీట్ల కోసం 25 మంది ప్రొఫెసర్లు, మరో 25 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, ఇంకో 25 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు అవసరమవుతారని లేఖలో పేర్కొన్నారు. ఈ 50 పీజీ సీట్లలో 6 గైనకాలజీ, 6 పిడియాట్రిక్స్, 6 జనరల్ మెడిసిన్, 12 జనరల్ సర్జరీ, 4 ఈఎన్‌టీ, 8 ఆర్థోపెడిక్, 2 రేడియాలజీ, 4 ఆప్తమాలజీ, 2 పాథాలజీ ఉన్నాయి. ఈ పీజీ సీట్ల కోసం జాతీయ వైద్య కమిషన్‌కు త్వరలోనే దరఖాస్తు చేయనున్నట్లు వైద్య వర్గాలు వెల్లడించాయి. ఇంకా ఎన్‌ఎంసీ కొత్త పీజీ సీట్ల దరఖాస్తు కోసం వెబ్‌సైట్ ఓపెన్ చేయలేదని, త్వరలోనే చేస్తుందని ఆ వర్గాలు పేర్కొన్నాయి.

భువనగిరిలో దొంగనోట్ల కలకలం

- రూ.11 వేల నకిలీ నోట్ల మార్పిడికి యత్నం

భువనగిరి టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో యూపీఐ ద్వారా డబ్బులు పంపించే నెపంతో నకిలీ నోట్లు ఇచ్చిన ఘటన సోమవారం కలకలం సృష్టించింది. పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన కార్మికుడు స్థానిక మొబైల్‌షాప్ యజమాని వద్దకు వెళ్లి తమ కుటుంబసభ్యులకు రూ.11వేలు పంపాలని చెప్పి.. 22 ఐదు వందల రూపాయల నోట్లు ఇచ్చాడు. నగదు పంపించాక.. అవి నకిలీవని అనుమానించిన షాపు యజమాని, కార్మికుడిని పరిసర ప్రాంతంలోనే వెతికి పట్టుకున్నాడు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ రమేష్ తెలిపారు. అయితే, మూడు నెలల కిందట స్థానిక జాతీయ బ్యాంక్ బ్రాంచ్‌లో కూడా నకిలీ నోట్లను గుర్తించిన అధికారులు హైదరాబాద్‌లోని బ్యాంక్ ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. అలాగే పట్టణానికి చెందిన ఓ వైద్యుడికి కూడా ఇటీవలే ఒకరూ.500, మరో రూ.200 నకిలీ నోట్లు వచ్చాయి.

వచ్చే ఎన్నికల నాటికి బీఆర్‌ఎస్ ఉండదు

- ఆ పార్టీ నేతలందరూ బీజేపీలో చేరుతారు
- తపస్సు చేసినా కేటీఆర్ ముఖ్యమంత్రి కాలేరు
- మీడియాతో చిట్‌చాట్‌లో ఎంపీ అర్వింద్

హైదరాబాద్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల నాటికి బీఆర్‌ఎస్‌ఉనికి ఉండబోదని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ జోస్యం చెప్పారు. ఈ విషయాన్ని తాను స్టాంప్ పేపర్‌పై రాసిస్తానని ప్రకటించారు. బీఆర్‌ఎస్ నాయకులందరూ బీజేపీలో చేరతారని తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ మధ్యనే పోటీ ఉంటుందన్నారు. బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ రంగంలోకి దిగే పరిస్థితి లేదని, ఎన్నేళ్లు తపస్సు చేసినా కేటీఆర్ సీఎం కాలేరని స్పష్టం చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం అర్వింద్ మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. వచ్చే ఎన్నికలు జమిలి అయ్యే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. కవిత.. ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేదని చెప్పారు. "నిజామాబాద్ జిల్లా కోడలిగా కవితను భావిస్తూ ఆమె శ్రేయోభిలాషిగా చెబుతున్నా.. కొత్త పార్టీ ఏర్పాటు చేయవద్దని ఆమెను కోరుతున్నా" అని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక బాధ్యత కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిదే అని వ్యాఖ్యానించారు. నిజామాబాద్ జడ్పీ చైర్మన్ పీఠాన్ని తాము గెలుచుకోబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు.

అర్ధరాత్రి హైవేపై దొంగల హల్‌చల్!

- ఆగి ఉన్న లారీల డ్రైవర్లే లక్ష్యంగా దాడులు
- కత్తులతో బెదిరించి డబ్బులు దోచుకొని పరారీ..
- అడ్డుకున్న ఓ డ్రైవర్‌కు కత్తిపోట్లు.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన

పటాన్‌చెరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి హైవే (161వ నంబర్ జాతీయ రహదారి)పై దోపిడీ దొంగలు హల్‌చల్ చేశారు. రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీ డ్రైవర్లనే లక్ష్యంగా చేసుకొని కత్తులతో బెదిరించి వారి వద్ద దొరికిన కాడికి దోచుకుని ఉడాయించారు. ఈ క్రమంలోనే ప్రతిఘటించిన ఓ లారీ డ్రైవర్‌ను కత్తితో పొడవగా.. అతడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆదివారం రాత్రి సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. హైదరాబాద్ వనస్థలిపురం ప్రాంతానికి చెందిన లారీ డ్రైవర్ నూర్ షేక్.. సూరత్‌కు వెళ్లి వస్తుండగా రుద్రారం సమీపంలో లారీ ఆగిపోయింది. అయితే అతడి సమాచారంతో మేనేజర్ దేశ్‌ముఖ్ రాఘవేందర్ ఓ మెకానిక్‌ను తీసుకొచ్చి మరమ్మతులు చేయించాడు. ఇదే క్రమంలో రాఘవేందర్ లారీ క్యాబిన్‌లో నిద్రపోగా.. బైక్‌పై వచ్చిన ముగ్గురు దుండగులు అతడిపై దాడి చేసి రూ.5 వేలు లాక్కొని ఉడాయించారు. ముత్తంగి ఔటర్ వంతెన కింద లారీ ఆపిన మంచిర్యాలకు చెందిన లారీ డ్రైవర్ ఎండీ వసీంపై అనంతరం దాడికి పాల్పడ్డారు. అతడితో పాటే ఉన్న గుమస్తా తోటరాజు వద్ద రూ.15 వేలు నగదు లాక్కొని పరారయ్యారు. అంతకుముందుకు కొండాపూర్ వెంకటేశ్వర ఫంక్షన్ హాలు ఎదురుగా లారీ ఆపిన డ్రైవర్ ఆసిఫ్ (36)పై డబ్బుల కోసం ఆ ముగ్గురు దుండగులే దాడి చేశారు. అతడు ప్రతిఘటించడంతో కత్తితో పక్కటెముకల్లో పొడిచి పరారయ్యారు. తీవ్రగాయాలైన ఆసిఫ్‌ను హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. కాగా, వరుస దోపిడీలకు పాల్పడిన ముగ్గురు దుండగులను పటాన్‌చెరు పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

సీపీగెట్ మొదటి విడత జాబితా విడుదల

- పీజీలో 20,467 మందికి ప్రవేశాలు

హైదరాబాద్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే సీపీగెట్ మొదటి విడత ఎంపిక జాబితాను తెలంగాణ ఉన్నత విద్యామండలి ప్రకటించింది. మొత్తం 28,145 మంది వెబ్‌ఆప్షన్లు ఇవ్వగా.. 20,467 మందికి సీట్లు కేటాయించామని సీపీగెట్ కన్వీనర్ ఆచార్య పాండురంగారెడ్డి తెలిపారు. వారిలో 14,688 మంది మహిళలు, 5,779 పురుషులు ఉన్నట్లు తెలిపారు. సీటు సాధించినవారు అక్టోబరు 8లోపు సంబంధిత కళాశాలలో ఫీజు చెల్లించి, బదిలీ ధ్రువీకరణ పత్రం (టీసీ) సమర్పించాలని చెప్పారు.

ఉపాధ్యాయులకు టెట్ మినహాయించాలి: జాక్టో

హైదరాబాద్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం అమల్లోకి వచ్చిన 2010 సంవత్సరానికి ముందు ఉద్యోగంలో చేరిన ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నుంచి మినహాయింపు ఇవ్వాలని ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి (జాక్టో) ప్రభుత్వాన్ని కోరింది. అలాగే పాఠశాల విద్యలో అన్ని విభాగాల్లో మిగిలిపోయిన పోస్టులకు పదోన్నతులు కల్పించాలని, ఉపాధ్యాయులందరికీ ఆరోగ్య కార్డులు ఇవ్వాలని జాక్టో చైర్మన్ సదానందం గౌడ్, సెక్రటరీ జనరల్ కె.కృష్ణుడు, ప్రతినిధులు జి.రాములు, బిఎస్.యాదవ్, పార్థ అంజయ్య సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

కర్ణాటక హైకోర్టు తీర్పుపై అప్పీల్ చేస్తాం

- వెల్లడించిన సోషల్ మీడియా సంస్థ ఎక్స్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 29: కర్ణాటక హైకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పుపై అప్పీల్ చేస్తామని సోషల్ మీడియా సంస్థ 'ఎక్స్' వెల్లడించింది. కొన్ని పోస్టులు తొలగింపుపై కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు పాటించాలంటూ చెప్పిన ఆ తీర్పు తీవ్ర ఆందోళనకరమని ఓ ప్రకటనలో పేర్కొంది. కోర్టు ఉత్తర్వులతో సహ్యోగ్ పోర్టల్ ద్వారా లక్షల మంది పోలీసులు సోషల్ మీడియాలో పోస్టులు తొలగించాలంటూ ఏకపక్షంగా ఆదేశాలు ఇచ్చే అవకాశం ఉందని అభిప్రాయపడింది. దానివల్ల ఖాతాదారులకు న్యాయపరమైన రక్షణ లభించదని ఆందోళన వ్యక్తం చేసింది. అందువల్లనే స్వేచ్ఛగా అభిప్రాయాలు వెల్లడించేందుకు కోర్టు ఆదేశాలపై అప్పీలుకు వెళ్తామని చెప్పింది. తమ ఖాతాదారుల హక్కులను కాపాడతామని పేర్కొంది. రాజ్యాంగానికి, చట్టానికి అనుగుణంగా ఆన్‌లైన్‌కు సంబంధించిన ఏ నియంత్రణ అయినా ఉండేలా చూడాలని తెలిపింది. కొన్ని ఖాతాలను బ్లాక్ చేయాలని, పోస్టులు తొలగించాలని కేంద్రం ఇచ్చిన ఆదేశాలను కర్ణాటక హైకోర్టులో ఎక్స్ సవాల్ చేయగా, ఆ పిటిషన్లను ఇటీవల కోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. సోషల్ మీడియా సంస్థల పట్ల నిర్లక్ష్యంగా ఉండరాదని, ప్రస్తుత తరుణంలో వాటిపై నియంత్రణ ఉండాల్సిన అవసరం ఉందని తీర్పు సందర్భంగా కోర్టు అభిప్రాయపడింది. భారత చట్టాలను ఎక్స్ పాటించాలని కూడా వ్యాఖ్యానించింది. పోస్టుల తొలగింపు ఆదేశాలకు చట్టంలో ఎలాంటి ఆధారం లేదని, ఐటీ చట్టంలోని 69ఏ సెక్షన్‌ను ఆ ఆదేశాలు అతిక్రమిస్తాయని ఎక్స్ పేర్కొంది. సుప్రీం కోర్టు ఇచ్చిన పలు తీర్పులను కూడా అవి ఉల్లంఘిస్తున్నాయంది. ప్రజల వాక్ స్వాతంత్ర్యాన్ని కూడా అవి దెబ్బతీస్తాయని తెలిపింది. బాంబే హైకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పునకు విరుద్ధంగా ఈ తీర్పు ఉందని చెప్పింది. లక్షలాది మంది గళాలకు ఆధారం అవ్వడం ద్వారా భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో తమ పాత్ర ఎంతో కీలకమంది.

రూ.9.93 కోట్ల డ్రగ్స్ పట్టివేత

- ఇద్దరు విదేశీయుల సహా ఏడుగురి అరెస్టు

బెంగళూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో డ్రగ్స్ విక్రయిస్తున్న ఇద్దరు విదేశీయులు సహా ఏడుగురిని సీసీబీ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. మొత్తం ఐదు కేసుల్లో 3.858 కేజీల ఎండీఎంఏ క్రిస్టల్, 41 గ్రాముల ఎక్స్‌టసీ పిల్స్, 1.82 కేజీల హైడ్రో గాంజా, 6 కేజీల గంజాయి, ఒక కారు, ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన మత్తు పదార్థాల విలువ రూ.9.93 కోట్లు ఉంటుందని పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్నవాటిలో విదేశాల నుంచి ఓ పోస్టాఫీసుకు వచ్చిన రూ.కోటి విలువైన డ్రగ్స్ కూడా ఉన్నాయి. వైట్‌ఫీల్డ్, సర్జాపుర ప్రాంతంలోని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకు సరఫరా చేసేందుకు డ్రగ్స్‌ను సిద్ధం చేసుకున్నట్టు పోలీసులు గుర్తించారు. పట్టుబడిన వారిలో నైజీరియాకు చెందిన థామస్ నవిడ్‌చిమ్, ఎన్‌గ్వూ కింగ్‌స్లే, డెంటల్ కాలేజీ విద్యార్థి రంజిత్ ఆంటోని ఉన్నారు.

మళ్లీ సాగు నీటి సంఘాలు!

తొలుత చెరువులు, కాలువలకు, ఆ తర్వాత భారీ ప్రాజెక్టులకు విస్తరణ

- సంఘాల కింద లష్కర్‌ల విధులు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



సచివాలయంలో అధికారులతో సమీక్షలో మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): చెరువులు, కాలువల నిరంతర నిర్వహణ, నీటి విడుదలపై పర్యవేక్షణ కోసం గతంలో మాదిరి సాగు నీటి వినియోగ సంఘాలు ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారని, ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నామని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. తొలుత ప్రయోగాత్మకంగా చెరువుల, కాలువల కింద సంఘాలు ఏర్పాటు చేసి, ఆ తర్వాత భారీ ప్రాజెక్టులకు విస్తరించే యోచనలో ఉన్నామన్నారు. సాగు నీటి సంఘాల కింద లష్కర్‌లు పనిచేస్తారని, ఈ సంఘాలకు కన్వీనర్‌గా నీటిపారుదల శాఖ అధికారులు ఉంటారని వెల్లడించారు. సోమవారం సచివాలయంలో నీటిపారుదల శాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ ప్రయోజనాలు కాపాడటంతో పాటు సాగు నీటి అంశంలో ఏ అవాంతరాలు ఎదురుకాకుండా ఉండేలా సాగునీటి సంఘాల ఏర్పాటు ఉంటుందని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం సాగునీటి సంఘాల ఏర్పాటు ఉంటుందన్నారు. 2018-19లో నీటి తీరువా రద్దు చేయడంతో సాగునీటి సంఘాలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని, ఆ పర్యావసనాల ఫలితంగా తాజాగా సంభవించిన వరదల్లో చెరువులు, కుంటలు, కాలువలు దెబ్బతిన్నాయన్నారు. తెలంగాణ వ్యవసాయ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి సిఫారసుల ప్రకారం సాగు నీటి సంఘాలకు బాధ్యులను నామినేట్ చేసే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. సీతారామ ఎత్తిపోతల పథకం/సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టు, చనాకా కొరాటా, మొడికుంటవాగు వంటి ప్రాజెక్టులకు పెట్టుబడి అనుమతి (ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్) తీసుకొని, ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన (పీఎంకేఎస్‌వై) కింద దరఖాస్తు చేయాలన్నారు. ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతల పథకం డీపీఆర్ తయారీలో జాప్యంపై అధికారులను మంత్రి నిలదీశారు. వచ్చే మంత్రివర్గ సమావేశానికి ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌కు సంబంధించిన సవరణ అంచనాల ఫైలును నిబంధనల మేరకు సిద్ధం చేసి పంపించాలన్నారు. అలాగే చిన్న కాళేశ్వరం, కల్వకుర్తి, దేవాదుల ప్యాకేజీ సవరణ అంచనాలపైనా ఆ సమావేశంలో చర్చించాల్సి ఉంటుందని చెప్పారు.

కేటీఆర్‌వి పిచ్చి మాటలు

కృష్ణా ట్రిబ్యునల్-2 (జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్) నీటి కేటాయింపులపై ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టులో స్టే ఉందని.. దీంతో ఆల్మట్టి ఎత్తు పెంచే అవకాశాల్లేవని మంత్రి ఉత్తమ్ చెప్పారు. మీడియా తో ఆయన చిట్‌చాట్ చేశారు. ప్రాజెక్టులపై కేటీఆర్ పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని, రాజకీయ లబ్ధి కోసం అడ్డగోలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కృష్ణా, గోదావరి జలాల వాటా విషయంలో తెలంగాణకు అన్యాయం జరగనివ్వబోమని ప్రకటించారు. కాగా, మంగళవారం ఉత్తమ్ ఢిల్లీకి వెళ్లనున్నారు. పౌరసరఫరాల శాఖకు సంబంధించిన పలు సమస్యలపై కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసి వినతి పత్రం ఇవ్వనున్నారు. భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) ఈ వానాకాలం సీజన్‌కుగాను 53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు అనుమతినిచ్చింది. అయితే రాష్ట్రంలో ఉత్పత్తి, సేకరణ పెరుగుతున్న నేపథ్యంలో.. 80 లక్షల మెట్రిక్ టన్నులకు అనుమతి ఇవ్వాలని కేంద్ర మంత్రిని ఉత్తమ్ కోరనున్నారు. 2024-25 యాసంగి సీజన్‌కు సంబంధించిన బియ్యం అప్పగింతకు అక్టోబరు 31 వరకే ఉన్న గడువును 3 నెలలు పొడిగించాలని కోరనున్నారు.

'లద్దాఖ్' మృతుల్లో కార్గిల్ యుద్ధ వీరుడు

- ఇది వేదన కలిగించే విషయం: కాంగ్రెస్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 29: లద్దాఖ్‌కు రాష్ట్రహోదా కల్పించాలన్న డిమాండ్‌తో ఇటీవల జరిగిన హింసాత్మక ఆందోళనల సందర్భంగా భద్రతా బలగాల కాల్పుల్లో మరణించిన వారిలో కార్గిల్ యుద్ధ వీరుడు, మాజీ సైనికుడు త్సేవాంగ్ థార్చిన్ ఉండడం తీవ్ర ఆగ్రహం తెప్పించే, వేదన కలిగించే విషయమని కాంగ్రెస్ పేర్కొంది. ఈ మేరకు ఆ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ సోమవారం 'ఎక్స్'లో ఓ పోస్టు చేశారు. థార్చిన్ సియాచిన్ గ్లేసియర్‌లో సేవలు అందించారని, 1999 కార్గిల్ యుద్ధంలో వీరోచితంగా పోరాడారన్నారు. ఆయన తండ్రి కూడా భారత సైన్యంలో పనిచేశారని పేర్కొన్నారు. లద్దాఖ్‌కు ఆరో షెడ్యూల్ హోదా కల్పించాలని త్సేవాంగ్ థార్చిన్ శాంతియుత ఆందోళనల్లో పాల్గొన్నారని అన్నారు. కాగా, హింసాత్మక ఆందోళనల నేపథ్యంలో లేహ్‌లో విధించిన కర్ఫ్యూ సోమవారం ఆరో రోజు కూడా కొనసాగింది. భద్రతా పరిస్థితులపై లెఫ్టినెంట్ గవర్నర్ కవిందర్ గుప్తా ఉన్నతాధికారులతో సమీక్ష చేశారు.

చెన్నై విమానాశ్రయంలో రూ.35 కోట్ల కొకైన్ స్వాధీనం

చెన్నై, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కంబోడియా నుంచి వచ్చిన రూ.35 కోట్ల విలువైన కొకైన్‌ను చెన్నై విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం కంబోడియా నుంచి సింగపూర్ మీదుగా వచ్చిన ఓ వ్యక్తి నడవడిక అనుమానాస్పదంగా ఉండడంతో కస్టమ్స్ అధికారులు అతనిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. అతని లోదుస్తుల్లో ఉన్న కొకైన్ బయల్పడింది. దానిని స్వాధీనం చేసుకున్న అధికారులు.. అతనిని అరెస్టు చేశారు.


జీహెచ్‌ఎంసీ కార్మికులతో కలసి అల్పాహారం చేస్తున్న మంత్రి పొన్నం, మేయర్

ఆకలి లేని హైదరాబాదే లక్ష్యం!

- రూ.5కే అల్పాహారం, భోజనం
- ఇందిరమ్మ క్యాంటీన్ ప్రారంభోత్సవంలో మంత్రి పొన్నం
- త్వరలో గ్రేటర్‌వ్యాప్తంగా 150 క్యాంటీన్లు : మేయర్

ఖైరతాబాద్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనకు కృషిచేసిన ఇందిరా గాంధీ స్ఫూర్తితో, ఆకలి బాధలు లేని హైదరాబాద్ లక్ష్యంగా ఇందిరమ్మ క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. సోమవారం ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్, మోతీనగర్‌లలో ఈ క్యాంటీన్లను మంత్రి ప్రారంభించారు. ప్రారంభోత్సవం అనంతరం ఆయన స్వయంగా జీహెచ్‌ఎంసీ పారిశుధ్య కార్మికులకు భోజనం వడ్డించి, వారితో కలసి అల్పాహారం రుచి చూశారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ఇప్పటివరకు నగరంలో అమలులో ఉన్న రూ.5 మధ్యాహ్న భోజనం పథకానికి బదులుగా, ఇకపై ఈ కొత్త ఇందిరమ్మ క్యాంటీన్లలో ఉదయం రూ.5కే పలు రకాల అల్పాహారంతో పాటు మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. పేదలు అక్కడే కూర్చుని భుజించే సదుపాయం కూడా కల్పించామని పేర్కొన్నారు. వాస్తవానికి అల్పాహారం తయారీకి రూ.19, మధ్యాహ్న భోజనానికి రూ.30 ఖర్చవుతున్నా.. పేదలకు కేవలం రూ.5కే అందిస్తున్నామని వివరించారు. హైదరాబాద్ వ్యాప్తంగా 150 వరకు ఇందిరమ్మ క్యాంటీన్లు ప్రారంభిస్తామని గ్రేటర్ మేయర్ గద్వాల విజయలక్ష్మి తెలిపారు. క్యాంటీన్ల నిర్వహణ బాధ్యతలను స్వయం సహాయక సంఘాలకు అప్పగించాలని ఎమ్మెల్యే దానం నాగేందర్ సూచించారు. జీహెచ్‌ఎంసీ, హరే కృష మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ సహకారంతో ఈ క్యాంటీన్లు నడుస్తున్నాయి. తొలి రోజున మిల్లెట్ ఇడ్లీ, ఉప్మా, పొంగల్, పూరీ వంటి ఆరు రకాల రుచికరమైన అల్పాహారం అందించారు.

పండుగ వేళ విషాదం

వేర్వేరు ఘటనల్లో ఐదుగురి దుర్మరణం


మృతులు భాస్కర్, వినోద్, రవి, అశోక్‌రెడ్డి(ఫైల్)

దేవరకొండ, చింతపల్లి, కన్నాయిగూడెం, హయత్‌నగర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ పండుగ వేళ సోమవారం జరిగిన వేర్వేరు ఘటనలు ఐదు కుటుంబాల్లో విషాదం నింపాయి. దసరా పండుగకు సామగ్రి తీసుకుని ఆటోలో వస్తున్న ముగ్గురు యువకులు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడగా.. బతుకమ్మ పూల కోసం వెళ్లి ఇద్దరు చనిపోయారు. నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం ముదిగొండ పరిధి మటికతండాకు చెందిన రాత్లావత్ భాస్కర్(30), రాత్లావత్ వినోద్(28), ఉల్పరాల జర్పులతండాకు చెందిన సభావట్ రవి(29), జర్పుల కృష్ణలు హైదరాబాద్‌లో ఆటో నడుపుతుంటారు. సోమవారం తండాకు వచ్చిన వారు.. ఆటోలో పండుగ సామగ్రి, వస్తువులు తీసుకొస్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భాస్కర్, వినోద్, రవి అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన జర్పుల కృష్ణను స్థానికులు హైదరాబాద్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన ఆటోలో పోలీసులు మద్యం సీసాలను గుర్తించారు. మరో ఘటనలో.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన సోడి లక్ష్మణ్(22) జీవనోపాధి కోసం ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని చిట్యాల గొత్తికోయ గూడెంలో ఉంటున్నాడు. ఓ రైతు బతుకమ్మ పూలు తీసుకురమ్మని చెప్పడంతో చిట్యాల సమీపంలోని చెరువులో నీట మునిగిచనిపోయాడు. అలాగే, నల్లగొండ జిల్లా మునుగోడు శేరిగూడెంకు చెందిన సురకంటి అశోక్‌రెడ్డి(59) లారీ డ్రైవర్. హయత్‌నగర్‌లోని గ్రీన్‌వుడ్ కాలనీలో ఉంటున్నాడు. సోమవారం సద్దుల బతుకమ్మ పండుగ ఉండడంతో పూలు తీసుకురావడానికి వెళ్తూ ప్రమాదవశాత్తూ మూతలేని సెప్టిక్ ట్యాంకులో పడి మృతి చెందాడు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

అద్భుత విజయం

అదే దృశ్యం మళ్లీ సాక్షాత్కరమైంది. సంబరం అంబరాన్నంటింది. పండుగ రెండ్రోజుల ముందే వచ్చేసింది. దేశంలోని ప్రతి క్రీడాభిమాని సగర్వంతో సంబరం చేసుకునేలా అద్భుతాన్ని ఆవిష్కృతం చేసింది భారత క్రికెట్ జట్టు. ప్రతిష్ఠాత్మక ఆసియా కప్ టోర్నమెంట్‌లో తొమ్మిదోసారి చాంపియన్‌గా నిలిచింది. మెగా టోర్నీల్లో విజయాలు సాధించడం మన జట్టుకు సాధారణమే అయినప్పటికీ, ఇటీవలి పరిణామాల నేపథ్యంలో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను చిత్తుచేసి విజేతగా నిలవడమే కోట్లాదిమంది భారతీయులకు ఆనందాన్ని పంచే విషయం.

భారత్, పాకిస్థాన్ జట్ల మధ్య ఏ స్థాయి క్రికెట్ పోటీ అయినా సరే అసంఖ్యాక క్రీడాభిమానుల్ని ఆకట్టుకుంటుంది. అందునా, ఉద్వేగం, ఉత్కంఠకు మారుపేరైన ధనాధన్ పొట్టి క్రికెట్ సమరమైతే, చెప్పేదేముంది? కానీ, ఈసారి ఆసియా కప్ ఆరంభ సమయంలో చిరకాల ప్రత్యర్థుల పోరు పట్ల ఎప్పటిలా హడావిడి లేదు. ఉత్కంఠ, భావోద్వేగాలు లేవు. పహల్గాంలో పాక్ ముష్కరుల పైశాచిక కాండను మరిచిపోయారా? పాక్‌తో భారత్ మ్యాచ్‌ను బహిష్కరించాల్సిందే అంటూ బాధిత కుటుంబాల విమర్శలు, వివిధ వర్గాల నుంచి ఎదురైన ఒత్తిడి మధ్య ఇరు జట్ల పోరు మొదలైంది. గ్రూప్ దశలో ఓసారి, సూపర్–4లో మరోసారి పాకిస్థాన్‌ను భారత్ చిత్తుచేసింది. ఈ పరిస్థితుల్లో ఈ జట్ల మధ్య పోరుపై అంతగా ఆసక్తి లేకుండా పోయింది. భారత జట్టు టోర్నీ ఆరంభం నుంచే అద్భుత ఫామ్ కనబరుస్తూ, యూఏఈ, బంగ్లాదేశ్, శ్రీలంక, పాక్, ఇలా ఎదుర్కొన్న ప్రతి జట్టునూ మట్టి కరిపించి అజేయంగా ఫైనల్ చేరితే... పడుతూ, లేస్తూ పాక్ తుది పోరుకు అర్హత సాధించింది. దాయాది జట్లు తలపడిన ఫైనల్ మాత్రం భారత్, పాక్ మధ్య పోరు ఎలా ఉండాలని సగటు క్రికెట్ అభిమాని కోరుకుంటాడో అలాగే సాగింది. మ్యాచ్ అనూహ్య మలుపులు తిరుగుతూ, ఆధిపత్యం చేతులు మారుతూ, ఆద్యంతం ఉత్కంఠ రేకెత్తించింది. మొదట బ్యాటింగ్ చేసిన ప్రత్యర్థిని బౌలర్ కుల్దీప్ యాదవ్ మాయాజాలంతో స్వల్ప స్కోరుకే కట్టడి చేసిన సూర్యకుమార్ సేన.. ఛేదనలో మాత్రం ఓ దశలో తడబాటుకు గురైంది. ఫైనల్‌కు ముందు దాదాపు ప్రతి మ్యాచ్‌లోనూ బ్యాటుతో పరుగుల వరద పారించిన ఓపెనర్ అభిషేక్ శర్మ అసలైన పోరులో నిరాశపరిచాడు. ఓ దశలో టాప్ బ్యాటర్లంతా పెవిలియన్ చేరి విజయంపై ఆశలు అడుగంటుతున్న తరుణంలో మైదానంలో కొచ్చిన తెలుగు క్రికెటర్ తిలక్ వర్మ సందర్భానికి తగినట్టుగా ఆడాడు. అంత ఒత్తిడిలోనూ ప్రత్యర్థి బౌలర్ల భరతం పడుతూ అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. అతను చివరిదాకా క్రీజులో నిలిచి చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడడంతో భారత్ మరోమారు ఆసియా విజేతగా ఆవిర్భవించింది. ఐసీసీ టోర్నమెంట్లలో ఎదురైన ప్రతిసారి పాకిస్థాన్‌ను చిత్తుచేస్తున్న భారత్, ఈసారీ అదే సంప్రదాయాన్ని కొనసాగించింది. వేదిక ఏదైనా, పిచ్ ఎలాంటిదైనా, ఆటగాళ్లు మారినా, తమను ఎవరూ ఆపలేరని టీమిండియా రుజువు చేసింది. పహల్గాం ఉన్మాదంలో ప్రాణాలొదిలిన పర్యాటకులకు ఆపరేషన్ సిందూర్‌తో భారత ప్రభుత్వం, సాయుధ బలగాలు ఘనంగా నివాళి అర్పిస్తే.. యుద్ధ భూమిలోనే కాదు, క్రీడాక్షేత్రంలోనూ తమదే పైచేయి అని మన క్రికెటర్లు ఆపరేషన్ ఆసియా కప్ రూపంలో చాటి చెప్పారు. 2023 ఆసియా కప్ ఫైనల్లో శ్రీలంకపై హైదరాబాద్ క్రికెటర్ మహ్మద్ సిరాజ్ ఆరు వికెట్లతో విజృంభించి భారత్‌కు ట్రోఫీ అందిస్తే.. తాజా టోర్నమెంట్ ఫైనల్లో తిలక్ వర్మ రూపంలో మరో తెలుగు ఆటగాడే ప్రధాన భూమిక పోషించడం విశేషం.

ఆసియా కప్ సందర్భంగా పాకిస్థాన్ క్రికెటర్లలో కొందరు క్రీడా స్ఫూర్తికి విరుద్ధంగా ప్రవర్తించి తమ వెకిలి బుద్ధిని చాటుకున్నారు. భారత్‌తో సూపర్–4 మ్యాచ్‌లో అర్ధ సెంచరీ చేసిన అనంతరం పాక్ ఓపెనర్ ఫర్హాన్ బ్యాట్‌ను తుపాకి తరహాలో పైకెత్తి బుల్లెట్లు పేల్చుతున్నట్టుగా పహల్గామ్ దాడిని గుర్తుచేస్తూ సంబరాలు చేసుకుంటే.. ఆపరేషన్ సిందూర్‌లో భారత్‌కు చెందిన ఆరు విమానాలను కూల్చేశామనేలా బౌలర్ హారిస్ రౌఫ్ తన ఆరు వేళ్లను ప్రేక్షకులకు చూపించాడు. పాక్ ఆటగాళ్లు ఎంత రెచ్చగొట్టేలా వ్యవహరించినా, భారత క్రికెటర్లు మాత్రం ఎక్కడా సంయమనం కోల్పోలేదు. చివరకు విజయంతోనే ప్రత్యర్థికి బుద్ధి చెప్పారు. విజేతగా ఆవిర్భవించిన భారత జట్టు ట్రోఫీని పాక్ మంత్రి, ఆసియా క్రికెట్ కౌన్సిల్ చైర్మన్ మొహిసిన్ నక్వీ చేతులమీదుగా అందుకునేందుకు నిరాకరించింది. టోర్నీలో ప్రత్యర్థి ఆటగాళ్లతో కరచాలనం చేసేందుకు కూడా మన క్రీడాకారులు అంగీకరించలేదు.

సమ్మిళిత సమతా సమాజ స్వాప్నికులు

'ఈ సమావేశానికి ఒక యువకుడు అధ్యక్షత వహిస్తున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది' అని సునీతాతాయి అన్నారు. పూణేలో సమాజ్‌వాది ఏక్‌జుతాత సమ్మేళన్‌లో ఒక సమావేశానికి అధ్యక్షత వహించేందుకు అవినాష్ పాటిల్‌ను ఆహ్వానిస్తూ ఆమె అన్న మాటలవి. 'నాకు ఇప్పుడు 55 సంవత్సరాలు. నేను ఎలా యువకుడిని అవుతాను?' అంటూ అవినాష్ విస్మయ పడ్డారు. 'సోషలిస్టులు ఎవరైనాసరే అరవై సంవత్సరాల వయసు లోపు వారు యువకులే, అదే గాంధేయవాదులు అయితే 75 ఏళ్ల వరకు వారు యువకులే సుమా' అని నేను చమత్కరించాను. ఇదలా ఉంచితే భారతదేశంలో సోషలిస్టు ఉద్యమానికి 90 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పూణేలో జరిగిన సమ్మేళన్‌లో దేశం నలుమూలల నుంచి వందలాది కార్యకర్తలు పాల్గొన్నారు.


■ యోగేంద్ర యాదవ్

నా చమత్కారపూరిత వ్యాఖ్య ఒక బాధాకరమైన సత్యాన్ని కప్పిపుచ్చింది. భారతీయ సోషలిస్టు ఉద్యమ వారసత్వం క్షీణించి పోతోంది. వర్తమాన భారతదేశంలో మనకు ఆ స్ఫూర్తిదాయక భావజాలం అవసరం అమితంగా ఉన్నది. హిందీ భాషా రాష్ట్రాలలో విద్వేష రాజకీయాలను సమర్థంగా సవాల్ చేసిన ఆ రాజకీయ భావజాల చైతన్యం తగ్గిపోయింది. నకిలీ జాతీయవాదాన్ని చీల్చి చెండాడేందుకు అవసరమైన మేధా అస్త్రాలు నేటి యువ ప్రతిఘటనకారులకు అందుబాటులో లేకుండా పోయాయి. పాతకాలంలో తమ స్ఫూర్తిదాయక పోరాటాలను జ్ఞాపకం చేసుకుంటూ కాలం అంచున ఉన్న సోషలిస్టులకే కాదు, జాతికే ఇదొక పెద్ద విషాదం. పూరించుకోలేని మహానష్టమది.

మన జాతీయ జీవితంలో సోషలిస్టు ఉద్యమ చరిత్ర విస్మృతి అగాథాల్లోకి జారిపోయింది. భారతీయ సోషలిస్టుల గురించి ఎవరైనా ఒక యువకుడిని అడగండి. సమాధానం ఇవ్వలేక తెల్లమొహం వేస్తాడు. ఒక సోషలిస్టు, ఒక కమ్యూనిస్టు, అజ్ఞాత జీవితంలో ఉన్న ఒక మావోయిస్టు మధ్య ఉన్న తేడాలు ఏమిటో నేటి యువతలో ఎంత మందికి తెలుసు? నవయువ భారతీయుల దృష్టిలో వారందరూ 'వామపక్షీయులే'. గడిచిన కాలం, సాగిపోయిన చరిత్ర అవశేషాలు మాత్రమే సుమా! మీరు ములాయం సింగ్ యాదవ్ గురించి వినే ఉంటారు. ఆయనేమీ ఆదర్శ సోషలిస్టు రాజకీయవేత్త కాకపోయినా జనప్రియ సోషలిస్టు నేతలలో ఒకరు. పాతకాలం ప్రాత్రికేయులు కాంగ్రెస్ పాలకులపై నిత్యం నిప్పులు చెరిగే జార్జి ఫెర్నాండెజ్, విద్యురంగా ప్రవర్తించే రాజ్ నారాయణ్‌ను గుర్తు చేసుకుంటారు గానీ కర్పూరీ ఠాకూర్, మధు లిమాయే, ఎస్ఎమ్ జోషీ, రబీ రే, మృణాల్ గోరే, కిషన్ పట్నాయక్‌ల గురించిన జ్ఞాపకాల ముద్ర వారి మనసుల నుంచి తొలగి పోయిందనే చెప్పాలి. సోషలిస్టు ఉద్యమ తొలి తరంలో బొంబాయి మేయర్‌గా విశేష పేరు ప్రఖ్యాతులు ఆర్జించిన యూసఫ్ మెహరాలీ, ఆధ్యాత్మిక సోషలిస్టు అచ్యుత్ పట్వర్ధన్‌లు బహుశా ఎవరి స్మృతిపథంలోనూ లేరేమో?!

లోక్ నాయక్ జయప్రకాశ్ నారాయణ్‌ను సోషలిస్టు ఉద్యమ నాయకుడుగా కాకుండా గాంధేయ సర్వోదయ నాయకుడుగానే నేటి తరం వారు జ్ఞాపకం చేసుకుంటున్నారు. హస్తకళల పునరుద్ధరణకు విశేష కృషి చేసిన ఉదాత్తురాలిగా కమలాదేవి ఛటోపాధ్యాయను, సోషలిస్టు మేధావి, బౌద్ధ పండితుడుగా ఆచార్య నరేంద్ర దేవ్‌ను గుర్తు చేసుకుంటున్నారు. సువిఖ్యాత మరాఠీ సాహిత్యవేత్తగా సానే గురూజీ, సాంఘిక సంస్కర్తగా బలేశ్వర్ దయాళ్‌ను జ్ఞాపకం చేసుకుంటున్నారు. ఓటీటీ సినిమా 'ఏ వతన్ మేరే వతన్' పుణ్యమా అంటూ సాహసోపేత స్వాతంత్ర్య యోధురాలుగా ఉషా మెహతా ఇప్పుడు అందరి స్మృతిపథంలో ఉన్నారు. గమనార్హమైన విషయమేమిటంటే వీరిలో ఏ ఒక్కరినీ సోషలిస్టు ఉద్యమ నేతగా జ్ఞాపకం చేసుకోవడం లేదు. రామ్ మనోహర్ లోహియాను ఒక సోషలిస్టుగా ప్రస్తావిస్తున్నారు. అయితే మండల్ పూర్వీకుడుగా మాత్రమే ఆ ప్రస్తావనలు ఉంటున్నాయి. మౌలిక సోషలిస్టు ఆలోచనాశీలిగా, నాయకుడుగా గుర్తు చేసుకోవడమనేది సకృత్తుగా జరుగుతోంది.

విశిష్ట సోషలిస్టు ఉద్యమానికి మూలమైన కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ 1934లో భారత జాతీయ కాంగ్రెస్‌లో అంతర్భాగంగా ఏర్పాటయింది. రాజకీయ స్వాతంత్ర్యాన్ని సామాజిక, ఆర్థిక సమానత్వ భావనలతో అనుసంధానించడం ద్వారా వలసపాలన వ్యతిరేకోద్యమాన్ని విప్లవీకరించేందుకు సోషలిస్టు పార్టీ కృషి చేసింది. జేపీతో సహా పలువురు నాయకులు తొలుత మార్క్సిస్టు సిద్ధాంత అనుయాయులే అయినప్పటికీ కమ్యూనిస్టుల వలే కాకుండా కాంగ్రెస్ పార్టీలో అంతర్భాగంగా ఉంటూ జాతీయోద్యమంలో పాల్గొనాలని నిర్ణయించుకున్నారు. క్విట్ ఇండియా ఉద్యమంలో జయప్రకాశ్ నారాయణ్, లోహియా, ఉషా మెహతా లాంటివారు చరిత్రాత్మక పాత్ర వహించారు. స్వాతంత్ర్యానంతరం సోషలిస్టులు కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చి స్వతంత్ర ప్రస్థానాన్ని ప్రారంభించారు. కమ్యూనిస్టు పార్టీ విధానాలను వ్యతిరేకిస్తూ వామపక్ష ప్రజాస్వామ్య పార్టీగా ప్రభవించారు. కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో చట్టసభలకు చెప్పుకోదగిన సంఖ్యలో ఎన్నికైన సోషలిస్టులు హిందీ భాషా రాష్ట్రాలలో వెనుకబడిన కులాలవారిని, పేద ప్రజలను సంఘటిత పరిచారు. భారత గణతంత్ర రాజ్య తొలి నాళ్లలో భారత ప్రజాస్వామ్యాన్ని పటిష్ఠ పరిచేందుకు కమ్యూనిస్టులతో పాటు సోషలిస్టులు అవిస్మరణీయమైన కృషి చేశారు.



ఇందిరాగాంధీ ప్రభుత్వం విధించిన అత్యవసర పరిస్థితి కాలంలో పలువురు సోషలిస్టులు నిర్వహించిన పాత్ర భారత సోషలిస్టు ఉద్యమ చరిత్రలో మరొక ప్రతిష్ఠాత్మక అధ్యాయం. చాలా మంది ఆ 19 నెలలూ జైలు జీవితం గడిపారు. విద్యార్థి నాయకుడుగా పేరు పొంది, ఆ తరువాత ప్రొఫెసర్ అయిన రాజ్‌కుమార్ జైన్, సామాజిక క్రియాశీలి విజయ్ ప్రతాప్, ట్రేడ్ యూనియన్ నాయకుడు దలీప్ సింగ్ మొదలైన వారెందరినో ఈ సందర్భంలో తప్పక ప్రస్తావించుకోవాలి.

> భారతీయ సోషలిజం చాలామంది భావిస్తున్నట్టు యూరోప్ లోని సోషల్ డెమోక్రాటిక్ సంప్రదాయానికి భారతీయ రూపం కాదు. మన సోషలిస్టు భావజాలంలో వర్తమాన ప్రాసంగికత ఉన్న నాలుగు అంశాలు: అవి– సమానత్వ భావనను ఆర్థిక దృక్కోణానికి పరిమితం చేయకుండా... కులం, జెండర్, జాతి, జాతీయత మొదలైన అంశాలకూ వర్తింప చేయడం; సుస్థిర శ్రేయస్సుకు ప్రాధాన్యమిస్తూ పారిశ్రామిక అభివృద్ధి నమూనాపై పునరాలోచన; గాంధీ సత్యాగ్రహ తాత్త్వికత, పద్ధతుల స్ఫూర్తి స్వీకరణ; భారతీయత ప్రాతిపదికపై కొత్త సాంస్కృతిక రాజకీయాలు.

ఇంతకూ భారతీయ సోషలిజం ఏమిటి? చాలా మంది భావిస్తున్నట్టు యూరోప్ లోని సోషల్ డెమోక్రాటిక్ సంప్రదాయానికి భారతీయ రూపం కానే కాదు. యూరోపియన్ సంప్రదాయం ఎన్నికల ప్రజాస్వామ్యం ద్వారా అసమానతలను పరిమితంగా తగ్గించడమే లక్ష్యంగా ఉన్న రాజకీయ భావజాలం మాత్రమే. భారతీయ సోషలిజంను ప్రశస్తంగా ప్రవచించిన చింతకుడు లోహియా. ఆయన సిద్ధాంతం విభిన్నమైనది. అదొక భావసాహసం. సోషలిస్టు భావ జాల యూరోప్ కేంద్రిత మూలాలను త్యజించి, సమస్త సమాజాలకు ఉపయుక్తమయ్యేలా సోషలిజం భావనకు ఆయన ఒక విలక్షణ రూపునిచ్చారు.

లోహియా సోషలిస్టు భావజాలంలోని నాలుగు అంశాలకు వర్తమాన భారతదేశంలో విశేష ప్రాసంగికత ఉన్నది. అవి: సమానత్వ భావనను ఆర్థిక దృక్కోణానికి పరిమితం చేయకుండా, కులం, జెండర్, జాతి, జాతీయత మొదలైన అంశాలకు కూడా వర్తింప చేశారు. మహిళా రిజర్వేషన్లు, కుల గణన, ఓబీసీ, ఎస్సీ కోటాలలో ఉపకోటాలకు సంబంధించిన చర్చలలో బహుళ, క్రమబద్ధమైన పొరలతో కూడిన సామాజిక సోపాన క్రమాలను అర్థం చేసుకునేందుకు లోహియా భావన దోహదం చేస్తుంది; సుస్థిర శ్రేయస్సుకు ప్రాధాన్యమిస్తూ పట్టణ, పారిశ్రామిక టెక్నోక్రాటిక్ అభివృద్ధి నమూనాపై పునరాలోచనకు భారతీయ సోషలిస్టులు పునాదులు వేశారు. వాతావరణ మార్పు పర్యవసానాలు తీవ్రమవుతున్న ప్రస్తుత సందర్భంలో ఈ కొత్త ఆలోచనాపద్ధతికి ప్రాధాన్యమున్నది; సామాజిక పరివర్తన సాధనకు ఎన్నికల ప్రజాస్వామ్యం లేదా రాజకీయ హింసకు ప్రత్యామ్నాయంగా గాంధీ సత్యాగ్రహ తాత్త్వికత, పద్ధతుల స్ఫూర్తిని స్వీకరించడం; మన భాషలు, సంస్కృతి, జాతీయవాదం ప్రగాఢ ఆధారాలుగా ఉన్న సాంస్కృతిక రాజకీయాలకు కొత్త వ్యాకరణాన్ని భారతీయ సోషలిస్టులు రూపొందించారు. సాంస్కృతిక జాతీయవాదం, జనప్రియ వాదాల ప్రాబల్యం, జాతికి ప్రాధాన్యమిచ్చే జాతీయవాద ధోరణుల ఉధృతిని ఎదుర్కొనేందుకు సోషలిస్టుల సాంస్కృతిక రాజకీయాల అవసరం ఎంతైనా ఉన్నది.

కొన్ని దశాబ్దాల క్రితం సోషలిస్టు భావాలతో ప్రమేయం లేకుండా భవిష్యత్తు గురించి ఆలోచించడం అసాధ్యంగా ఉండేది. కాల కెరటం నేడు సోషలిస్టు తీరాన్ని వీడి అవతలి గట్టుకు వెళ్లిపోయింది. సోషలిజం ఒక తిట్టు పదమైపోయింది. అయితే అమానుష అసమానతలు లేని, ప్రతి ఒక్కరికీ శ్రేయో జీవితాన్ని సమకూర్చే ఒక మానవీయ సమాజ నిర్మాణ ఆకాంక్ష స్వతస్సిద్ధమైన స్ఫూర్తినిస్తోంది. అటువంటి సమాజాన్ని నిర్మించేందుకు ఆరాటపడేవారు తమను తాము సోషలిస్టులమని కాకుండా వేరే విధంగా పిలుచుకోవచ్చు. అయితే 20వ శతాబ్దిలో సోషలిస్టు శ్రేణులలో చీలికలు తెచ్చిన సైద్ధాంతిక, రాజకీయ విభేదాలను వారు తప్పక ఉపేక్షిస్తారు. మానవీయ సమాజానికై ఈ సరికొత్త అన్వేషణ బహుశా కొత్త రాజకీయ కార్యాచరణలకు దారితీసే అవకాశమున్నది. సోషలిజం స్ఫూర్తిని ఆవాహన చేసుకుని, దానిని పునరుజ్జీవింప చేసినప్పుడు జాతి భవితవ్యాన్ని సముజ్వలంగా నిర్మించేందుకు అదొక కార్యసాధకమైన భావజాల ప్రాతిపదిక అవుతుంది. వంద సంవత్సరాల రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రభావ ప్రాబల్యాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు 90 సంవత్సరాల సోషలిస్టు ఉద్యమ వారసత్వం శక్తిమంతమైన రాజకీయ, మేధో వనరులను మనకు సమకూర్చగలదనే పరిపూర్ణ ఆశాభావంతో పూణే నుంచి నా స్వస్థలానికి వెళ్ళాను.

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

ఈ పాలనాదక్షుడు.. అందరివాడు

నివాళి

దృశ్య శ్రవణ ప్రసారమాధ్యమాలను ఔపోసనం పట్టిన అగస్త్యుడు 'కె.ఎస్. శర్మ'గా లబ్ధప్రతిష్ఠులైన కంభంపాటి శ్రీనివాసశర్మ సెప్టెంబర్ 20న దిగంతాలకు తరలివెళ్లారు. ఎంతటి మహామనీషి! ఎంతటి సౌజన్యమూర్తి! ఎలా మాయమయ్యారు!? అవునులెండి, మహాకవి జాషువా చెప్పలేదూ.. కాలుడికి దయాదాక్షిణ్యమా! శర్మగారినీ తీసుకుపోయాడు.

గడచిన రెండు దశాబ్దాలకు పైగా కె.ఎస్. శర్మ ఆత్మీయతను, సౌజన్యాన్ని అప్పనంగా అనుభవిస్తూ వచ్చాను. ఆయన మూర్తిమత్వం బహు విశిష్టమైనది. విధి నిర్వహణలో భాగంగా అనేక అధికార హోదాలలో వారు ప్రదర్శించిన వ్యక్తిత్వం, అర్థవంతమైన జీవితం కోసం ఆయన పాటించిన విలువలు, సామాజిక వికాసం కోసం ఆయన చేసిన అవిశ్రాంత కృషి పదేపదే స్మరణీయాలు. మరీ ముఖ్యంగా విద్యారంగానికి వారు చేసిన సేవలు, ప్రసారమాధ్యమాలు సమాజశ్రేయానికి ధర్మకర్తృత్వం వహించాలని విశ్వసిస్తూ సుదీర్ఘ కాలం రేడియో టీవీలను వారు నడిపిన తీరు, తీర్చిదిద్దిన వైనం– ఇవి చాలవా శర్మకి చేతులెత్తి నమస్కరించటానికీ కళ్లనూ గుండెనూ తడిచేసుకోటానికీ!


కె.ఎస్. శర్మ అంటే 'కరీంనగర్ శ్రేయోభిలాషి శర్మ'గా డా. సి. నారాయణరెడ్డి అభివర్ణించారు. ఆర్తులు, అన్నార్తులు, దాహార్తులు, నిర్భాగ్యులు, నిరాశ్రయులను అక్కున చేర్చుకున్న ఆపన్నుడిగా ఇప్పటికీ ఆ జిల్లాలో కె.ఎస్.శర్మ పేరు చెప్పుకుంటారు.

1965లో ఢిల్లీ విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడుగా మొదలైన వారి ప్రస్థానం 1967లో ఐఏఎస్‌కు ఎంపిక కావటంతో ఒక మేలిమలుపు తిరిగింది. అప్పటి నుంచి సుమారు నలభై ఐదేళ్ల పాటు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ స్థాయిలలో అనేక పదవులు నిర్వహించారు. విశాఖపట్టణం జిల్లా నర్సీపట్నం సబ్ కలెక్టర్ మొదలు ఆకాశవాణి, దూరదర్శన్, ప్రసారభారతి సంస్థలకు ఆధిపత్యం వహించేవరకూ వారి ఉద్యోగ విజయాలు జాగీయమానంగా సాగాయి. ఆకాశవాణి, దూరదర్శన్‌లకు డైరెక్టర్ జనరల్‌గా వ్యవహరించిన మొట్టమొదటి ఐఏఎస్ అధికారి కె.ఎస్. శర్మ. అంతే కాదు, పదేళ్లకు పైగా కేంద్ర మానవవనరుల శాఖలోనూ, సమాచార ప్రసార మంత్రిత్వశాఖలోనూ ప్రతిభావంతంగా పనిచేసిన సివిల్ సర్వీస్ అధికారి కూడా ఆయనే.

ఇవన్నీ ఎలా తెలుసంటారా?... వారు తమ జీవన ప్రస్థానాన్నీ అనుభవాలనూ అక్షరబద్ధం చేయాలని సంకల్పించినప్పుడు కొన్ని జ్ఞాపకాలనూ ఎదురైన సవాళ్లనూ నాతో పంచుకున్నారు. వారు ఇంగ్లీష్‌లో ఎపిసోడ్‌ల వారీగా రాసుకున్న స్క్రిప్ట్‌ని నేను తెలుగులో రాయాలి. అదీ వారు నాకు అప్పగించిన పని. మూడు ఎపిసోడ్‌లు రాసి వినిపించాను. ఇంతలోనే సగంలో ముగింపు!

నక్సలైట్ల కార్యకలాపాలతో అట్టుడికిపోతున్న కరీంనగర్ జిల్లాను కల్లోలిత ప్రాంతంగా ప్రభుత్వం ప్రకటించిన సమయంలో శర్మ అక్కడ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. మరుక్షణం నుంచి నిరుపేదలకు భూముల పంపిణీ, పట్టణంలోని ప్రభుత్వ స్థలాల దురాక్రమణలను తొలగించటం, కలెక్టరేట్‌తో సహా అన్ని ప్రభుత్వ కార్యాలయాలూ ఒకే గొడుగు కిందకు వచ్చేలా నూతన భవన సముదాయాన్ని నిర్మింపచేయటం వంటి అనేక ప్రజాభ్యుదయ కార్యక్రమాలు జయప్రదంగా చేశారు. పాఠశాలలన్నిటికీ భవనాలు నిర్మించారు. ఇందుకోసం ప్రత్యేకంగా కరీంనగర్ ఎడ్యుకేషన్ సొసైటీని నెలకొల్పి నిధులు సమీకరించారు. సాంస్కృతిక క్రీడా కార్యక్రమాలను ప్రోత్సహించేందుకు కరీంనగర్ లలితకళా పరిషత్తును నెలకొల్పారు. భారతరత్న డా. ఎం.ఎస్. సుబ్బులక్ష్మి సంగీతసభను నిర్వహించి రసజ్ఞుల మెప్పుపొందారు. కె.ఎస్.శర్మ అంటే 'కరీంనగర్ శ్రేయోభిలాషి శర్మ'గా డా. సి. నారాయణరెడ్డి అభివర్ణించారు. అప్పటి ముఖ్యమంత్రి డా. మర్రి చెన్నారెడ్డి, శర్మ పనితీరుకు ముచ్చటపడి సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్‌గా నియమిస్తే, సిపిఐకు చెందిన సి.హెచ్. రాజేశ్వరరావు మరికొంతకాలం కరీంనగర్ కలెక్టర్‌గా ఆయననే కొనసాగించమని ముఖ్యమంత్రిని అభ్యర్థించారు. చిత్రమేమిటంటే నక్సలైట్లు కూడా శర్మే కలెక్టర్‌గా ఉండాలని పట్టుపట్టారు. దాంతో ఆయన బదిలీ నిలిచిపోయింది. ఆర్తులు, అన్నార్తులు, దాహార్తులు, నిర్భాగ్యులు, నిరాశ్రయులను అక్కున చేర్చుకున్న ఆపన్నుడిగా ఇప్పటికీ ఆ జిల్లాలో కె.ఎస్.శర్మ పేరు చెప్పుకుంటారు.

చాలాకాలంగా శర్మ పనితీరునూ నిబద్ధతనూ గమనిస్తూ వచ్చిన పీవీ నరసింహారావు తాను కేంద్రంలో మానవవనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖను చేపట్టాక, దేశవ్యాప్తంగా గ్రామప్రాంతాలలోని పిల్లల కోసం ప్రారంభించదలచిన నవోదయ పాఠశాలల నిర్వహణ బాధ్యతను ఆయనకి అప్పగించారు. ఆ పదవిలో ఉన్న ఐదేళ్లూ ఆ పాఠశాలలకు జీవం, సారం అన్నీ శర్మే అయ్యారు. ఆ పాఠశాలల్లో 33 శాతం సీట్లను ఆడపిల్లలకు కేటాయించారు. ఆ నిర్ణయానికి పీవీ సంతోషించారు. పీవీ ప్రధానమంత్రి కాగానే శర్మని దూరదర్శన్ డైరెక్టర్ జనరల్‌గా నియమించారు. పబ్లిక్ బ్రాడ్ కాస్టింగ్ సిస్టమ్‌లో ఆయన అనేక విప్లవాత్మక మార్పులు చేశారు. అందులో ప్రముఖంగా పేర్కొనదగినది డీటీహెచ్– డైరెక్ట్ టు హోమ్ సర్వీస్. ఈ సేవలు కేవలం మనదేశానికే పరిమితం కాలేదు. ప్రపంచ వ్యాప్తంగా డీటీహెచ్ అందుబాటులోకి వచ్చింది.

అలాగే ఆకాశవాణి, దూరదర్శన్ ఆర్కైవ్‌లను పటిష్ఠం చేసి, ప్రముఖ కళాకారుల రికార్డింగ్‌లను సీడీలుగా, క్యాసెట్లుగా మార్పించి మార్కెటింగ్ డివిజన్ల ద్వారా విక్రయించే ఏర్పాటు చేశారు. అది సంస్థకు ఆదాయవనరుగా మారింది. అటు కళాకారులకూ లబ్ధి కల్పించారు. ఎవరెవరి రికార్డింగ్‌లను విక్రయిస్తున్నామో వారందరికీ వారి గ్రేడింగ్ ప్రకారం ఏకమొత్తంగా పారితోషికం చెల్లించమని ఆదేశించారు.

నా అదృష్టం – దక్షిణ ప్రాంత ఆర్కైవ్స్‌కు ప్రత్యేక అధికారిగా నన్ను నియమించి ఆయన పర్యవేక్షణలో పనిచేసే అవకాశం కల్పించారు. శర్మ సాధించిన మరొక ఘన విజయం ఏమిటంటే– స్పోర్ట్స్ రైట్స్ ఉన్న వారందరూ వారు నిర్వహించే కార్యక్రమాల సిగ్నల్స్‌ను విధిగా దూరదర్శన్‌కు ఇచ్చి తీరాలి. ఇందుకోసం పెద్ద పోరాటమే చేశారు. సుప్రీం కోర్ట్ వరకూ వెళ్లి విజయం సాధించారు. దీనితో దేశంలోని కేబుల్ పరిశ్రమ బలపడింది. క్రీడామంత్రిత్వ శాఖ ప్రతిష్ఠ ఇనుమడించింది. అదనపు కార్యదర్శి బాధ్యతలలో ఉన్నప్పుడే ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఎమెరిటస్‌గా నియమితులయ్యారు. ఇలా ఎన్నని చెప్పను! "ఎవరు జీవించి ఉన్నట్లు?" అని యక్షుడి ప్రశ్న! "చనిపోయిన తరువాత కూడా ఎవరి పేరు ఎన్నాళ్లు ఈ లోకంలో వినబడుతుందో అన్నాళ్లూ వారు జీవించి ఉన్నట్లు!" అని ధర్మరాజు సమాధానం!!

• ప్రయాగ రామకృష్ణ

విప్లవ కమ్యూనిస్టులు గుర్తించని భారత వాస్తవం

'అరణ్యవాసంలోనే విప్లవ ప్రభాతం' (జూలై 25, ఆంధ్రజ్యోతి) అన్న నా వ్యాసంపై విమర్శలు, వ్యాఖ్యలకు నా ప్రతిస్పందన ఇది: భారత కమ్యూనిస్టులు తమ జీవితాలను త్యాగం చేసి శక్తిమంతమైన ప్రజా ఉద్యమాన్ని నిర్మించారు. జనసామాన్యంపై కమ్యూనిస్టుల ప్రభావం పెరిగిపోవడాన్ని, అట్టడుగు వర్గాలవారు ప్రజా ఉద్యమాలలో మరింతగా భాగస్వాములు కావడాన్ని గమనించిన మహాత్మా గాంధీ జవహర్ లాల్ నెహ్రూను తన వారసుడుగా ప్రకటించారు. సోషలిస్టు భావజాలాన్ని ప్రజలలోకి తీసుకు వెళ్లి, దానికి విశేష ప్రజా మద్దతును సాధించిన నెహ్రూయే దేశ పరిపాలకుడు కాగలడని గాంధీజీ సుదృఢంగా విశ్వసించారు. బ్రిటిష్ వారు ఎట్టి పరిస్థితులలోను సెప్టెంబర్ 1948 లోగా అధికారాన్ని భారతీయులకు అప్పగించి వెళ్లిపోవలసి ఉన్నది. అయితే కమ్యూనిస్టుల నాయకత్వంలో బ్రిటిష్ వ్యతిరేక ఉద్యమాలు బాగా పుంజుకోవడంతో ఆ లోగానే నిష్క్రమించడానికి వలసపాలకులు నిర్ణయించుకున్నారు. 1947కు ముందుగానీ, ఆ తరువాత గానీ కమ్యూనిస్టులు కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ప్రభవించలేకపోయారు. ఎందుకని? వ్యక్తిగత త్యాగాలు ఉద్యమ లక్ష్య సాధనలో ఎవరినీ సఫల మనోరథులను చేయలేవు. పర్యవసానాలను కచ్చితంగా అంచనావేసి, యుక్తమైన వ్యూహాన్ని అభివృద్ధిపరచుకోవాలి. ఇటువంటి ప్రతిభావంతమైన వ్యూహకర్త గాంధీజీ. రైతులు, ముస్లింలు, యువజనులు, హరిజనులు, పట్టణ విద్యావంతులు తన రాజకీయ ఉద్యమాలు, ఆందోళనలలో పరిపూర్ణంగా పాల్గొనేలా చేసి జాతీయోద్యమాన్ని స్వాతంత్ర్య తీరానికి చేరవేసిన వ్యూహకర్త మహాత్ముడు. అయితే తాను నిర్మించిన ఉద్యమం కమ్యూనిస్టుల ప్రాబల్యంలోకి వెళ్లడాన్ని గమనించిన గాంధీజీ–నెహ్రూను తనకు వారసుడుగా దేశానికి యోగ్యమైన నాయకుడుగా అభిషేకించారు.

1947లో బ్రిటిష్ వారి నుంచి భారతీయులకు జరిగిన అధికార బదిలీ ఒక విధంగా పరాయి పాలకులతో కాంగ్రెస్ నాయకులు రాజీపడడమేనని, భారత్‌పై సామ్రాజ్యవాదుల నియంత్రణ కొత్త రూపంలో కొనసాగుతుందని కమ్యూనిస్టులు విశ్వసించారు. భారతీయ కమ్యూనిస్టు పార్టీ రెండవ ప్రధాన కార్యదర్శి బి.టి. రణదివె.. గాంధీ, నెహ్రూలను సామ్రాజ్యవాదుల తొత్తులని నిందించాడు. దేశానికి నిజమైన స్వాతంత్ర్యం రాలేదని ఘోషించాడు. 1938 నుంచి 1948 పార్టీ ప్రథమ కార్యదర్శిగా ఉన్న పీసీ జోషీ పార్టీని, పార్టీ అనుబంధ సంస్థలు, రచయితల, కళాకారుల సంఘాలను ప్రతిభావంతంగా నిర్మించి అభివృద్ధిపరిచాడు. కాంగ్రెస్‌ను సవాల్ చేయకుండానే సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాన్ని ముమ్మరం చేశాడు. రష్యాలో విప్లవానికి ముందు కెరెన్‌స్కీ నిర్వర్తించిన పాత్రనే భారత్‌లో నెహ్రూ పోషిస్తున్నాడని భావిస్తూ తనను తాను లెనిన్‌గా రణదివె ఊహించుకున్నాడు. జోషి నిర్మించిన పార్టీ ఆలంబనతో నెహ్రూ నుంచి అధికారాన్ని స్వాధీనం చేసుకోవాలని ఆశించాడు. ఆయన అభీష్టం నెరవేరకపోగా పార్టీకి తీవ్ర నష్టాలు వాటిల్లాయి. అయినా ఆ తరువాత ప్రధాన కార్యదర్శి చంద్ర రాజేశ్వరరావు తనను తాను మావోగా భావించుకుని రైతాంగ విప్లవాన్ని తీసుకువచ్చేందుకు ప్రయత్నించాడు.

> సాయుధ పోరాటమే విప్లవం కాదు. అది సామాజిక, రాజకీయ మార్పులను సాధించలేదు. ఎన్నికల ప్రజాస్వామ్య వ్యవస్థను భారత్ చాలా విజయవంతంగా నిర్మించింది. సాధారణ ఓటర్లు 'ఓట్ల పండుగ'లో మహోత్సాహంగా పాల్గొనటమే అందుకు నిదర్శనం.



రెండవ ప్రపంచ యుద్ధకాలంలోను, ఆ తరువాత తేభాగ, తెల్లిచెరి, తెలంగాణ, బాంబేలో చరిత్రాత్మక ప్రజా ఉద్యమాలు నిర్మించిన కమ్యూనిస్టులు భారత ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలను సరిగా అర్థం చేసుకోలేక పోయారు. రాజ్యాంగ నిర్మాతలు అయిన జాతీయవాదులు దేశ ప్రజలకు సార్వత్రిక వయోజన ఓటు హక్కును కల్పించారు. అణగారిన వర్గాల వారికి విద్యా ఉద్యోగాలలో రిజర్వేషన్లు సమకూర్చారు. భారత్‌ను ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యంగా రూపొందించారు. సంస్థానాలను దేశంలో విలీనం చేసి జమీందారీలు, ఇతర భూస్వామ్య వ్యవస్థలను రద్దు చేశారు. భూసంస్కరణలను ప్రవేశ పెట్టారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలతో మిశ్రమ ఆర్థిక విధానాన్ని నెహ్రూ అనుసరించారు. చట్టసభలు, స్వతంత్ర న్యాయవ్యవస్థ, పార్లమెంటుకు జవాబుదారీగా ఉండే కార్యనిర్వాహక వర్గం మొదలైన ప్రజాస్వామిక సంస్థలను నెలకొల్పిన తొలి స్వతంత్ర దేశం భారత్. నెహ్రూ, అంబేడ్కర్‌లు అభివృద్ధిపరిచిన పార్లమెంటరీ ప్రజాస్వామిక ప్రక్రియల ప్రభావశీలతను భూస్వామ్య శక్తులకు వ్యతిరేకంగా ప్రభవించి లెనినిజం, మావో భావజాల చట్రంలో కమ్యూనిస్టులు అర్థం చేసుకోలేకపోయారు.

భారతదేశ వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులు పంజాబ్, పశ్చిమ భారత రాష్ట్రాలు, ఆంధ్రలో చోటుచేసుకున్నాయి. నవీన వ్యవసాయంతో రైతు కులాల వారి ఆర్థిక స్థితిగతులు గణనీయంగా మెరుగుపడ్డాయి. వ్యవసాయరంగ విప్లవం ఆ సామాజిక వర్గాలను సంఘటితం చేసింది. బొంబాయి, అహ్మదాబాద్, పూనా నగరాలలో పారిశ్రామికాభివృద్ధి ప్రభావంతో వారిలో ఒక పెట్టుబడిదారీ వర్గం ప్రభవించింది. సంపద్వంతులు అయిన ఈ సామాజిక వర్గాల వారు కాంగ్రెస్‌కు మద్దతునిచ్చారు. నవ భారత రాజకీయాలు మార్క్సిస్టు భావజాల, లెనిన్ రాజకీయ సైద్ధాంతిక చట్రాలకు వెలుపల ఉండడంతో వాటిని కమ్యూనిస్టులు అర్థం చేసుకోలేక పోయారు. సరైన అవగాహన కొరవడిన కారణంగానే కమ్యూనిస్టులు తొలుత రెండు పార్టీలుగా విడిపోయారు. విడిపోయిన ఒక పార్టీ నుంచి మరొక విప్లవ పార్టీ ప్రభవించి, పిదప అనేక విప్లవ గ్రూపులుగా చీలిపోయింది. చిత్రంగా అందరూ భారత్‌ను అర్ధ భూస్వామ్య, అర్ధ వలస దేశంగా భావిస్తున్నారు.

ధనిక రైతులు రాజకీయ వర్గంగా ప్రభవించి ప్రాంతీయ పార్టీలు కూడా నెలకొల్పారు. కింది కులాలకు చెందిన సన్నకారు, చిన్నకారు రైతులు ఈ ధనిక రైతాంగంతో పోటీపడలేక పోయారు. క్రమంగా వ్యవసాయ కూలీలుగా మారిపోయారు. వీరి శ్రమ ప్రాతిపదికనే వ్యవసాయ పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందింది. వ్యవసాయరంగంలో పరివర్తన కులాల ప్రాతిపదికన జరిగిందని గ్రహించడం ముఖ్యం.

సామాజిక కులం, ఆర్థిక పెట్టుబడి కలగలసిపోవడమనేది భారతదేశం సాధించిన ఒక నవ కల్పన. అయితే భారత్ తన సామాజిక కులంతో పాటు ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలో భాగమయింది. భారతీయ పెట్టుబడిదారులు వివిధ దేశాలకు పెట్టుబడిని ఎగుమతి చేస్తూనే కుల సంఘాలను ఏర్పాటు చేశారు.

ఈ మేధో సంక్షోభం నుంచి నక్సలిజం ప్రభవించింది. జనతా ప్రజాస్వామిక విప్లవంతో అర్ధ భూస్వామ్య, అర్ధ వలస భారతీయ సమాజాన్ని నిర్మూలించేందుకు నక్సలైట్లు కంకణం కట్టుకున్నారు. 1970ల్లో విద్యార్థులుగా ఉన్న మేము వ్యవసాయ రంగంలో మార్పుల గతిశీలతను అర్థం చేసుకోలేకపోయాం. అయితే అర్ధ భూస్వామ్య, అర్ధ వలస భారతీయ సమాజాన్ని నిర్మూలించాలని ప్రగాఢంగా కోరుకునేవాళ్లం. లెనిన్ తుపాకీ పట్టాడా? తుపాకులే జార్‌ను కూలదోశాయా? 1917 అక్టోబర్‌లో రష్యన్ కార్మికులు సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో తిరుగుబాటు చేసి వింటర్ ప్యాలెస్‌ను ఆక్రమించుకున్నారు. బోల్షివిక్కుల ప్రభుత్వం ఏర్పడి సోవియట్ రష్యన్ రిపబ్లిక్ నేర్పాటు చేస్తున్నట్టు ప్రకటించింది. తిరుగుబాటు చేసిన కార్మికులలోనే లెనిన్ ఉన్నాడు. లెనిన్ తమ మధ్య ఉన్నట్టు ఆ కార్మికులకూ తెలుసు. నక్సలైట్ల వసంతకాల మేఘ గర్జన యాభై సంవత్సరాల అనంతరం కూడా మావోయిస్టు పార్టీ అగ్రనేత ఎవరైనా హతమైపోతే కనీసం ఒక రోజు బంద్‌ను కూడా పూర్తిగా విజయవంతం చేయలేని పరిస్థితి ఉన్నది. వర్తమాన రాజ్య వ్యవస్థ విప్లవ కమ్యూనిస్టు నాయకులను అంతమొందించేందుకు ఎంతకైనా తెగిస్తుంది. ఎన్నికల ప్రజాస్వామ్య వ్యవస్థ మహాశక్తిమంతమైన రాజ్య వ్యవస్థను నెలకొల్పింది. దానితో ఘర్షించడం అసాధ్యమనేదే నేను చెప్పదలుచుకున్నది. ఈ కారణంగానే నక్సలైట్లు గ్రామాల నుంచి అడవులలోకి వెళ్లవలసివచ్చింది. ఇప్పుడు సాయుధ బలగాల దాడులను తప్పించుకునేందుకు మధ్య భారతదేశ అడవులలో ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి నిరంతరం వెళ్లవలసి వస్తోంది. సాయుధ పోరాటమే విప్లవం కాదు. అది సామాజిక, రాజకీయ మార్పులను సాధించలేదు. ఎన్నికల ప్రజాస్వామ్య వ్యవస్థను భారత్ చాలా విజయవంతంగా నిర్మించింది. సాధారణ ఓటర్లు 'ఓట్ల పండుగ'లో మహోత్సాహంగా పాల్గొనటమే అందుకు నిదర్శనం.

◆ ఇనుకొండ తిరుమలి

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
హనుమకొండ
HANUMAKONDA
మంగళవారం 30 సెప్టెంబరు 2025



సరస్వతి మాతగా భద్రకాళి

6





నిమజ్జనం చేసిన బతుకమ్మలతో హనుమకొండ పద్మాక్షి గుండం

హనుమకొండ పద్మాక్షి ఆలయ ప్రాంగణం వ్యూ

- ఉత్సాహంగా పాల్గొన్న మహిళా లోకం
- వెల్లువలా పూలజాతర
- సప్తవర్ణ శోభితమైన పద్మాక్షి ప్రాంగణం
- ఉమ్మడి జిల్లాలో జోరుగా సద్దుల సందడి

సంబరంగా సద్దుల పండుగ

7

సమరానికి సై

మోగిన స్థానిక ఎన్నికల నగరా



- అక్టోబరు 23, 27 తేదీల్లో రెండు విడతల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు
- అక్టోబరు 31న, నవంబరు 4, 8 తేదీల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు
- నవంబరు 11న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల లెక్కింపు
- పోలింగ్ రోజునే గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాలు
- జిల్లాలో జడ్పీటీసీ స్థానాలు 12, ఎంపీటీసీ స్థానాలు 129
- సర్పంచ్ స్థానాలు 210, వార్డులు 1986

హనుమకొండ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగింది. ఎన్నికల కోడ్ కూసింది. ఇక గ్రామాల్లో ఎన్నికల సంరంభం మొదలు కానున్నది. నవంబర్ 8వ తేదీ వరకు ఎన్నికల హడావుడి సాగనున్నది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుపై హైకోర్టు వ్యాఖ్యలతో నెలకొన్న అనిశ్చితి నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో ముందుకే వెళ్లాలని నిర్ణయించుకున్నది. ఈ మేరకు సోమవారం ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌ను జారీ చేసింది. దీనితో జిల్లా యంత్రాంగాలు అప్రమత్తమయ్యాయి. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేసినప్పటికీ ఇక తుదిఏర్పాట్లపై దృష్టి సారించనున్నాయి. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ల రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇక జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లు, వార్డు సభ్యుల రిజర్వేషన్ల ఖరారు రెండు రోజుల క్రితమే పూర్తయింది. వీటిని గెజెట్‌లో ప్రకటించి అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

ఎన్నికల షెడ్యూల్ ఇలా..:

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు రెండు విడతలుగా, పంచాయతీ ఎన్నికలు మూడు విడతలుగా జరుగుతాయి.

- ఎంపీటీసీ, జెడ్పీటీసీ మొదటి విడత ఎన్నికల నోటీఫికేషన్ అక్టోబర్ 9న, రెండవ విడత నోటిఫికేషన్ 13వ తేదీన జారీ అవుతుంది.
- ఆ రోజు నుంచి ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చు,
- నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ మొదటి విడత అక్టోబర్ 11, రెండవ విడత 15వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు.
- నామినేషన్ల ఉపసంహరణలకు చివరి తేదీ (మిగతా 6లో..)

జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల వివరాలు:

జిల్లాలో మొత్తం గ్రామీణ మండలాలు 12 ఉండగా జెడ్పీటీసీ స్థానాలు 12, ఎంపీటీసీ స్థానాలు 129 ఉన్నాయి.

గ్రామ పంచాయతీల వివరాలు:

జిల్లాలో మొత్తం 210సర్పంచ్ స్థానాలు, 1986 వార్డులు ఉన్నాయి. కాగా పోలింగ్ కేంద్రాలు 1986 ఏర్పాటు చేశారు.

గీసుగొండ సీఐగా విశ్వేశ్వర్

వరంగల్ క్రైం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని పోలీస్ కంట్రోల్ రూంలో విధులు నిర్వర్తిస్తున్న డి. విశ్వేశ్వర్‌ను గీసుగొండ సీఐగా నియమిస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ఇంతకాలం గీసుగొండ సీఐగా విధులు నిర్వర్తించిన మహేందర్‌ను పోలీస్ కంట్రోల్ రూంకు బదిలీ చేశారు. 2009 ఎస్సై బ్యాచ్‌కు చెందిన విశ్వేశ్వర్ గతంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఎస్సైగా విధులు నిర్వర్తించి సీఐగా పర్వతగిరి, వర్ధన్నపేటలో పనిచేశారు.

ఇద్దరు ఎస్సైల బదిలీ

వరంగల్ క్రైం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు ఎస్సైలను బదిలీ చేస్తూ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌గా విధులు నిర్వర్తిస్తున్న వంశీకృష్ణను సంగెం పీఎస్‌కు బదిలీ చేయగా, సంగెం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఎల్. నరేశ్‌ను మిల్స్‌కాలనీ ఎస్సైగా బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు

ఎన్నికల నిబంధనలు తప్పక పాటించాలి

● రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని

● స్థానిక సంస్థల ఎన్నికలపై వీడియో కాన్ఫరెన్స్

హనుమకొండ, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రవర్తనా నియమావళి, నిబంధనలను తు.చా తప్పకుండా పాటించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని అన్నారు. సోమవారం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాణి కుముదిని రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హనుమకొండ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ జిల్లా అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనావళి ఉల్లంఘనలపై 24 గంటలు, 48 గంటల, 72 గంటల్లోగా చర్యలు తీసుకొని రిపోర్టు అందించాలని అన్నారు. కలెక్టర్ స్నేహశబరీష్ మాట్లాడుతూ మొదటి విడతలో జిల్లాలోని ఆరు మండలాల్లో 67 ఎంపీటీసీ స్థానాలకు, మిగతా ఆరు మండలాల్లో 62 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయన్నారు.

జిల్లాలో సమస్యాత్మక గ్రామాలను గుర్తించామని, ఎన్నికల విధులకు సంబంధించి రెండు దఫాలుగా ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ నారాయణ, డీఆర్‌డీవో మేన శ్రీను, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, జిల్లా పరిషత్ సీఈవో రవి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి మాడవీధుల్లో నేడు సద్దుల బతుకమ్మ



ఏర్పాట్లు లేని మాడవీధుల ప్రాంగణం

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సద్దుల బతుకమ్మ పండుగను కొన్ని ప్రాంతాల్లో సోమవారమే జరుపుకోగా, మిగిలిన ప్రాంతాల్లో మంగళవారం జరుపుకోవడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. అష్టమి తిథి సూర్యోదయ కాలంలో బ్రహ్మీ ముహూర్తం మంగళవారం ఉండడంతో పాటు భద్రకాళి అమ్మవారి జన్మదినోత్సవం రోజునే బతుకమ్మ పండుగను జరుపుకోవడం సంప్రదాయంగా వస్తోంది. కాగా, ఇప్పటికే భద్రకాళి మాడవీధులను కలెక్టర్, ఎమ్మెల్యేలు, మంత్రి కొండా సురేఖ పరిశీలించి మాడవీధుల ప్రాంగణంలో బతుకమ్మ వేడుకలు వైభవంగా నిర్వహించాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కాగా, భద్రకాళి మాడవీధుల్లో సద్దుల బతుకమ్మ వేడుకల కోసం సోమవారం సాయంత్రం వరకు కూడా ఏర్పాట్లు చేయలేదు. విద్యుత్ లైట్లు, సౌండ్ సిస్టం, నీటి వసతి ఏర్పాటు చేయకపోవడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

8న కేయూలో బాలగోపాల్ స్మారక ఉపన్యాసం

కేయూ క్యాంపస్ సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కుల నేత డాక్టర్ కె.బాలగోపాల్ 8వ స్మారక ఉపన్యాసం అక్టోబరు 8న నిర్వహిస్తామని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు కేయూ సెనెట్ హాల్‌లో జరిగే స్మారక ఉపన్యాసంలో హైదరాబాద్ నల్సార్ వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ శ్రీకృష్ణదేవారావు ముఖ్యఅతిథిగా హాజరై కీలక ప్రసంగం చేస్తారని పేర్కొన్నారు. బోధన, బోధనేతర సిబ్బంది, స్కాలర్స్, విద్యార్థులు హాజరుకావాలని పేర్కొన్నారు.

కేయూ డిగ్రీ రీవాల్యూవేషన్ ఫలితాల వెల్లడి

కేయూ క్యాంపస్ సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ బీఏ, బీకామ్, బీఎస్సీతో పాటు ఇతర డిగ్రీ కోర్సుల మొదటి, రెండో, మూడో, నాల్గవ సెమిస్టర్ రీవాల్యూవేషన్ ఫలితాలు వెల్లడయ్యాయి. ఈ మేరకు సోమవారం ఫలితాలను విడుదల చేసి కేయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

సరస్వతీ నమోస్తుతే..

ఆలయాల్లో అమ్మవారి మూలనక్షత్రం పూజలు



సరస్వతి మాత అలంకరణలో రాజరాజేశ్వరి దేవి



శంకర మఠంలో సరస్వతి మాత అమ్మవారి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలో దేవి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం మూల నక్షత్రం సందర్భంగా అమ్మవారిని సరస్వతి మాతగా అలంకరించి భక్తుల దర్శనానికి ఏర్పాటు చేశారు. నగరంలోని అన్ని దేవాలయాల్లో నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్న మండపాల వద్ద, దేవాలయాల్లో ప్రత్యేక పూజలు కొనసాగాయి. చండీ హోమాలు, కుంకుమ పూజలు, అన్నదానాలు, శ్రీలలితా సహస్ర నామ పారాయణాలు నిర్వహించారు. శంకరమఠంలోని శారద మాతను ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ములుగురోడ్‌లోని శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రంలో మహాలక్ష్మి అమ్మవారిని సరస్వతి మాతగా అలంకరించి పూజలు చేశారు. ఎంజీఎం సెంటర్‌లోని శ్రీరాజరాజేశ్వరి దేవిని సరస్వతి మాతగా అలంకరించి పూజలు నిర్వహించారు. కాకతీయ థియేటర్ సెంటర్‌లో, రామన్నపేట గాంధీ విగ్రహం సెంటర్‌లో, దేవి నవరాత్రి విగ్రహాల వద్ద ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నదానాలను ప్రారంభించారు.

సరస్వతి మాతగా భద్రకాళి

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని భద్రకాళి దేవస్థానంలో కొనసాగుతున్న దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు మంగళవారం ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. ఆశ్వయుజ సప్తమి సందర్భంగా అమ్మవారికి ఉదయం 4 గంటలకు నిత్య పూజ నిర్వహించిన అనంతరం అమ్మవారిని సరస్వతి మాతగా అలంకరించి భక్తుల దర్శనానికి ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని భద్రపీఠ సేవగా అశ్వవాహనంపై ఊరేగించారు. సోమవారం రాత్రి కాళరాత్రి దుర్గార్చన హోమాన్ని నిర్వహించారు. సరస్వతి మాత అలంకరణ మూల నక్షత్రం కావడంతో భక్తులు ఉదయాన్నే పెద్ద సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో, ధర్మకర్తలు పాల్గొన్నారు. మధ్యాహ్నం, రాత్రి భద్రకాళి సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

కాగా, బతుకమ్మ వేడుకలు సోమవారమా.. లేక మంగళవారమా అన్న విషయంలో స్పష్టత లేకపోవడంతో కొందరు సోమవారం భద్రకాళి అమ్మవారి దేవస్థానానికి బతుకమ్మలతో వచ్చారు. ఆలయ మాడవీధులతో పాటు వినాయక దేవాలయం వెనుక చెరువు గట్టు ప్రాంగణంలో వేడుకలు జరుపుకున్నారు. మరికొందరు ప్రధానార్చకులు భద్రకాళి శేషు చెప్పిన ప్రకారం మంగళవారం బతుకమ్మ వేడుకలు జరుపుకోవడానికి సిద్ధమవుతున్నారు.



ఫార్మసీలో రమకు డాక్టరేట్

కేయూ క్యాంపస్ సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ విభాగం పరిశోధకురాలు ఎం.రమ డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు రమకు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ డాక్టరేట్ ప్రకటించారు. 'స్టడీస్ ఆన్ న్యూరోప్రొటెక్టివ్ ఎఫెక్ట్స్ ఆఫ్ సమ్ ఇండియన్ మెడిసినల్ ప్లాంట్స్ ఇన్ ఎనిమల్ మోడల్స్' అనే అంశంపై సమర్పించిన పరిశోధన గ్రంథానికి డాక్టరేట్ లభించిది. కేయూ ఫార్మసీ విభాగం ప్రొఫెసర్ వై.నరసింహారెడ్డి పర్యవేక్షణలో రమ పరిశోధన గ్రంథాన్ని రూపొందించారు. హనుమకొండ వాగ్దేవి ఫార్మసీ కళాశాలలో రమ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

ఆర్టీసీలో అప్రెంటీస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ)లో 2020 నుంచి 2025 వరకు ఇంజనీరింగ్ డిప్లొమా ఏదైనా గ్రాడ్యుయేట్ పూర్తి చేసుకున్న అభ్యర్థుల నుంచి టెక్నికల్ నాన్ టెక్నికల్ డిప్లొమా అప్రెంటీస్ పోస్టుల కోసం అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సోమవారం వరంగల్ ఆర్ఎం డి.విజయభాను ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అక్టోబరు 7న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు హనుమకొండ సిటీ బస్ స్టేషన్‌లోని రెండో అంతస్థులో ఆర్ఎం కార్యాలయంలో అభ్యర్థులు తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకొని రావాలని పూర్తి వివరాల కోసం సెల్ నంబర్ : 99592 26045 కు సంప్రదించాలని కోరారు.

టైలర్ వర్కర్ల సమ్మె విరమణ

బాలసముద్రం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పండుగల వేళ హనుమకొండ టైలర్ వర్కర్లు చేపట్టిన సమ్మె ముగిసింది. టైలర్ షాపులలో పనిచేసే వర్కర్లు పీస్ రేట్లను పెంచాలని టైలర్ షాపుల యజమానులను కోరగా స్పందించకపోవడంతో శనివారం సమ్మెకు దిగారు. గత రెండు సంవత్సరాలుగా షర్ట్‌కు రూ.174, ప్యాంటుకు రూ.280 చెల్లిస్తున్నారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి పెంచాల్సిన పీస్ రేట్లు ఈ సంవత్సరం పెంచాలని వర్కర్లు పట్టుబట్టారు. ఈ మేరకు యజమానులు దిగివచ్చి వర్కర్లతో హనుమకొండ అశోక కాంప్లెక్స్ సమీపంలో గల బాలరాజరాజేశ్వరి ఆలయంలో చర్చలు జరిపారు. చర్చల్లో షాపుల యజమానులు బోలకొండ సురేష్, రాయిల్ల సతీష్, సీతా శ్యాం, వలస రాజమౌళి పాల్గొనగా వర్కర్ల పక్షాన సోమ వెంకటేష్, జారతి కిశోర్, రాపర్తి సుమన్, కీర్తి ప్రశాంత్, సోమ చందర్, అడప సుధాకర్‌లు పాల్గొన్నారు. షర్ట్‌కు రూ.26, ప్యాంటుకు రూ.40 పెంచడానికి యజమానులు అంగీకరించారు. దీంతో షర్ట్‌కు కూలీ రేటు రూ.200, ప్యాంటుకు రూ.320 చెల్లించనున్నారు.

మేడారం అభివృద్ధి పనులకు భూమిపూజ

తాడ్వాయి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క- సారలమ్మల దేవస్థానం అభివృద్ధి పనులకు పూజారులు సోమవారం భూమి పూజ చేశారు. ఈ క్రమంలో తల్లులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాస్టర్ ప్లాన్ రూపకల్పన పనులు మార్కింగ్ చేశారు. కార్యక్ర మంలో ఆర్కిటెక్చర్ రాజశేఖర్, దేవస్థానం కార్యనిర్వహణ అధికారి వీరస్వామి, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పండక్కి ఊరికొస్తూ మహిళ మృత్యువాత

● ఆలేరులో రోడ్డు ప్రమాదం

చిలుపూర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ కోసం స్వగ్రా మానికి వస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో జనగామ జిల్లా చిలుపూర్ మండలం పల్లగుట్టకు చెందిన మహిళ మృతి చెందింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సాదం కోమల(38) -రవి దంపతులు పదేళ్ల క్రితం జీవనోపాధి కోసం హైదరాబాద్ కూలి పనులు చేసుకుంటున్నారు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. కాగా, సద్దుల బతుకమ్మ, దసరా పండుగ కోసం కోమల తన కుమారుడు సాంబరాజుతో కలిసి స్కూటీపై హైదరాబాద్ నుంచి బయ లుదేరగా, ఆలేరు సమీపంలో వెనుక నుంచి బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటీ నుంచి కిందపడ్డ కోమల తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. పండుగపూట కోమల మృతిచెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

వాణిజ్య బ్యాంకులకు దీటుగా రుణసేవలు

● టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్‌రావు

ఐనవోలు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలలోని సభ్యులు, బ్యాంకు ఖాతాదారులకు వ్యవసాయ రుణాలే కాకుండా ఇతర వాణిజ్య బ్యాంకులకు దీటుగా అన్ని రకాల రుణసేవలు అందించడం జరుగుతుందని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు తెలిపారు. మండలంలోని నందనం రైతు సేవా సహకార సంఘం(ఎఫ్ఎస్‌సీఎస్) 54వ మహాజన సభ సర్వసభ్య సమావేశం సోమవారం కార్యాలయం ఆవరణలో జరిగింది. బ్యాంకు పరిపాలన, నివేదిక, ఆర్థిక సంవత్సరం బ్యాంకు, సొసైటీ జమ ఖర్చులు, లాభనష్టాలు, ఆస్తులు, అప్పులను మహాజన సభలో ప్రవేశపెట్టి సమీక్షించడం జరిగింది.

ఈ సభకు ముఖ్య అతిథిగా పాల్గొన్న రవీందర్‌రావు మాట్లాడుతూ సొసైటీలోని సభ్యులకు, బ్యాంకు ఖాతాదారులకు ఉచితమైన సేవలు అందిస్తున్నామని వివరించారు. డిపాజిట్ల మీద ఇతర బ్యాంకుల కంటే అత్యధిక వడ్డీలు చెల్లిస్తున్నామని తెలిపారు. సొసైటీ మార్ట్(సూపర్ మార్కెట్) ద్వారా ఈ ఆర్థిక సంవత్సరం రూ.3.50లక్షల ఆదాయం లభించిందని, యాసంగి ధాన్యం కొనుగోలు ద్వారా రూ.21.90లక్షల కమీషన్ రావాల్సి ఉందన్నారు. గోల్డ్ లోన్స్, క్రాప్ లోన్స్ కర్షకమిత్ర లోన్స్, మార్ట్ బిజినెస్, సీడ్స్ అమ్మకాలు, పంథిని గోదాము, అంబేద్కర్‌నగర్ ఫంక్షన్ హాల్ నిర్వహణ నందనం సొసైటీ ద్వారా విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో సొసైటీ వైస్ చైర్మన్ టి.చందర్‌రావు, డైరెక్టర్లు బుచ్చిరెడ్డి, ఎలేంద్ర, రామచంద్రం, ఏసోబు, సంపత్‌రావు, కుమార్, బాబు, పద్మ, సీఈవో సంపత్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ బహుజన యోధుడు పాపన్నగౌడ్

● గోపా కోఆర్డినేటర్ తీగల జీవన్‌గౌడ్



పాపన్నగౌడ్ విగ్రహ ప్రతిష్ఠ భూమి పూజలో పాల్గొన్న నాయకులు

న్యూశాయంపేట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బహుజన యోధుడు సర్ధార్ సర్వాయి పాపన్నగౌడ్ అని గోపా కోఆర్డినేటర్ తీగల జీవన్ గౌడ్ అన్నారు. హనుమకొండ హంటర్ రోడ్‌లోని గౌడ హాస్టల్ ముందు సోమవారం సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ ప్రతిష్ఠ భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవన్‌గౌడ్ మాట్లాడుతూ భరతమాత ముద్దుబిడ్డ, తొలి తెలుగు చక్రవర్తి సర్ధార్ సర్వాయి పాపన్నగౌడ్ చరిత్ర ప్రపంచ ప్రసిద్ధిగాంచిందన్నారు. పాపన్నగౌడ్ స్ఫూర్తితో గౌడ కులస్థులందరు రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా ఉండి ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో గోపా వ్యవస్థాపక అధ్యక్షుడు పెరుమాండ్ల మధుసూదన్‌గౌడ్, డాక్టర్ బైరి లక్ష్మీనారాయణగౌడ్, పులి శ్రీనివాస్‌గౌడ్, చిర్ర రాజుగౌడ్, విగ్రహ ప్రతిష్ఠాపన సభ్యులు జనగాం శ్రీనివాస్‌గౌడ్, జూలూరి రంజిత్‌గౌడ్, బండారి జనార్ధన్‌గౌడ్, అనంతుల రమేష్‌గౌడ్, మార్క రవిగౌడ్, మాచర్ల శరత్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, కూనూరి రంజిత్‌గౌడ్, గట్టు నరేష్‌గౌడ్, గోపగాని వెంకటేశ్వర్లుగౌడ్, కార్పొరేటర్ పోశాల పద్మస్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గణిత విభాగం బీవోఎస్ చైర్మన్‌గా మల్లారెడ్డి



మల్లారెడ్డికి ఉత్తర్వులు ఇస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం

కేయూ క్యాంపస్ సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కేయూ గణిత విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా (బీవోఎస్)గా కేయూ మ్యాథ్స్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రొఫెసర్ మల్లారెడ్డి రెండేళ్ళ పాటు పదవిలో కొనసాగుతారు. ఇప్పటి వరకు బీవోఎస్‌గా పనిచేసిన డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్య నుంచి బాధ్యతలు చేపట్టనున్నారు. కాగా, ప్రొఫెసర్ మల్లారెడ్డి గతంలో కేయూ రిజిస్ట్రార్‌గా, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, సైన్స్ డీన్‌గా, అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా, పరీక్షల నియంత్రణాధికారిగా, వర్సిటీ పాలక మండలి సభ్యులుగా సేవలందించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డిని వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్ కుమార్, స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ ప్రొఫెసర్ వై.వెంకయ్య, ఏఆర్ డాక్టర్ కోల శంకర్ తదితరులు అభినందించారు.

బతుకమ్మ పూలకు వెళ్లి యువకుడి మృతి



లక్ష్మణ్ మృతదేహం

కన్నాయిగూడెం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ పూల సేకరణకు చెరువు వద్దకు వెళ్లిన యువకుడు నీటిలో మునిగి మృతి చెందిన సంఘటన ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని చిట్యాల గొత్తికోయగూడెంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై ఇనిగాల వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన సోడి లక్ష్మణ్ (22) జీవనోపాధి కన్నాయిగూడెం మండలంలోని చిట్యాల గొత్తికోయ గూడెంలో నివాసం ఉంటున్నాడు. తన పెదనాన్న నారాయణ వద్ద ఉంటూ కూలి పనులు చేసుకుంటున్నాడు. ముప్పనపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు బతుకమ్మ పూలు తీసుకురమ్మని చెప్పడంతో చిట్యాల సమీపంలోని చెరువు వద్దకు తన స్నేహితుడు రాజుతో కలిసి లక్ష్మణ్ వెళ్లాడు. పూలు సేకరించే క్రమంలో ప్రమాదవశాత్తు లోతు కు వెళ్లి నీటి మునిగాడు. ఈత రాకపోవడంతో బయటకు రాలేకపోయాడు. గమనించిన రాజు గ్రామస్థులకు సమాచారం అందించాడు. గ్రామస్థులు అక్కడికి వచ్చి చూడగా అప్పటికే లక్ష్మణ్ మృతి చెంది ఉన్నాడు. మృతుడి పెదనాన్న నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై తెలిపారు.

బన్న ఐలయ్యకు జాషువా పురస్కారం



ఖమ్మంలో అవార్డు తీసుకుంటున్న బన్న ఐలయ్య

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జాషువా సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఖమ్మంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో హనుమకొండ సుబేదారికి చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ బన్న ఐలయ్యకు మనకాలపు జాషువా పురస్కారాన్ని అందజేశారు. ముఖ్య అతిథిగా సాహితీవేత్త గిరిజ మనోహర్‌బాబు హాజరై ఐలయ్యకు పురస్కారం అందజేశారు. సభ అధ్యక్షులు ప్రముఖ కవివేదిక అధ్యక్షుడు క్రాంతి శ్రీనివాస్‌రావు, సంస్థ బాధ్యులు డాక్టర్ పగిడిపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మేడిగడ్డ బ్యారేజీకి భారీ వరద

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీకి వరద భారీగా పెరుగుతోంది. వారం రోజులుగా కురిసిన వర్షంతో పాటు ఎగువన కురుస్తున్న వర్షాలతో గోదావరి, ప్రాణహిత నదుల నుంచి భారీగా వరద నీరు తరలివస్తోంది. సోమవారం ఉదయం నుంచి క్రమంగా పెరుగుతూ వస్తున్న వరద సాయంత్రం వరకు ఉధృతమైంది. బ్యారేజీలోకి 11.37 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా గేట్లన్నీ ఎత్తి, అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద గోదావరి 10.10 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది. గోదావరి ఉధృతి పెరగడంతో వాగుల ద్వారా వచ్చే నీరు కమ్మేసీ బ్యాక్‌వాటర్ భారీగా పెరుగుతోంది.

సమరానికి సై

(5వ పేజీ తరువాయి)

మొదటి విడత అక్టోబరు 15, రెండవ విడత అక్టోబరు 19సాయంత్రం 3గంటల లోపు. అభ్యర్థుల జాబితా ప్రకటన అదే తేదీల్లో సాయంత్రం 3 గంటల తర్వాత.

- పోలింగ్ తేదీ మొదటి విడత అక్టోబర్ 23, రెండవ విడత అక్టోబర్ 27 ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు.
- ఓట్ల లెక్కింపు మొదటి విడత, రెండవ విడత నవంబర్ 11న ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమవుతుంది. అదే రోజు ఫలితాలను ప్రకటిస్తారు.

గ్రామ పంచాయతీ ఎన్నికలు

గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడు విడతలుగా జరుగుతా యి. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల మొదటి విడత అక్టోబర్ 17, ఎండవ విడత 21., మూడవ విడత అక్టోబర్ 25 తేదీల్లో ఉద యం 10.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల మధ్య.

- నమినేషన్ల దాఖలుకు చివరి తేదీ మొదటి విడత అక్టోబర్ 19, రెండో విడత 23, మూడో విడత 27న సాయంత్రం 5 గంటల వరకు
- అభ్యంతరాల దాఖలుకు చివరి తేదీ మొదటి విడత అక్టోబర్ 21, రెండవ విడత 25, మూడో విడత 29 సాయంత్రం 5 గంటల వరకు.
- నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ మొదటి విడత అక్టోబర్ 23, రెండవ విడత 27, మూడవ విడత 31 సాయంత్రం 3 గంటల లోపు
- పోలింగ్ మొదటి విడత అక్టోబర్ 31, రెండవ విడత నవంబర్ 4, నవంబర్ 8 ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు
- ఎన్నికల ఫలితాల లెక్కింపు అదే తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల తర్వాత చేపట్టి ప్రకటిస్తారు.

పూర్తయిన ఏర్పాట్లు

పోలింగ్ కేంద్రాల గుర్తింపు, రూట్ మ్యాపులు సిద్ధం చేయడం, సిబ్బంది నియామకం, వారికి శిక్షణ ఇవ్వడం తదితర ఏర్పాట్లు పూర్తయ్యాయి. పంచాయతీ ఎన్నికల కోసం కొత్త ఓటర్ల జాబితాలు సిద్ధమయ్యాయి. ఎన్నికల సంఘం ఆదేశానుసారం గ్రామం యూనిట్‌గా వార్డుల వారీగా ఓటర్ల జాబితాను తాజాగా తయారు చేశారు. గతంలో అనుబంధ గ్రామాలుగా ఉన్న పంచాయతీలు నేడు ప్రత్యేక పంచాయతీలుగా ఆవిర్భవించాయి. అందుకే పంచాయతీ కార్యదర్శులు ముందుగా పంచాయతీల వారీగా ఓటర్లను పోర్టల్‌లో నమోదు చేశారు. ఆ తర్వాత రెండో దశలో పంచాయతీలకు వచ్చిన ఓటర్లతో వార్డుల వారీగా విభజించారు.. ఈ ప్రక్రియలో ఒక కుటుంబ సభ్యుల ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకున్నారు. కొత్త జాబితాలో మృతుల పేర్లను తొలగించడంతో పాటు కొత్తగా ఓటు హక్కు కోసం నమోదు చేసుకున్నవారి పేర్లను చేర్చారు. ఒక్కో వార్డుకు 300 మందిలోపు ఓటర్లు ఉండేలా విభజన ప్రక్రియను చేపట్టారు. పోలింగ్‌కు అవసరమైన సామాగ్రి జిల్లా పంచాయతీ కార్యాలయాలకు ఇది వరకే చేరింది. మండలాల వారీగా అవసరమైన సామాగ్రి విభజన ప్రక్రియ కూడా పూర్తయింది. గ్రామాల సంఖ్యను దృష్టిలో పెట్టుకొని బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశారు. గ్రామాలు, వార్డుల వారీగా కావల్సిన బ్యాలెట్ పత్రాల అవసరాన్ని అంచనా వేశారు. ఇక ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులకు కేటాయించే గుర్తులు కూడా సిద్ధమయ్యాయి. సర్పంచ్ అభ్యర్థులకు 30 గుర్తులు, వార్డు సభ్యులకు 20 గుర్తులను ఆమోదించినరట్లుగా తెలుస్తోంది.


హనుమకొండలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


వరంగల్ ఉర్సు గుట్ట రంగలీలా మైదానంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


హనుమకొండలో వాయినం ఇచ్చిపుచ్చుకుంటున్న మహిళలు

సంబరంగా సద్దుల పండుగ

- ఉత్సాహంగా పాల్గొన్న మహిళా లోకం
- వెల్లువలా పూల జాతర
- సప్తవర్ణ శోభితమైన పద్మాక్షి ప్రాంగణం
- ఉమ్మడి జిల్లాలో జోరుగా సద్దుల సందడి


హనుమకొండ పద్మాక్షి ఆలయ ప్రాంగణంలో..


హనుమకొండలో


బతుకమ్మను నీటిలో వదులుతున్న మేయర్ సుధారాణి




వరంగల్‌లో బతుకమ్మను ఎత్తుకొని వస్తున్న మహిళలు


వరంగల్‌లో బతుకమ్మను వదులుతున్న యువతి

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తొమ్మిది రోజుల పాటు ఆట పాటలతో సాగిన బతుకమ్మల ప్రధాన ఘట్టమైన సద్దుల సందడితో ఉమ్మడి జిల్లా పులకరించి పోయింది. సోమవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో సద్దుల బతుకమ్మ వేడుకలను మహిళలు సంబురంగా జరుపుకున్నారు. పల్లెలు, పట్టణాలనే తేడా లేకుండా మహిళలంతా సమైక్యతను ప్రదర్శిస్తూ తటాకాల వద్దకు చేరుకొని ఆటపాటలతో సందడి చేస్తూ సద్దుల పర్వానికి శ్రీకారం చుట్టారు.

నగరంలోని హనుమకొండలో ప్రధానమైన పద్మాక్షి ఆలయ పరిసరాలకు సాయంత్రం 4 గంటల నుంచే మహిళలు బతుకమ్మలతో రావడం మొదలైంది. నగరంలోని బ్రాహ్మణవాడ, కుమార్‌పల్లి, కొత్తూరు, రాగన్న దర్వాజ, మచిలిబజార్, ఎక్సైజ్‌కాలనీ, రెవెన్యూ కాలనీ, కిషన్‌పురా తదితర అనేక ప్రాంతాల నుంచి మహిళలు జట్లు జట్లుగా పద్మాక్షి ప్రాంగణానికి 7 గంటల వరకుకూడా వస్తూ కనిపించారు. తీరొక్క పూలతో సందడి చేసిన బతుకమ్మలపై గౌరమ్మలను కొలువుదీర్చి అందంగా పేర్చిన బతుకమ్మలను చేబూని పద్మాక్షి ప్రాంగణానికి తరలివెళ్లారు. సద్దుల సంబరాల కోసం అధికార యంత్రాంగం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది. పోలీసు యంత్రాంగం మహిళా పోలీసులను రంగంలోకి దింపి బందోబస్తు నిర్వహించారు. నగరపాలక సంస్థ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసింది.





అన్ని దారులు పద్మాక్షి వైపే

నగరంలోని అన్ని ప్రాంతాల నుంచి వేలాదిగా మహిళలు పద్మాక్షి ప్రాంగణానికి తరలివచ్చారు. వరంగల్‌లోని పోతన ఆడిటోరియం, ప్రసిద్ధ భద్ర కాళి ఆలయ ప్రాంగణం, ఉర్సు కరీమాబాద్‌లోని రంగలీలా మైదానం, వరంగల్ కోట, కాజీపేటలోని వడ్డెపల్లి చెరువుకట్ట, కాశీబుగ్గలోని కోటి లింగాల దేవాలయం. కీర్తినగర్‌లోని కట్టమల్లయ్య ఆలయ ప్రాంగణం, సోమవారం నాటి సద్దుల బతుకమ్మ వేడుకలకు వేదికలుగా నిలిచాయి. వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి వరంగల్ పోతన నగర్‌లో, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి సతీమణి నీలిమా వడ్డెపల్లి, దేవాదాయ శాఖ ఏసీ రామాల సునీత భద్రకాళిలో, వినయ్‌భాస్కర్ సతీమణి రేవతి రడ్డెపల్లిలో బతుకమ్మలను ఆడారు. వీనితో పాటు అనేక మంది అధికారులు కూడా సంప్రదాయంగా నగరంలో జరిగిన సద్దుల వేడుకల్లో పాల్గొన్నారు.

వాయినాలు

సద్దుల బతుకమ్మలను తటాకంలో నిమజ్జనం చేసే ముందు 'తంగేడు పూవుల్ల చందమామ, మల్లెప్పుడొస్తావు చందమామ' అని పాడుకుంటూ మాయమ్మ లక్ష్మీ దేవి పోయిరావమ్మా అంటూ పిండితో చేసిన ప్రమిదలో నూనె పోసి వెలిగించిన జ్యోతులను నిమజ్జనానికి ముందు బతుకమ్మలపై అలంకరింపజేసి నిమజ్జనానికి తరలించారు. అలా నీటిలో తేలియాడే దీప కాంతులతో ఆ ప్రాంతమంతా ప్రత్యేక శోభను సంతరింపజేసుకుంది. బతుకమ్మలను అనేక మంది మహిళలు వాహనాలపై కూడా తరలించిన దృశ్యాలు కనిపించాయి. పద్మాక్షి మైదాన ప్రాంతమంతా మహిళల పాటలు వినిపించకుండా డీజే పాటల హోరు ప్రతిధ్వనించింది. బతుకమ్మలను నిమజ్జనం చేసే ముందు మహిళలు వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు. ఇంటి వద్ద చేసిన పిండి వంటలను వాయినాలు ఇచ్చి పసుపు కుంకుమలను ముత్తైదువలకు ఇస్తూ సద్దులను పంచే దృశ్యాలు బతుకమ్మల సంస్కృతిని చాటాయి. అలాగే, ఉమ్మడి జిల్లాలోని మహబూబాబాద్, వరంగల్, జనగామ, ములుగు, భూపాలపల్లి తదితర జిల్లా కేంద్రాలతోపాటు ఉమ్మడి జిల్లాలోని అన్ని గ్రామీణ ప్రాంతాల్లోనూ సద్దుల వేడుకలు సోమవారమే ఆడంబరంగా జరుపుకున్నారు. నగరంలోని అనేక అపార్ట్‌మెంట్‌లలో మహిళలు బతుకమ్మలను సందడిగా ఆడుకున్నారు.


జనగామ జిల్లా పాలకుర్తిలో మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి


జనగామ జిల్లా కేంద్రం బతుకమ్మ కుంట మైదానంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


భూపాలపల్లి పట్టణంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పస్రాలో బతుకమ్మ వేడుకలు


మహబూబాబాద్ జిల్లా మరిపెడలో బతుకమ్మను ఎత్తుకున్న ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్


మహబూబాబాద్ బతుకమ్మ విగ్రహం వద్ద ఎమ్మెల్యే మురళీనాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు


వరంగల్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


హనుమకొండలో..


వరంగల్‌లో బతుకమ్మతో యువతి..


వరంగల్‌లో బతుకమ్మతో వస్తున్న మహిళ


భూపాలపల్లి జిల్లా టేకుమట్లలో బతుకమ్మ వేడుకలు

జఫర్‌గఢ్ ఎస్సై రాంచరణ్ సస్పెన్షన్

వరంగల్ క్రైం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధి వెస్ట్‌జోన్‌లోని జఫర్‌గఢ్ ఎస్సై రాంచరణ్‌ను సస్పెండ్ చేస్తూ సీపీ సన్‌ప్రీత్‌సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. అవినీతికి పాల్పడడంతో పాటు బాధితులకు సకాలంలో న్యాయం చేయకపోవడం, భూ వివాదాల్లో జోక్యం చేసుకుంటున్నాడని పలువురు బాధితులు సీపీకి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో విచారణ అనంతరం సస్పెండ్ చేస్తూ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో సుబేదారి ఎస్సై రామారావును నియమించారు.

అదనపు ప్రభుత్వ న్యాయవాదిగా అమృతరావు నియామకం



వరంగల్ లీగల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు అదనపు ప్రభుత్వ న్యాయవాదిగా (అసిస్టెంట్ గవర్న మెంట్ ప్లీడర్) రొడ్డ అమృతరావును నియమిస్తూ ప్రభు త్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఈ పదవిలో ఆయన మూడు సంవత్సరాలపాటు కొనసాగుతారని ఉత్తర్వులో పేర్కొన్నారు. ఆయన వరంగల్ జిల్లా కోర్టులో గత 20 సంవత్సరాలుగా న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఆయన ఎంపికపట్ల పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

బతుకమ్మ సంబురాల్లో చిన్నారికి ఫిట్స్

వరంగల్ క్రైం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ పద్మాక్షిగుట్ట వద్ద సోమవారం సద్దుల బతుకమ్మ వేడుకల్లో 18 నెలల చిన్నారికి ఫిట్స్ వచ్చి పడిపోయింది. హనుమకొండ ఎస్సై కిషోర్ హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. కొత్తూరొజెండాకు చెందిన సింధుప్రియ తన ఇద్దరు పిల్లలతో సద్దుల బతుకమ్మ వేడుకలకు హాజరైంది. అప్పటికే అనారోగ్యంతో ఉన్న అక్షిత 18 నెలల చిన్నారికి ఫిట్స్ వచ్చి స్పృహ తప్పడంతో అక్కడే ఉన్న ఎస్సై కిషోర్ చిన్నారిని తన భుజంపై వేసుకొని వస్తుండగా కానిస్టేబుల్ రమణాకర్ ద్విచక్రవాహనానికి దారి ఇచ్చేందుకు వేలాదిగా ఉన్న మహిళలను జరుపుకుంటూ ద్విచక్ర వాహనం ముందు హనుమకొండ బస్టాండ్‌కు వెళ్లే మార్గంలో ఉన్న ఆంజనేయ దేవాలయం వరకు పరుగెత్తుకుంటూ వచ్చా డు. అక్కడే సమీపంలోని ఆస్పత్రిలో చేర్పించగా వైద్యులు పరీక్షించి వైద్యం అందించారు. ప్రస్తుతం చిన్నారి ఆరోగ్యం నిలకడగా ఉంది.


ఆస్పత్రిలో చిన్నారిని చేర్పించిన ఎస్సై కిషోర్

దుర్గామాత అలంకరణలో సద్దుల బతుకమ్మ

బయ్యారం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సద్దుల బతుకమ్మ వేడుకల్లో భాగంగా సోమవారం మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలో దుర్గామాత ఆకారంలోని ఓ బతుకమ్మ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్థానిక కాకతీయ నగర్‌కు చెందిన మారం హైమావతి అనే మహిళా దుర్గామాత ఆకారంలో రంగు రంగు పూలతో బతుకమ్మను పేర్చింది. వినూత్నంగా ఆలోచించి శిరస్సుతో పాటు ఏడు చేతుల్లో ఏడు బతుకమ్మలను పేర్చారు. కాగా గాంధీ సెంటర్‌లోని వేడుక వద్దకు వచ్చిన దుర్గామాత ఆకారంలోని సద్దుల బతుకమ్మను చూసిన ప్రజలు, మహిళలుకు సాక్షాత్తు దుర్గామాతే వేడుకలకు వచ్చిందా.. అన్నట్లు చర్చించుకున్నారు. దీంతో పలువురు మహిళలు బతుకమ్మతో సెల్ఫీ తీసుకున్నారు.


బయ్యారంలో దుర్గామాత అలంకరణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన సద్దుల బతుకమ్మ

విధులు.. బాధ్యత



మానుకోట ఎన్టీఆర్ స్టేడియం బతుకమ్మ వేడుకల్లో ఓ మహిళా కానిస్టేబుల్ చిన్నారిని ఎత్తుకుని మరీ విధులు నిర్వహించింది. ఒకవైపు విధులు.. మరోవైపు చిన్నారి బాధ్యతలు చూస్తూ ఆదర్శ మహిళగా నిలిచింది.

- మహబూబాబాద్ ఎడ్యుకేషన్

6న మందకృష్ణకు సన్మానం

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అక్టోబరు 6న కేయూలో ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగను సన్మానించనున్నట్లు కేయూ మాదిగ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పోడేటి శ్రీనివాస్, ఎన్.సుజాత తెలిపారు. ఈ మేరకు సోమవారం కేయూ గెస్ట్‌హౌస్‌లో ఎంఈఎఫ్ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్, సుజాతలు మాట్లాడారు. సమాజంలో ఎస్సీ ఉపకులాల వర్గీకరణ సాధించి అసమానతలను తొలగించేందుకు కృష్ణమాదిగ కృషి గొప్పదన్నారు. పద్మశ్రీ పురస్కారం లభించడం అణగారిన వర్గాలకుదక్కిన గౌరమన్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నేతలు రాజనీతిశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్, మంద శ్యామ్, సుమన్, మహర్షి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన రైతు బిడ్డ

రఘునాథపల్లి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతు బిడ్డ గ్రూప్-2లో సత్తాచాటింది. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కోమల్ల గ్రామానికి రైతు మల్లారెడ్డి కూతురు కంసాని శ్రావణి (చెవిటి) గ్రూప్-2లో 185 ర్యాంక్ సాధించి రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించింది. రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న శ్రావణి, గ్రూపు-2లో సత్తా చాటింది.



గ్రూపు-1లో సత్తా చాటిన అరుంధర్‌రావు



నర్మెట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రూపు-1 పరీక్షల్లో సత్తా చాటి గద్దల అరుంధర్ రావు ఎంపీడీవోగా ఉద్యోగ అర్హత సాధించాడు. నర్మెట మండలంలోని గండిరామవరం గ్రామానికి చెందిన అమృతరావు - కవిత న్యాయవాదుల దంపతుల పెద్ద కుమారుడు అరుంధర్ రావు హైదరాబాద్‌లోని నారాయణ స్కూల్‌లో పదో తరగతి, నారాయణ కాలేజ్‌లో ఇంటర్, శ్రీనగర్‌లో ఎన్ఐటీ చేశాడు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి వెళ్లకుండా యూపీఎస్సీకి ప్రిపేర్ అయ్యాడు. ఈ క్రమంలోనే గ్రూపు-1 పరీక్షను 2024 అక్టోబర్‌లో రాశాడు. తాజాగా వెలువడిన గ్రూపు-1 ఫలితాల్లో 664 ర్యాంక్ సాధించి ఎంపీడీవోగా అర్హత పొందాడు.

గ్రూపు-2లో మెరిసిన కావేరి



నర్మెట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన గ్రూపు-2 ఫలితాల్లో నర్మెట మండలంలోని వెల్దండ గ్రామానికి చెందిన ఏలూరి కావేరి రాష్ట్ర స్థాయిలో 777 ర్యాంకు సాధించి ఎంపీవోగా ఎంపికైంది. ఏలూరి అంజిరెడ్డి సరితల పెద్ద కుమార్తె కావేరి గతంలో గ్రూపు-4లో సత్తాచాటి జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికైంది. జనగామలో విధులు నిర్వహిస్తూనే గ్రూప్స్‌కు ప్రిపేరు అవుతూవచ్చింది. గ్రూపు-3లో కూడా అర్హత సాధించింది. ఈక్రమంలోనే గ్రూపు-2 పరీక్ష కూడా రాసింది. తాజాగా విడుదలైన గ్రూపు-2 ఫలితాల్లో సత్తా చాటి ఎంపీవోగా ఎంపికైంది.

ఎక్సైజ్ ఎస్సైగా సిద్దెంకి యువకుడు



జనగామ కల్చరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జనగామ మండలం సిద్దెంకి గ్రామానికి చెందిన యువకుడు ఎక్సైజ్ ఎస్ఐగా ఎంపికయ్యారు. 28న విడుదలైన గ్రూప్-2 ఫలితాల్లో గ్రామానికి చెందిన సుంకరి నిర్మల-శ్రీనివాస్‌రెడ్డి దంపతుల కుమారుడు కేదారీశ్వర్‌రెడ్డి రాష్ట్ర స్థాయిలో 112వ ర్యాంకు సాధించి ఎక్సైజ్ ఎస్ఐగా ఎంపికయ్యారు. ప్రస్తుతం జనగామలోని పౌరసరఫరాల శాఖలో పని చేస్తున్న ఆయన ఏడాది పాటు కష్టపడి చదివి గ్రూప్-2కు ఎంపికయ్యాడు.

డిప్యూటీ తహసీల్దార్‌గా శివ



పాలకుర్తి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఓ వైపు ఎస్సైగా విధులు నిర్వహిస్తూనే మరోవైపు శివ డిప్యూటీ తహసీల్దార్‌గా కూటికంటి శివ ఎంపికయ్యాడు. గ్రూపు 2లో 414 మార్కులతో 25 ర్యాంకు సాధించి ఉద్యోగానికి ఎంపికయ్యాడు. జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని తిర్మలగిరి గ్రామానికి చెందిన కూటికంటి వెంకన్న, లక్ష్మీ దంపతుల మొదటి సంతానమైన శివ డిగ్రీ చేయగా, 2019లో ఎస్సైగా ఉద్యోగం సాధించాడు. మంచిర్యాలలో తొలి పోస్టింగ్ సాధించగా ప్రస్తుతం మహబూబాబాద్ టౌన్ ఎస్సైగా శివ పని చేస్తున్నాడు. అంతకు ముందు 2017లో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో (ఎఫ్‌సీఐ) జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం, 2018లో ఆర్పీఎఫ్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఉద్యోగంచేస్తూనే గ్రూప్స్‌కు ప్రిపేర్ అయ్యాడు. తండ్రి వెంకన్న వ్యవసాయం, తల్లి లక్ష్మీ గృహిణి.


హనుమకొండ సిస్టేర్ అపార్ట్‌మెంట్‌లో...


హనుమకొండ బ్రాహ్మణవాడలో...


గోపాల్‌పూర్ బృందావన కాలనీలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు


హనుమకొండ నాగార్జున హోండా షోరూంలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఎండీ విజయలక్ష్మి తదితరులు


లోటస్ కాలనీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


కాజీపేటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

గంగమ్మ ఒడికి గౌరమ్మ..

- అంబరాన్నంటిన సద్దుల బతుకమ్మ సంబురాలు
- ఉయ్యాల పాటలతో మార్మోగిన ఆలయాలు, కూడళ్లు

వడ్డేపల్లి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని వివిధ డివిజన్లలో సద్దుల బతుకమ్మ వేడుకలను సోమవారం అంబరాన్నంటే విధంగా నిర్వహించుకున్నారు. డివిజన్లలోని ఆలయాలు, వీధులు, కూడళ్లు, మైదానాలలో బతుకమ్మలను భక్తి ప్రపత్తులతో కొలిచారు. ఉయ్యాల పాటలతో ఆలయాలు, వీధులు, కాలనీలు మార్మోగాయి. హనుమకొండ 55వ డివిజన్ బృందావన కాలనీలో కాలనీ అధ్యక్షుడు రచ్చ నాగేశ్వర్‌రావు, ప్రతినిధులు జక్కుల శ్రీనివాస్, లక్ష్మీనర్సయ్య ఆధ్వర్యంలో మహిళలు రచ్చ పద్మ, బురుద రాజు వాణి, బొల్లేని పద్మ, ధమయంతి, నిర్మల బతుకమ్మలను కాలనీలోని కూడలికి తరలించారు. ఒకే చోట మహిళలంతా బతుకమ్మలను ప్రత్యేకంగా అలంకరించిన వేదిక వద్ద చేర్చి గౌరమ్మను భక్తి ప్రపత్తులతో కొలిచారు.

హనుమకొండ 56వ డివిజన్‌లోని జవహర్‌కాలనీలో అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బైరి సోమయ్య, ప్రతినిధులు చెరుకు శ్రీనివాస్, కొత్తపెల్లి అమర్ ఆధ్వర్యంలో స్థానిక కార్పొరేటర్ సిరంగి సునిల్‌కుమార్, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కొంక హరిబాబు, బీజేపీ జోనల్ అధ్యక్షుడు బండి హరీష్‌ముదిరాజ్ పర్యవేక్షణలో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. హమకొండ 57వ డివిజన్‌లోని వేణుగోపాలస్వామి దేవాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు బంక సరళ సంపత్ యాదవ్ ఆధ్వర్యంలో, డివిజన్‌లోని వికాస్‌నగర్‌లో కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పులి వీరారెడ్డి, మందాడి యాదగిరిరెడ్డి, దొండపాటి రత్నాకర్‌రెడ్డి, పల్లె రవీందర్‌రెడ్డి, బండి రాజు, శ్యాంసుందర్ పర్యవేక్షణలో శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో మహిళలు భక్తి ప్రపత్తులతో బతుకమ్మలను కొలిచి గౌరమ్మను ఆరాధించారు. 58వ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకురాలు మండల సంధ్య ముదిరాజ్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను మహిళలు నిర్వహించుకున్నారు. హనుమకొండ వడ్డేపల్లిలోని శివాలయం వద్ద బతుకమ్మ వేడుకలను నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు సత్తు పిండి, పిండి పదార్థాలు పంపిణీ చేసుకొని వాయినాలను ఇచ్చి పుచ్చుకున్నారు. బతుకమ్మలను చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు.

నాగార్జున హోండా షోరూం ఆధ్వర్యంలో..

హనుమకొండ టౌన్ : గ్రేటర్ వరంగల్ పరిధిలో బతుకమ్మ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ములుగు రోడ్‌లోని నాగార్జున హోండా షోరూం ఆధ్వర్యంలో మహిళలు బతుకమ్మలను పేర్చి బతుకమ్మ ఆడిపాడురు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ ముప్పసాని విజయలక్ష్మి, జనరల్ మేనేజర్ చైతన్య జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.


మడికొండలో బతుకమ్మలతో వెళ్తున్న కార్పొరేటర్ రాధికారెడ్డి మహిళలు

లోటస్ కాలనీలో..

రెడ్డికాలనీ : సద్దుల బతుకమ్మ పండుగను సోమవారం లోటస్ కాలనీలో వైభవంగా నిర్వహించుకున్నారు. తీరొక్క పూలతో రంగురంగుల బతుకమ్మలను పేర్చి మహిళలు ఆడిపాడారు. కేయూ రోడ్‌లోని లోటస్ కాలనీలో 4వ డివిజన్ కార్పొరేటర్ బొంగు అశోక్ యాదవ్ సహకారంతో ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు గజ్జెల సురేందర్‌నాథ్, శ్రీనివాస్, సృజన్, నవీన్, శ్రీను, ఎస్.రాజు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వడ్డేపల్లి ట్యాంక్‌బండ్ వద్ద

కాజీపేట : కాజీపేటలో వివిధ ప్రాంతాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. 61వ డివిజన్ ట్యాంక్‌బండ్ వద్ద సోమవారం సద్దుల బతుకమ్మ సందర్భంగా వేలాదిగా మహిళలు ట్యాంక్‌బండ్ వద్దకు చేరుకుని ఆటపాటలతో సంబరాలు జరుపుకున్నా రు. భారత యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి తక్కళ్లపల్లి సాగరిక రమాకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ట్యాంక్ బండ్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టేజీపై వందలాది మహిళలు, పిల్లలు సంప్రదాయ దుస్తులతో బతుకమ్మ ఆడారు.. సీనియర్ డ్యాన్స్ మాస్టర్ ఎండీ.రఫీ ఆధ్వర్యంలో మహిళలు, చిన్నారులు బతుకమ్మ ఆడారు. గంటన్నర సేపు ఆపకుండా బతుకమ్మ ఆడిన పలువురు చిన్నారులకు రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గొట్టిముక్కుల రమాకాంత్‌రెడ్డి బహుమతులు అందజేశారు. డీజిల్‌కాలనీ, రైల్వేకాలనీలో సైతం బతుకమ్మ వేడుకలు పెద్ద ఎత్తున జరుపుకున్నారు. బతుక మ్మ ఉత్సవాలు జరిగే ప్రాంతాల్లో శాంతిభద్రతలకు ఎలాంటి ఇబ్బందులు జరుగకుండా స్థానిక ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్‌రెడ్డి భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

మడికొండలో..

మడికొండ : మడికొండలో పూల పం డుగ సద్దుల బతుకమ్మను సోమవారం వైభవంగా జరుపుకున్నారు. సాయంత్రం మెట్టుగుట్ట, బురుజు వద్ద మహిళలంతా ఒక్కచోట చేరి ఉత్సాహంగా బతుకమ్మ ఆడి పాడారు. 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డి మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. 64వ డివిజన్ టేకులగూడెం, 46వ డివిజన్ రాంపూర్, 45వ డివిజన్ కడిపికొండ, అయోధ్యాపురం, తరాలపల్లి, కుమ్మరిగూడెం గ్రామాల్లో మహిళలు బతుకమ్మ పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్, ఎస్సైలు రాజ్‌కుమార్, రాంమోహన్ పోలీస్ సిబ్బందితో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యుత్ ఏఈ అనిల్‌రెడ్డి స్వయంగా సిబ్బందితో పర్యవేక్షించి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూశారు.

నిట్‌లో..

హనుమకొండ : బతుకమ్మ పండుగకు విశిష్టమైన చారిత్రక నేపథ్యం, విలక్షణమైన సాంస్కృతిక ఔన్నత్యం ఉందని వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుధి అన్నారు. వరంగల్ నిట్ ప్రాంగణంలో గురువారం బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుధి బతుకమ్మ వేడుకలను ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో నిట్ విద్యార్థినులు, ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



హనుమకొండలో బతుకమ్మలతో వెళ్తున్న మహిళలు



హనుమకొండలో..
మడికొండలో నిమజ్జనం చేస్తున్న మహిళ


హనుమకొండలో బతుకమ్మలతో వెళ్తున్న మహిళలు

వాషింగ్టన్‌లో బతుకమ్మ సంబురాలు

హనుమకొండ టౌన్ (ఆంధ్రజ్యోతి) : అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీలో గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ (జీటీఏ) ఆధ్వర్యంలో సోమవారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా కుడా మాజీ చైర్మన్, ఓబీసీ చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ పాల్గొని మాట్లాడారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టి పడేవిధంగా మహిళలు బతుకమ్మ వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జీటీఏ సంస్థ చైర్మన్ విశ్వేశ్వర కలువల, వాషింగ్టన్ డీసీ అధ్యక్షుడు ముంద్రాతి రాము, మాజీ అధ్యక్షుడు మునుకుంట్ల తిరుమల్, సుధీర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


వాషింగ్టన్‌లో బతుకమ్మ వేడుకలకు హాజరైన సుందర్‌రాజ్ యాదవ్

సద్దుల బతుకమ్మ వేడుకల్లో ఎంపీ కావ్య

హనుమకొండ (ఆంధ్రజ్యోతి) : వరంగల్ ఎంపీ డాక్టర్ కావ్య సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి సద్దుల బతుకమ్మను వేడుకగా జరుపుకున్నారు. హనుమకొండ కనకదుర్గకాలనీలోని తన నివాసంలో డాక్టర్ కావ్య కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మను పేర్చారు. అనంతరం బంధువులు, స్నేహితులు, మహిళలతో పాల్గొని బతుకమ్మ చుట్టూ ఆడిపాడారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం అంతటా సద్దుల బతుకమ్మ సందడి విశేషంగా సాగుతుండగా ఎంపీ కుటుంబ సభ్యులతో కలిసి ఆడిన బతుకమ్మ స్థానికులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కావ్య మాట్లాడుతూ సద్దుల బతుకమ్మ కేవలం ఒక పండుగ మాత్రమే కాదని మహిళాశక్తి, ఐక్యత, సంప్రదాయాల సమ్మేళనంగా పేర్కొన్నారు.


కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మలతో ఎంపీ కావ్య


వెహికిల్ షెడ్డును పరిశీలిస్తున్న కమిషనర్ చహత్, అధికారులు

ప్రహరీ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : బాలసముద్రంలోని వెహికిల్ షెడ్డు వద్ద కాంపౌండ్‌వాల్ నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ వెహికిల్ షెడ్డు ప్రాంతంలోని నిర్మిస్తున్న కాంపౌండ్ పనులతో పాటు అదే ప్రాంతంలో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇండ్ల వద్ద నీటి సరఫరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కాంపౌండ్ వాల్ పనులు ఇప్పటికే వెనకబడ్డాయని పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. డబుల్‌బెడ్ రూంలకు నగర పాలక సంస్థ నుంచి నీటిని అందించడం జరుగుతుందని, విడిగా నీటిని అందించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. ఈ ప్రాంతంలో డ్రైయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందని సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేసి ప్రజలకు సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, ఈఈ రవికుమార్, డీఈ రాజ్‌కుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కేయూ విద్యా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా శ్రీనివాస్


శ్రీనివాస్‌కు ఉత్తర్వులు ఇస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కేయూ విద్యా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా డాక్టర్ నల్లాని శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీనివాస్ ఏడాది కాలం, తిరిగి ఉత్తర్వులు వెలువడే వరకు ప్రిన్సిపాల్‌గా విధుల్లో కొనసాగుతారని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు కేయూ క్యాంపస్ కళాశాల విద్యాకళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా విధుల్లో ఉన్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంనుంచి సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. శ్రీనివాస్‌ను పలువురు బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

కొనసాగుతున్న శరన్నవరాత్రోత్సవాలు

- సరస్వతీమాతగా అమ్మవారు

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, నీలిమా దంపతుల సహకారంతో వైభవంగా నిర్వహిస్తున్న రుద్రేశ్వరి అమ్మవారి శరన్నవరాత్రి వేడుకలు సోమవారం 8వ రోజుకు చేరుకున్నాయి. నిత్య పూజాదికాలు, చోడచోపచార పూజ అనంతరం మూల నక్షత్ర తిథికి అనుకూలంగా వీణపాణి అయిన సరస్వతిమాతగా అలంకరింపజేసి పూజాధికాలు నిర్వహించారు. చదువుల తల్లి సరస్వతిమాతను నవరాత్రి వేడుకల్లో సందర్శించిన భక్తులకు విజ్ఞానం వికసిస్తుందని, జీవితంలో సుఖశాంతులు ఉంటాయని ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ వ్యాఖ్యానించారు. నిత్యహోమంతో పాటు సీఎంఆర్ షాపింగ్‌మాల్ ఆధ్వర్యంలో మహా అన్నదానం నిర్వహించారు. సరస్వతిదేవి పేరిట మణికంఠశర్మ, ప్రణవ్, సందీప్‌శర్మల ఆధ్వర్యంలో వైదిక హోమం నిర్వహించారు. ఆలయ ఈవో డి.అనిల్‌కుమార్ పర్యవేక్షించారు. మాడిశెట్టి రాజు, దివ్య, కిషన్‌లాల్ తదితరులు సేవలందించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలకు బదులు అనేక మంది మహిళలు సద్దుల బతుకమ్మను చేబూని ఆలయ ప్రాంగణంలో బతుకమ్మ ఆటలతో సందడి చేశారు.


హనుమకొండ సుధానగర్‌లో అన్నదానం చేస్తున్న సిరాజుద్దీన్

దుర్గామాత సేవలో ముస్లిం నాయకుడు

హనుమకొండ చౌరస్తా : దుర్గామాత నవరాత్రోత్సవాల్లో భాగంగా ముస్లిం మైనారిటీ నాయకులు, మాజీ డిప్యూటీ మేయర్ ఖాజా సిరాజుద్దీన్ సోమవారం అన్నదానం నిర్వహించి భక్తిని చాటుకున్నారు. హనుమకొండ 9వ డివిజన్ సుధానగర్‌లో నేస్తం యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గామాత మండపం వద్ద సిరాజుద్దీన్ అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో నేస్తం యూత్ సభ్యులు, స్థానికులు, భక్తులు పాల్గొన్నారు.


సరస్వతీమాతగా అమ్మవారు

అన్నదానం

వరంగల్ కార్పొరేషన్ : హనుమకొండ 5వ డివిజన్‌లోని కొత్తూరుజెండ సుభాస్ నగర్‌లో దేవీశరన్నవరాత్రి ఉత్స వాల సందర్భంగా సోమవారం 8వ రోజు ఈశ్వరపుత్ర గజానణ మండలి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ నాయకులు తాడిశెట్టి విద్యాసాగర్ హాజరై అన్నదానం చేశారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ.. అన్నిదానాల్లోకెల్ల అన్నదానం గొప్పదని అన్నారు. సుమారు 500 మందికి అన్నదానం చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రాకేశ్, రాజేశ్, సతీష్, మ ధు, అక్షయ్, లడ్డు, రాజు పాల్గొన్నారు.

దుర్గా నవరాత్రులు

నేటి అలంకారం

శ్రీ దుర్గాదేవి

ఆశ్వయుజ శుద్ధ అష్టమి (దుర్గాష్టమి) మంగళవారం

శరన్నవరాత్రి మహోత్సవాల్లో నేడు శ్రీ దుర్గాదేవిగా విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ దర్శనమిస్తారు. ఈ అవతారంలో అమ్మ దుర్గముడనే రాక్షసుడిని ఈ అష్టమి తిథి రోజునే సంహరించినట్లు పురాణాలు చెబుతున్నాయి. అందుకే ఈ అష్టమిని 'దుర్గాష్టమి' అని వ్యవహరిస్తారు. 'దుర్గే దుర్గతినాశని'... ఈ రోజున అమ్మవారి దర్శనంతో దుర్గతుల నుంచి తప్పించుకోవచ్చనేది భక్తుల ప్రగాఢ విశ్వాసం. పంచ ప్రకృతి మహాస్వరూపాల్లో దుర్గా రూపం మొదటిది. భవబంధాలలో చిక్కుకున్న మానవుడిని ఈ మాత అనుగ్రహించి మోక్షాన్ని ప్రసాదిస్తుందనీ, కోటి సూర్యప్రభలతో వెలుగొందే అమ్మను అర్చిస్తే శత్రుబాధలు తొలుగుతాయనీ, సర్వత్రా విజయం ప్రాప్తిస్తుందనీ నమ్మిక. ఆయురారోగ్యాలను ప్రసాదించే దివ్యరూపిణి దుర్గమ్మ దర్శనం సకల శ్రేయోదాయకం.




నైవేద్యం:
గారెలు, చిత్రాన్నం

అలంకరించే చీర రంగు:
ఎరుపు

వేటితో అర్చించాలి:
గులాబీలు, ఎర్రటిపూలు, కుంకుమ, ఎర్రటి అక్షతలు

పారాయణ:
దుర్గా సూక్తం, దుర్గా సప్తశ్లోకి

హియరింగ్ లాస్



వినికిడి పరికరం వాడకాన్ని చిన్నతనంగా భావించి దాని జోలికి వెళ్లని వాళ్లుంటారు. వినికిడి లోపం ఉన్నా ఆ విషయాన్ని ఒప్పుకోడానికి తటపటాయించే వాళ్లుంటారు. 'వినికిడి పూర్తిగా పోయినప్పుడు ఆలోచిద్దాంలే!' అనుకుంటూ హియరింగ్ ఎయిడ్స్ వాడకానికి దూరంగా ఉండిపోయే వాళ్లుంటారు. కానీ వీటిని వాడకపోవడం వల్ల, దాన్ని ఉపయోగించుకునే సామర్థ్యం క్రమేపీ తగ్గిపోయి, వినికిడిని పూర్తిగా కోల్పోయే ప్రమాదం ఉందంటున్నారు వైద్యులు



వినికిడి లోపిస్తే?

వినికిడి లోపం జీవితంలో ఎప్పుడైనా తలెత్తవచ్చు. పుట్టుకతోనే ఈ లోపం ఉండొచ్చు. వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లు, కొన్ని రకాల మందులు, పైబడే వయసు, పెద్ద శబ్దాలకు బహిర్గతమవడం వల్ల కూడా వినికిడి లోపం తలెత్తవచ్చు.

వృద్ధాప్యం: పైబడే వయసులో కంటిచూపు తగ్గినట్టే, 50 ఏళ్ల పైబడిన తర్వాత వినికిడి శక్తి కూడా తగ్గుముఖం పడుతుంది. ఈ సమస్య వంశపారంపర్యంగా కూడా సంక్రమిస్తుంది. అయితే, సాధారణంగా వినికిడి శక్తి తగ్గడం మొదలుపెట్టినప్పుడు పైబడే వయసులో ఇదంతా మామూలే అనుకుంటూ హియరింగ్ ఎయిడ్ వాడకాన్ని నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు. కానీ హియరింగ్ ఎయిడ్ వాడకంతో కోల్పోయిన వినికిడి శక్తిని తిరిగి తీసుకురాలేకపోయినప్పటికీ, వినికిడి పరికరాన్ని ఉపయోగించుకునే సామర్థ్యం తగ్గకుండా ఉంటుంది. కాబట్టి సమస్యను గుర్తించిన వెంటనే హియరింగ్ ఎయిడ్‌ను వాడుకోవడం మొదలుపెట్టాలి. మరీ ముఖ్యంగా వినికిడి శక్తి లోపించడం వల్ల ఆత్మవిశ్వాసం దెబ్బతిని, నలుగురిలో కలవలేక, మానసిక కుంగుబాటుకు లోనై, ఒంటరిగా గదికే పరిమితమైపోతూ ఉంటారు. దాంతో జీవన నాణ్యత కూడా దెబ్బ తింటుంది. కాబట్టి ఈ సమస్యను నిర్లక్ష్యం చేయకూడదు.

పుట్టుకతోనే: పుట్టుకతోనే సంక్రమించే జన్యుపరమైన వ్యాధుల్లో వినికిడి లోపం కూడా ఒకటి. మేనరికం వివాహాల్లో పుట్టిన పిల్లల్లో ఈ సమస్య సహజం.

వ్యాధులు: మలేరియా, టైఫాయిడ్ లాంటి వైరల్ జ్వరాలు, వైరల్ ఇన్‌ఫెక్షన్లు వినికిడికి సంబంధించిన నాడిని దెబ్బతీస్తాయి.

మందులు: జెంటామైసిన్, అమికాసిన్ లాంటి ఆటోటాక్సిక్ మందులు, కీమోథెరపీ మందులు, మలేరియా మందుల వాడకం వల్ల కూడా లోపలి చెవి దెబ్బతిని వినికిడి శక్తి తగ్గవచ్చు.

పిల్లల్లో వినికిడి లోపం

మేనరికం వివాహాల వల్ల లేదా ఇతరత్రా జన్యు సమస్యల వల్ల కొందరు పిల్లలు పుట్టుకతోనే వినికిడి సమస్యను వెంట తెచ్చుకుంటారు. ఇలాంటి సందర్భాల్లో పసికందులు శబ్దాలకు స్పందించడం లేదని గ్రహించిన వెంటనే 'బేరా' (బ్రెయిన్ స్టెమ్ ఎవోక్‌డ్ రెస్పాన్స్ ఆడియోమెట్రీ పరీక్ష చేయించాలి. ఈ పరీక్షతో పసికందుల వినికిడి లోపం ఏ మేరకు ఉందన్నది తెలుస్తుంది. అలాగే పది నెలలు దాటిన పిల్లలు చప్పుళ్లకు స్పందించకపోయినా, ఈ పిల్లలకు మాటలు రాకపోతున్నా వెంటనే అప్రమత్తం కావాలి. ఏడాది లోపున్న పసిపిల్లల్లో వినికిడి శక్తి లోపిస్తే, కోక్లియర్ ఇంప్లాంట్ అమర్చవలసి ఉంటుంది. దీంతో వినికిడి శక్తి పెరిగి పిల్లల ఎదుగుదల ఆరోగ్యకరంగా సాగుతుంది. ఈ ఇంప్లాంట్‌ను అమర్చడం కోసం వైద్యులు పుర్రె లోపల వినికిడి నాడికి ఎలక్ట్రోడ్స్‌ను అనుసంధానించి, కోక్లియాను అమరుస్తారు. చెవి దగ్గర బహిర్గతమయ్యే విడి భాగంలో అవసరాన్ని బట్టి బ్యాటరీలను మార్చుకుంటూ పిల్లలు జీవితకాలం పాటు ఈ వినికిడి పరికరాన్ని వాడుకోవచ్చు.

అకస్మాత్తుగా వినికిడి కోల్పోతే...

కారణం ఏదైనా అకస్మాత్తుగా వినికిడి శక్తి కోల్పోతే, తిరిగి వచ్చేస్తుందిలే అని తాత్సారం చేయడం సరి కాదు. ఇలాంటి సంర్భాల్లో ఎంత త్వరగా చికిత్స అందించగలిగితే, వినికిడి శక్తి అంత త్వరగా తిరిగొస్తుంది. ఇలాంటి సందర్భాల్లో వెంటనే వైద్యులను సంప్రతించగలిగితే, చెవిలోకి ఇంజెక్షన్ ఇవ్వడం ద్వారా కోల్పోయిన వినికిడి శక్తిని తిరిగి తెప్పించవచ్చు.



ఇది తాత్కాలికమే!

వానాకాలంలో సాధారణ జలుబులతో తాత్కాలిక వినికిడి లోపం తలెత్తవచ్చు. సాధారణంగా ఇది పిల్లల్లో కనిపిస్తూ ఉంటుంది. అలాగే అలర్జీల వల్ల, చలికి బహిర్గతమవడం వల్ల, జలాంతర క్రీడల వల్ల, విమానం నేల మీదకు దిగేటప్పుడు కర్ణభేరి మీద ఒత్తిడి పెరిగి, చెవిపోటు, తాత్కాలిక వినికిడి లోపం తలెత్తవచ్చు. విమానం కిందకు దిగే సమయంలో చెవి పోటు, దిబ్బెడ వేధించే సమస్య ఉన్నవాళ్లు ప్రయాణానికి ముందు ఆవిరి పట్టుకోవాలి. అలాగే విమానం దిగడానికి అరగంట ముందు యాంటీ హిస్టమిన్ మాత్ర వేసుకోవాలి. అలాగే అలర్జీలు, జలుబులకు చికిత్స తీసుకోవాలి. వీటితో తాత్కాలిక వినికిడి లోపం తగ్గిపోతుంది. పబ్‌లు, డిజెల్లోని బిగ్గర శబ్దాలకు బహిర్గతమైన తర్వాత చెవిలో గుయ్యిమనే శబ్దంతో పాటు వినికిడి తగ్గితే వెంటనే వైద్యులను కలిసి చెవి ఇంజక్షన్లు తీసుకోవాలి. లేదంటే కోల్పోయిన వినికిడి శక్తి తిరిగొచ్చే వీలుండదు. ఇలా జరగకుండా ఉండాలంటే, బిగ్గర శబ్దాలతో కూడిన ప్రదేశాలను సందర్శించేటప్పుడు, స్పీకర్లకు దూరంగా ఉంటూ, ఇయర్ ప్లగ్స్ వాడుకోవాలి. అలాగే దీపావళి నాడు టపాసులు కాల్చే సమయంలో కూడా ఇయర్ ప్లగ్స్ వాడుకోవాలి. అయితే అప్పటికే చెవి సమస్యలతో బాధపడుతున్న వాళ్లు టపాసుల శబ్దాలకు ఏమాత్రం బహిర్గతం కాకుండా, గదులకే పరిమితం కావాలి.

డాక్టర్ సుధీర్ రెడ్డి తల్లపురెడ్డి
కన్సల్టెంట్ ఇ.ఎన్.టి,
హెడ్ అండ్ నెక్ సర్జన్,
3 సెన్సెస్ ఇ.ఎన్.టి స్పెషాలిటీ క్లినిక్,
హబ్సిగూడ, హైదరాబాద్.



మీకు తెలుసా?

ప్రజా టాయిలెట్స్ వాడితే?

కొత్త ప్రదేశాలకు వెళ్లినప్పుడు ప్రజా టాయ్‌లెట్స్‌ను వాడుకోక తప్పదు. అయితే టాయిలెట్ సీట్ మీద కూర్చోవలసివచ్చినపుడు, అలా కూర్చోడం సురక్షితమేనా? అనే అనుమానం ప్రతి ఒక్కరికీ కలుగుతుంది. నిజానికి ఆరోగ్యవంతులైన వ్యక్తులకు టాయ్‌లెట్ సీట్ మీద కూర్చున్నంత మాత్రాన ఇన్‌ఫెక్షన్లు



సోకవు. అలాగని అపరిశుభ్రమైన టాయ్‌లెట్ మీద నేరుగా కూర్చోకుండా, ఆల్కహాల్ వైప్‌తో సీట్ తుడిచి కూర్చోవాలి. నిజానికి టాయ్‌లెట్ సీట్‌ను మించిన ముప్పులు బాత్‌రూమ్‌లో పొంచి ఉంటాయి. డోర్ హ్యాండిల్స్, ఫాసెట్ నాబ్స్, టాయిలెట్ ఫ్లష్ లీవర్స్, అపరిశుభ్రమైన చేతుల్లోనే లెక్కలేనన్ని వ్యాధికారక సూక్ష్మక్రిములు తిష్ట వేసి ఉంటాయి. కాబట్టి వాటి పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలి. వాటిని తాకిన ప్రతిసారీ చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలి.

పరిశోధన

ఎయిర్‌పాడ్స్‌తో అధిక రేడియేషన్

సాధారణ ఇయర్‌ఫోన్స్‌తో పోలిస్తే, ఎయిర్‌పాడ్స్ 150 రెట్లు ఎక్కువ రేడియేషన్‌ను వెలువరిస్తాయని తాజా పరిశోధనలో తేలింది. ఎయిర్‌పాడ్స్‌తో అధిక రేడియేషన్‌కు బహిర్గతమవడంతో పాటు ప్రతిరోజూ వాటిని వాడుతూ ఉండడం వల్ల దీర్ఘకాలంలో మెదడు ఆరోగ్యం మీద తీవ్ర ప్రభావం పడుతుందని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. కాబట్టి ఎయిర్‌పాడ్స్‌కు బదులుగా సాధారణ ఇయర్‌ఫోన్స్‌ను ఎంచుకోవడం సురక్షితం. అలాగే రోజంతా ఎయిర్‌పాడ్స్‌ను ధరించకుండా తరచూ విరామం తీసుకుంటూ ఉండాలి. ఫోన్ కాల్స్‌ను తక్కువ సమయాలకే పరిమితం చేయాలి. వీలైనంతవరకూ స్పీకర్ ఫోన్ ద్వారా సంభాషించే ప్రయత్నం చేయాలి.



హెపటైటిస్

హెపటైటిస్ బి, హెపటైటిస్ సి వైరస్‌లు కాలేయాన్ని దీర్ఘకాలం పాటు ఇబ్బంది పెడతాయి. వీటికి అడ్డుకట్ట వేసే టీకాలు, నివారణ చర్యల గురించి వైద్యులు ఇలా వివరిస్తున్నారు.

వీటితో కాలేయానికి కీడు

ప్రధానంగా శరీర ద్రవాలు, రక్త మార్పిడిల ద్వారా హెపటైటిస్ బి, సి వైరస్‌లు సంక్రమిస్తాయి. ఇవి శరీరంలోకి ప్రవేశించిన తర్వాత, కాలేయంలోనే తిష్ట వేసుకుని, నెమ్మది నెమ్మదిగా కాలేయాన్ని దెబ్బ తీయడం మొదలుపెడతాయి. కొంత మందిలో ఈ వైరస్‌లు సమస్యను తీవ్రతరం చేసి, కామెర్లు, కాలేయ వైఫల్యానికి దారితీస్తాయి. అయితే హెపటైటిస్ ఇన్‌ఫెక్షన్లలో తీవ్రమైన లక్షణాలేవీ కనిపించవు. కాబట్టి ఈ వైరస్‌లు సోకకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. ఈ వైరస్‌లు సోకే కొన్ని ఇతరత్రా మార్గాలను మనందరం నిర్లక్ష్యం చేస్తూ ఉంటాం. అవేంటంటే..

హెపటైటిస్ సి వైరస్‌ను అడ్డుకునే సమర్థమైన మందులు, హెపటైటిస్ బిని నివారించే వ్యాక్సిన్స్ ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచన మేరకు హెపటైటిస్ బి వ్యాక్సిన్‌ను యూనివర్సల్ ఇమ్యునైజేషన్‌లో చేర్చడం జరిగింది. పుట్టిన ప్రతి బిడ్డకూ మిగతా టీకాలతో పాటు హెపటైటిస్ బి మూడు డోసుల టీకాను తప్పక ఇప్పించాలి. పెద్దలు కూడా హెపటైటిస్ బి వ్యాక్సిన్ తీసుకోవచ్చు. అయితే ముందుగా రక్త పరీక్ష చేయించి, వైరస్ లేదని నిర్ధారించుకున్న తర్వాత మాత్రమే ఈ టీకా తీసుకోవాలి.



దంత చికిత్సల ద్వారా...

రక్తం అన్నివేళలా, అన్నిచోట్లా కళ్లకు కనిపించకపోవచ్చు. సూక్ష్మదర్శినిలో మాత్రమే కనిపించే వీలుండే మోతాదుల్లోని రక్తం పూర్తిగా స్టెరిలైజ్ చేయని సిరంజీలు, పరికరాలకు అంటుకుని ఉండొచ్చు. సెలూన్లలో మ్యానిక్యూర్, పెడిక్యూర్, షేవింగ్ లాంటి సేవల ద్వారా వైరస్ కలిగిన రక్తం మన శరీరాల్లోకి చొరబడే వీలుంటుంది కాబట్టి పూర్తిగా స్టెరిలైజ్ చేసిన పనిముట్లనే ఆయా సేవల కోసం ఉపయోగించేలా చూసుకోవాలి. సింగిల్ యూజ్ షేవర్స్‌నే ఎంచుకోవాలి. పాతకాలపు పద్ధతిలో లోహపు బ్లేడ్స్ ఉపయోగాన్ని మానేయాలి. అలాగే దంత చికిత్సల విషయంలో కూడా జాగ్రత్త వహించాలి. ఆయా చికిత్సల్లో పూర్తిగా స్టెరిలైజ్ చేసిన పరికరాలే ఉపయోగించేలా చూసుకోవాలి.

టాటూల ద్వారా...

టాటూల ద్వారా హెపటైటిస్ వైరస్‌లు శరీరంలోకి చొరబడే ప్రమాదం ఉంది. ఈ ముప్పు నుంచి తప్పించుకోవడం కోసం, టాటూ వేయించుకునే స్టూడియోలో కఠినమైన పరిశుభ్రతా చర్యలు పాటిస్తున్నట్టు నిర్ధారించుకోవాలి. నియంత్రణ లేని అనేక చిన్న పాటి పార్లర్లు, స్టెరిలైజ్ చేయని నీడిల్స్, పరికరాలను, కలుషిత ఇంకులను టాటూల కోసం ఉపయోగిస్తూ ఉంటాయి. కాబట్టి టాటూ వేయించుకునే ముందు ఆ ప్రదేశంలో పాటించే సురక్షిత ప్రమాణాల గురించి తెలుసుకోవాలి. ఉపయోగిస్తున్న సింగిల్ యూజ్ నీడిల్స్, ఇంక్స్ గురించి ఆరా తీయాలి.

డాక్టర్ ఆర్.వి. రాఘవేంద్ర రావు
డైరెక్టర్ అండ్ సీనియర్ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్,
లివర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్,
రెనోవా - నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ అండ్ లివర్ డిసీజెస్,
న్యూ ఎమ్‌ఎల్‌ఎ కాలనీ, రోడ్ నంబరు 12,
బంజారాహిల్స్, హైదరాబాద్



సోరియాసిస్‌కు సమర్థమైన వైద్యం

హోమియో

తిరగబెడుతూ వేధించే చర్మ వ్యాధుల్లో సోరియాసిస్ ఒకటి. అయితే శరీర తత్వం, ప్రేరేపించే అంశాలు, మందుల ప్రభావాల ఆధారంగా చికిత్సను ఎంచుకోగలిగితే, ఈ మొండి సమస్యను కూడా పరిష్కరించుకోవచ్చు. ఎలాగో తెలుసుకుందాం!



సోరియాసిస్‌కు ఫలానా కారణమని కచ్చితంగా చెప్పడానికి వీల్లేదు. శరీరంలో రోగనిరోధక శక్తి తగ్గడం వల్ల, రక్షణ వ్యవస్థ శరీరం మీదే దాడి చేసే ఆటో ఇమ్యూన్ డిజార్డర్ ఫలితంగా సోరియాసిస్ తలెత్తవచ్చు. వంశపారంపర్యంగా సంక్రమించవచ్చు. అయితే ప్రధానంగా మానసిక ఆందోళన, ఒత్తిడితో కూడిన జీవితం, కొన్ని రకాల ఆహార పదార్థాల వల్ల సోరియాసిస్ తలెత్తవచ్చని కొన్ని తాజా అధ్యయనాల్లో తేలింది. కొన్ని సందర్భాల్లో చర్మ గాయాలు మానిన తర్వాత, ఆ ప్రదేశంలో సోరియాసిస్ తలెత్తుతూ ఉంటుంది. దీన్ని 'కోబ్నర్ ఫెనొమినా' అంటారు. అలాగే కొన్ని రకాల మందులు, స్టిరాయిడ్స్ కూడా సోరియాసిస్‌ను ప్రేరేపిస్తాయి.

ప్రధాన లక్షణాలు ఇవే!

- దురద
- చర్మంపై పగుళ్లు, పొట్టు ఏర్పడడం
- పొట్టులా ఏర్పడిన ప్రదేశం చుట్టూరా మంట
- గోకినప్పుడు పొట్టు రాలడం

రకాలున్నాయి

సోరియాసిస్‌లో ఐదు రకాలున్నాయి. అవేంటంటే...

ఫ్లేక్ సోరియాసిస్: 80% సోరియాసిస్‌లు ఈ కోవకు చెందినవే! ఈ సమస్య పెద్దల్లో ఎక్కువ.

గుట్టేట్ సోరియాసిస్: పిల్లలు, యుక్తవయస్కుల్లో తలెత్తుతుంది.

ఇన్వర్స్ సోరియాసిస్: స్థూలకాయుల్లో, చర్మపు ముడతల్లో వస్తుంది.

పస్ట్యులార్ సోరియాసిస్: అరుదుగా పెద్దల్లో వస్తుంది.

ఎరిత్రోడెర్మిక్ సోరియాసిస్: 90% చర్మం సోరియాసిస్‌కు గురైనప్పుడు ఎరిత్రోడెర్మిక్ సోరియాసిస్‌గా పరిగణించాలి.

శాశ్వత చికిత్స లేదు

సోరియాసిస్ చికిత్సతో అదుపులోకొచ్చి, పూర్తిగా నయమైపోయిన భ్రమను కలిగిస్తుంది. కొన్ని నెలలు, సంవత్సరాల పాటు కనుమరుగైపోయే ఈ సమస్య, అకస్మాత్తుగా తిరగబెడుతూ ఉంటుంది. కాబట్టి సోరియాసిస్‌కు శాశ్వత చికిత్స లేదనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. అయితే ఈ వ్యాధిని అదుపులో పెట్టగలిగే సమర్థమైన చికిత్సలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. లక్షణాలు, శరీరంలో సోరియాసిస్ తలెత్తిన ప్రదేశం, మందులకు స్పందించే శరీర తత్వం, సమస్యను ప్రేరేపించే కారకాల ఆధారంగా చికిత్సను ఎంచుకోగలిగితే, ఈ చర్మ సమస్యకు వీలైనంతవరకూ అడ్డుకట్ట వేయవచ్చు. మరీ ముఖ్యంగా హోమియోపతిలో సోరియాసిస్‌కు రెండు రకాల చికిత్సలను అనుసరిస్తారు. చర్మపు దురద ఏ ఏ సందర్భాల్లో తలెత్తుతోంది, ఎప్పుడు పెరుగుతోంది? అనే అంశాల ఆధారంగా అందించే చికిత్స ఒకటైతే, సోరియాసిస్ ప్యాచెస్‌తో పాటు శరీర ఉష్ణోగ్రత, ఆహారపుటలవాట్లు, శరీరం మీద వాతావరణ ప్రభావాలు, మానసిక లక్షణాల ఆధారంగా అందించే చికిత్స రెండవది.

నివారణ ఇలా...

పొట్ట, ఛాతీ, తల, గోళ్లు, వేళ్ల మధ్య, పిరుదుల మధ్య, తొడల మధ్య మొట్టమొదటిగా సోరియాసిస్ తలెత్తుతుంది. వీటిలో ఏ ఒక్క శరీర భాగంలో సోరియాసిస్ తలెత్తినా, తలలో కూడా తప్పనిసరిగా కనిపిస్తుంది. అయితే ఈ వ్యాధిని నివారించుకునే సమర్థమైన మార్గాలు కొన్ని ఉన్నాయి. మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలి. అలర్జీ కారక ఆహార పదార్థాలకు దూరంగా ఉండడం, సమతులాహారం తీసుకోవడం, శుద్ధి చేసిన పదార్థాలు, పాలు, పాల ఉత్పత్తులు, శీతల పానీయాలకు దూరంగా ఉండడం అవసరం. అలాగే తేలికగా అరిగే ఆహారం తీసుకుంటూ, కంటి నిండా నిద్రపోవాలి. క్రమం తప్పక వ్యాయామం చేయాలి. ఈ నియమాలు పాటించగలిగితే ఉన్న సోరియాసిస్ అదుపులో ఉండడంతో పాటు కొత్తగా సోరియాసిస్ తలెత్తకుండా ఉంటుంది.

డాక్టర్ దుర్గాప్రసాద్ రావు గన్నం రాజు
నిత్య హోమియోపతి,
కుత్బీగూడ (కాచిగూడ), హైదరాబాద్.



అధ్యయనం

నోటి బ్యాక్టీరియాతో గుండెపోటు

నోట్లో నివసించే బ్యాక్టీరియా దంతాలను దెబ్బతీయడమే కాకుండా గుండెపోటు ముప్పును కూడా పెంచుతుందని ఒక అధ్యయనంలో వెల్లడైంది. వివరాల్లోకి వెళ్తే...

ఫిన్‌ల్యాండ్‌లోని ట్యాంపిర్ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు, గుండెజబ్బులతో బాధపడే రోగులతో పాటు అకస్మాత్తుగా గుండెపోటుతో ప్రాణాలు కోల్పోయిన రోగుల గుండె రక్తనాళాల్లోని పూడికలను సేకరించి పరీక్షించినప్పుడు, 40% పూడికల్లో నోటి బ్యాక్టీరియాకు చెందిన జన్యు ఆనవాళ్లు కనిపించాయి. ఇవన్నీ స్ట్రెప్టోకాక్కై సమూహానికి చెందిన బ్యాక్టీరియాలనీ, వ్యాధినిరోధకశక్తిలోకి చొరబడలేని కొన్ని సూక్ష్మజీవులు గుండె రక్తనాళాల్లోని పూడికల్లో పేరుకుపోయి, పూడికలను చెదరగొట్టి గుండెపోట్లకు కారణమవుతూ ఉంటాయని పరిశోధకులు అంటున్నారు. నోటి పరిశుభ్రత, గుండె ఆరోగ్యానికీ మధ్య ఉన్న దీర్ఘకాలపు అనుబంధానికి సంబంధించిన ఆధారాలకు ఈ అధ్యయనం బలం చేకూరుస్తోంది. ఇతర ఇన్‌ఫెక్షన్లు, పోషకాహారలోపాలు, ఒత్తిడల వల్ల ప్రేరేపితమయ్యే నిద్రాణ స్థితిలోని బ్యాక్టీరియా కాలనీలు రక్తనాళల్లోని పూడికలను ఛిద్రం చేసి, రక్తప్రవాహానికి అడ్డుపడేలా దోహదపడుతూ ఉంటాయి. అయితే బ్యాక్టీరియా నోటి నుంచి గుండె రక్తనాళాల్లోకి ఎలా చేరుకోగలుగుతోందనే దానికి సంబంధించి మరింత పరిశోధన చేపట్టవలసిన అవసరం ఉంది. అయితే అప్పటివరకూ గుండె ఆరోగ్యాన్ని మెరుగ్గా ఉంచుకోవడం కోసం నోటి పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలనీ, రోజుకు రెండుసార్లు దంతాలను శుభ్రపరుచుకోవాలని పరిశోధకులు సూచిస్తున్నారు.



నాలుగేళ్ల ఆర్టీసీ ప్రయాణం సంతృప్తినిచ్చింది

» సమష్టి కృషితోనే వినూత్న కార్యక్రమాలు: వీసీ సజ్జనార్



ఆర్టీసీ బస్సులో టికెట్ తీసుకుంటున్న వీసీ సజ్జనార్

హైదరాబాద్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ)కు నాలుగేళ్ల సేవలు అందించడం సంతృప్తినిచ్చిందని, సమష్టికృషితో సంస్థలో వినూత్న కార్యక్రమాలు చేపట్టి విజయవంతం చేశామని మాజీ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ అన్నారు. సోమవారం సజ్జనార్‌కు ఆర్టీసీ సంస్థ అధికారులు, సిబ్బంది వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంతకాలం తనకు సహకరించిన అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. సజ్జనార్ వీడ్కోలు తీసుకున్న సందర్భంగా 'ఎక్స్'లో ఆసక్తికర పోస్ట్ చేశారు. 'నా స్టాప్ వచ్చేసింది. బస్సు దిగి, కొత్త మార్గంలో పయనించాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రయాణాలు ఆగుతాయి, ప్రయాణికులు ముందుకు కదులుతారు. కానీ రహదారి ఎళ్లప్పుడు ముందుకు సాగుతూనే ఉంటుంది' అని పేర్కొన్నారు. టీజీఎస్ఆర్టీసీ ఎండీగా తన చివరి రోజున వీసీ సజ్జనార్ ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. లక్డీకాపూల్‌లోని టెలిఫోన్ భవన్ బస్టాండ్ నుంచి బస్ భవన్ వరకు 113 రూట్ బస్సులో టికెట్ తీసుకుని ప్రయాణించారు.



నూతన ఎండీగా నాగిరెడ్డి బాధ్యతలు

వైనాగిరెడ్డి ఆర్టీసీ నూతన ఎండీగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూప్రజలకు మెరుగైన ప్రజా రవాణా అందించడమే కర్తవ్యమని తెలిపారు.

'సినిమా' దొంగలు దొరికారు!

(మొదటి పేజీ తరువాయి)

స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఈ కేసు వివరాలను వెల్లడించారు. బిహార్‌కు చెందిన అశ్వనికుమార్, అర్సలాన్ అహ్మద్, తమిళనాడుకు చెందిన సిరిల్ ఇన్ఫంట్‌రాజ్, సుధాకరణ్, ఏపీలోని అమలాపురానికి చెందిన కిరణ్‌కుమార్ ముఠాగా ఏర్పడ్డారు. వీరిలో కిరణ్‌కుమార్ తెలుగు సినిమాలను సెల్‌ఫోన్‌లో రికార్డు చేసి పంపేవాడని.. హిట్, సింగిల్, కుబేర, హరిహర వీరమల్లు వంటి సినిమాలను వీరు పైరసీ చేశారని సీపీ తెలిపారు. ఒక్క హైదరాబాద్‌లోనే 100 సినిమాల దాకా రికార్డ్ చేసినట్టు చెప్పారు. అత్తాపూర్‌లోని మంత్ర మాల్, సినీపోలీస్ థియేటర్లలో ఎక్కువగా పైరసీ చేసేవారని తెలిపారు. 2020 నుంచి వీరు దేశవ్యాప్తంగా వివిధ భాషలకు చెందిన సుమారు 500 చిత్రాలను పైరసీ చేసి, లక్ష డాలర్ల వరకు (రూ.90లక్షలు) సంపాదించారని పేర్కొన్నారు. వీరి వల్ల దేశంలోని వివిధ చిత్రపరిశ్రమలకు రూ.22,400 కోట్లు.. ఒక్క టాలీవుడ్‌కే 2024లో రూ.3,700 కోట్లు నష్టం వాటిల్లినట్లు తేలిందని వెల్లడించారు. ఈ ఐదుగురు నిందితులకూ సహకరించిన మరో ఐదుగురికి నోటీసులు జారీ చేశామన్నారు.

టీఎఫ్‌సీసీ ఫిర్యాదుతో..

ఈ ఏడాది మే-9న విడుదలైన 'సింగిల్' సినిమా పైరసీకి గురైందంటూ.. జూన్ 5న తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధి యర్ర యుసీంద్ర బాబు సిటీ సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించి ఈ ముఠా గుట్టు రట్టు చేశారు. ముఠా సభ్యులు తమ జేబులో, పాప్‌కార్న్ డబ్బాల్లో అత్యాధునిక సెల్‌ఫోన్లను పెట్టి సినిమాలను రికార్డ్ చేసినట్టు దర్యాప్తులో గుర్తించారు. సాధారణంగా వీడియో తీసేటప్పుడు సెల్‌ఫోన్ స్క్రీన్ ఆన్‌లో ఉంటుంది. అలా ఉండకుండా ప్రత్యేక యాప్ వాడేవారని పోలీసులు తెలిపారు. అలా రికార్డు చేసిన పైరసీ సినిమాల్లో బెట్టింగ్, గేమింగ్ యాప్‌ల వాణిజ్య ప్రకటనలు ఉంచి వెబ్‌సైట్లు, టెలిగ్రామ్ చానళ్లలో పెట్టేవారు. పోలీసులకు దొరక్కుండా ఉండేందుకు నెదర్లాండ్స్, ఫ్రాన్స్ దేశాల ఐపీ అడ్రస్‌లతో కూడిన సర్వర్లను ఇందుకు వాడేవారు. వాటిని సిరిల్ కొనుగోలు చేసినట్టు పోలీసులు గుర్తించారు. ఇక.. ముఠాలోని కీలకసభ్యుడు.. బిహార్‌కు చెందిన అశ్వనీకుమార్ హ్యాకింగ్ నిపుణుడు. అతడు నేరుగా స్టూడియోల్లోని సర్వర్లను హ్యాక్ చేసి హెచ్‌డీ కాపీలు డౌన్‌లోడ్ చేసేవాడు. అంతేకాదు.. అతడు పలు ప్రభుత్వ శాఖల వెబ్‌సైట్లను హ్యాక్ చేసి, ఉద్యోగుల వివరాలను చూసినట్లు తమ దర్యాప్తులో వెల్లడైందని సీపీ తెలిపారు. ఎలక్షన్ కమిషన్ వెబ్‌సైట్‌ను కూడా అతడు హ్యాక్ చేసినట్లు గుర్తించామన్నారు. పట్నాలోని అతడి ఇంటికి తమ టీమ్ వెళ్లినప్పుడు.. అతడి ఇంటిచుట్టూ 22 సీసీ కెమెరాలున్నాయని.. పోలీసులను చూడగానే అతడు తన మొబైల్‌లో డేటాను డిలీట్ చేశాడని.. హార్డ్‌డిస్క్‌లో డేటా మాత్రం డిలీట్ చేయలేకపోయాడని.. హిట్-3 సహా ఇటీవల విడుదలైన పలు తెలుగు చిత్రాలు అందులో దొరికాయని చెప్పారు. ఈ పైరేటెడ్ కాపీల్లో వాణిజ్య ప్రకటనలు ఇచ్చిన బెట్టింగ్, గేమింగ్ యాప్‌ల నిర్వాహకుల నుంచి ఈ ముఠా నెలకు రూ.9 లక్షలు చొప్పున క్రిప్టో కరెన్సీ రూపంలో తీసుకున్నట్టు తెలిపారు.



సీపీ సీవీ ఆనంద్ సమీక్షలో పాల్గొన్న చిరంజీవి, వెంకటేశ్, నాగార్జున, నాని, రామ్, నాగచైతన్య, సురేశ్‌బాబు తదితరులు

సినీ ప్రముఖుల కృతజ్ఞతలు..

అంతర్రాష్ట్ర పైరసీ ముఠాను పట్టుకున్న నేపథ్యంలో.. సీపీ సీవీ ఆనంద్ సోమవారం సినీ పెద్దలతో సమీక్ష నిర్వహించారు. పైరసీ ముఠా దందా గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి చిరంజీవి, వెంకటేశ్, నాగార్జున, నాని, రామ్, తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు, నిర్మాత సురేశ్ బాబు తదితరులు హాజరయ్యారు. చిత్రపరిశ్రమకు వేల కోట్ల రూపాయల నష్టం కలిగిస్తున్న పైరసీ ముఠాను పట్టుకున్న సైబర్ క్రైమ్ పోలీసులకు వారంతా కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీశైలానికి 6.21లక్షల క్యూసెక్కుల వరద

10 గేట్లు ఎత్తి 5.93 లక్షల క్యూసెక్కుల విడుదల

భద్రాచలం వద్ద 45 అడుగులకు చేరిన గోదావరి

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

కృష్ణ, గోదావరి నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. కృష్ణా బేసిన్‌లో ఎగువన ఆల్మట్టి ప్రాజెక్టుకు 1.07 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 1.10 లక్షల క్యూసెక్కులను, జూరాలకు 5.37 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 39 గేట్లను ఎత్తి 5.60 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల, తుంగభద్ర ప్రాజెక్టుల నుంచి సోమవారం శ్రీశైలం ప్రాజెక్టుకు 6.21 లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పది గేట్లను 23 ఫీట్ల మేర ఎత్తి 5,93లక్షల క్యూసెక్కులను సాగర్‌కు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు 5.91 లక్షల క్యూసెక్కుల వరద రాగా... వచ్చింది వచ్చినట్లే 26 గేట్ల ద్వారా దిగువకు వదులుతున్నారు. పులిచింతల ప్రాజెక్టుకు 5.92 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా... ఔట్‌ఫ్లో 5.69 లక్షల క్యూసెక్కులుగా ఉంది. మరోవైపు, గోదావరి ఉగ్రరూపం దాల్చింది. మేడిగడ్డ బ్యారేజీ వద్ద అత్యధికంగా 11.37లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. ఇక, భద్రాచలం వద్ద సోమవారం సాయంత్రానికి గోదావరి నీటిమట్టం 45.5 అడుగులకు చేరుకుంది. ప్రస్తుతం 10,32,816 క్యూసెక్కుల నీరు దిగువకు ప్రవహిస్తోంది. ఇప్పటికే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయగా.. నీటిమట్టం 48 అడుగులు దాటితే రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేయనున్నారు.

బన్నీ చిత్రానికి జపనీస్ కొరియోగ్రాఫర్



అల్లు అర్జున్, తమిళ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న చిత్రంపై రోజురోజుకీ అంచనాలు పెరుగుతున్నాయి. సన్ పిక్చర్స్ సంస్థ అత్యంత ప్రతిష్మాత్మకంగా భారీ వ్యయంతో నిర్మిస్తున్న ఈ సినిమాకు విదేశీ సాంకేతిక నిపుణులు పని చేస్తున్న సంగతి విదితమే. తాజాగా మరో విదేశీ సాంకేతిక నిపుణుడు హోంకుటో కొనిషి అల్లు అర్జున్ చిత్రానికి పని చేస్తున్నట్లు సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. బన్నీతో దిగిన ఫొటోను ఆయన షేర్ చేశారు. నెల రోజుల నుంచి ఈ టీమ్‌తో కలసి వర్క్ చేస్తున్నాననీ, టీమ్ ఎంతో కష్టపడుతోందని, భారీ స్థాయిలో చిత్రం రానున్నదని, ఇంతకు మించి మాట్లాడనని 'హోకో'గా సుపరిచితుడైన ఈ జపనీస్.. బ్రిటీష్ కొరియోగ్రాఫర్ తెలిపారు. సాయి అభ్యంకర్ ఈ సినిమాకు స్వరాలు అందిస్తున్నారు. అల్లు అర్జున్ ఇమేజ్‌కు తగ్గట్లుగా హై ఎనర్జిటిక్ సాంగ్స్ చిత్రం కోసం ప్లాన్ చేస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా ముంబై షెడ్యూల్ పూర్తయింది. తదుపరి షెడ్యూల్‌ను అబుదాబీలో చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

అదరగొట్టిన రాజా సాబ్



ప్రభాస్ అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న 'రాజా సాబ్' ట్రైలర్ వచ్చేసింది. వారి నిరీక్షణకు తెరదించుతూ అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్‌తో ట్రైలర్ అదరగొట్టింది. ప్రభాస్‌ను ఓ హిప్నాటిస్ట్ భారీ హవేలీలోకి తీసుకెళ్లడంతో ట్రైలర్ ప్రారంభమవుతుంది. అక్కడ అనూహ్య ఘటనలు చోటు చేసుకుంటాయి. 'అభీ దేఖ్ లీజియో...' అంటూ దుష్టశక్తిని ఎదుర్కొనేందుకు రాజా సాబ్‌గా హవేలీలోకి అడుగుపెడతాడు ప్రభాస్. రాజా సాబ్ లుక్‌లో ప్రభాస్ మేకోవర్, స్క్రీన్ ప్రెజెన్స్, బాడీ లాంగ్వేజ్ వన్స్ మోర్ అనేలా ఉంది. మొసలితో ప్రభాస్ ఫైట్, దుష్టశక్తులతో పోరాడే తీరు ఆకట్టుకుంటున్నాయి. వీటితో పాటు అందమైన కథానాయికలతో ప్రభాస్ ప్రేమ సన్నివేశాలు మరో ఆకర్షణగా నిలిచాయి. ఈ చిత్రాన్ని మారుతి దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ప్రభాస్ సరసన నిధి అగర్వాల్, మాళవిక మోహనన్ కథానాయికలుగా, బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ కీలక పాత్రలో నటిస్తున్నారు. సినిమా వచ్చే ఏడాది జనవరి 9న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కాబోతోంది.

గోదారి నేపథ్యంలో ప్రేమకథ



రక్షిత్ అట్లూరి, కోమలి ప్రసాద్ జంటగా నటించిన 'శశివదనే' చిత్రం అక్టోబర్ 10న విడుదల కానుంది. గౌరీ నాయుడు సమర్పణలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి సాయిమోహన్ ఉబ్బన దర్శకత్వం వహించారు. ఈ చిత్రం ట్రైలర్‌ను సోమవారం విడుదల చేశారు. ఇందులో 'లంకలోని సీత కోసం రాముడు సముద్రాలు దాటినట్లు నీ సైకిల్ పాప కోసం నువ్వు ఈ గోదారి దాటుతున్నావన్న మాట'.. అనే డైలాగ్ ఉంది. తన మనసుకి నచ్చిన యువతి కోసం హీరోగా గోదారి దాటి వెళ్లి అన్వేషిస్తాడన్న మాట. దానికి తగ్గట్లుగానే సన్నివేశాలు చూపించారు. చివరకు హీరోయిన్ కనిపించగానే హీరో భావోద్వేగాలను కూడా దర్శకుడు చక్కగా చిత్రీకరించారు. గోదావరి నేపథ్యంలో సాగే ఈ ప్రేమకథ ఇదని నిర్మాతలు అహితేజ బెల్లంకొండ, అభిలాష్‌రెడ్డి చెప్పారు. సినిమాలోని సన్నివేశాలు, పాటలు ఆకట్టుకుంటాయని తెలిపారు. సినిమా ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉందని చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: శరవణ వాసుదేవన్, నేపథ్య సంగీతం: అనుదీప్ దేవ్, ఫొటోగ్రఫీ: సాయికుమార్ ధారా, ఎడిటర్: గ్యారీ బీహెచ్.

'హై లెస్సో' ఆరంభం



బుల్లి తెర, వెండి తెర రెండింటిలోనూ తనదైన ముద్ర వేస్తున్న సుధీర్ ఆనంద్ కొత్త చిత్రం పూజా కార్యక్రమాలతో సోమవారం ప్రారంభమైంది. ప్రసన్న కుమార్ దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రాన్ని వజ్ర వారాహి సినిమాస్ బేనర్‌పై శివ చెర్రీ, రవికిరణ్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి 'హైలెస్సో' అనే పేరును హీరో నిఖిల్ లాంచ్ చేశారు. నిర్మాత బన్నీ వాసు స్క్రిప్ట్‌ను అందజేశారు. దర్శకులు వశిష్ట, చందూ మొండేటి, మెహర్ రమేశ్ కెమెరా స్విచ్చాన్ చేయగా, ముహూర్తపు షాట్‌కు వి.వి.వినాయక్ క్లాప్ కొట్టారు. చిత్ర దర్శకుడు ప్రసన్న కుమార్ యాక్షన్ చెప్పారు. ఈ సినిమాలో నటాషా సింగ్, నక్ష శరణ్ హీరోయిన్లుగా, ప్రతినాయకుడి పాత్రలో శివాజీ నటిస్తున్నారు. కన్నడ నటి అక్షర గౌడ కీలక పాత్రలో కనిపించనున్నారు. సినిమాను తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం తెలిపింది.

'కాంతారా 1'కు ఆటంకాలు కల్పించవద్దు

-పవన్‌కల్యాణ్

రిషబ్ శెట్టి హీరోగా నటించి, దర్శకత్వం వహించిన 'కాంతారా 1' చిత్రం టికెట్ ధరల పెంపునకు అనుమతి ఇస్తూ ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తెలుగు సినిమాలకు కర్నాటకలో ఆటంకాలు కల్పిస్తున్నారనీ, మన చిత్రాలకు టికెట్ ధరల పెంపు విషయంలో అక్కడి ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించడం లేదనీ, తెలుగు సినిమా పోస్టర్లు, బేనర్లు కొందరు తొలగిస్తున్నారనీ, ఇటువంటి తరుణంలో 'కాంతారా 1' చిత్రంతో పాటు ఇతర కన్నడ చిత్రాలకు టికెట్ ధరల పెంపుపై పునరాలోచన చేయాలని ప్రభుత్వం ముందుకు అభ్యంతరాలు వచ్చాయి. అయితే 'కళ అనేది మనసుల్ని కలపాలి.. విడదీయకూడదు. మన సినిమాకు వ్యాపారపరంగా ఎదురవుతున్న ఇబ్బందుల్ని రెండు భాషల ఫిల్మ్ ఛాంబర్స్ కూర్చుని మాట్లాడుకోవాలి. ప్రభుత్వపరంగా మనమూ మాట్లాడదాం. కర్నాటకలో ఎదురైన పరిణామాలను దృష్టిలో పెట్టుకుని 'కాంతారా 1'కు ఇక్కడ ఆటంకాలు కల్పించవద్దు' అని కోరారు పవన్‌కల్యాణ్.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

కథకు ప్రాధాన్యమున్న చిత్రం



- రష్మిక మందన్న

ఆయుష్మాన్ ఖురానా, రష్మిక మందన్న జంటగా ఆదిత్య సర్పోత్థార్ తెరకెక్కించిన సినిమా 'థామా'. మడాక్ ఫిల్మ్స్ సమర్పణలో దినేశ్ విజన్, అమర్ కౌశిక్ నిర్మించారు. ఈ నెల 21న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ నిర్వహించారు. రష్మిక మందన్న మాట్లాడుతూ 'కథకు చాలా ప్రాధాన్యమున్న చిత్రమిది. కచ్చితంగా ప్రేక్షకులను మైమరపిస్తుంది. ప్రతి సినిమాకి ఓ కొత్త క్యారెక్టర్ చేయాలని ప్రయత్నిస్తుంటాను. ఈ సినిమాలో కూడా కొత్త క్యారెక్టర్‌తో ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తాను' అని అన్నారు. ఆయుష్మాన్ ఖురానా మాట్లాడుతూ 'ఇది పూర్తిగా పాన్ ఇండియా చిత్రం. ఇందులో నేను చేసిన క్యారెక్టర్ కొత్తగా అనిపించింది. రష్మికతో కలసి నటించడం ఆనందంగా ఉంది' అని చెప్పారు.

దర్శకుడు గార సత్యం కన్నుమూత



పలు తెలుగు చిత్రాలకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా, కో-డైరెక్టర్‌గా పనిచేసిన గార సత్యం(91) సోమవారం ఉదయం అనారోగ్యంతో కన్నుమూశారు. దాదాపు వంద సినిమాలకు దర్శకత్వ శాఖలో పనిచేయడంతో పాటు ఓ సినిమాకు దర్శకత్వం వహించారు. సూపర్ స్టార్ కృష్ణ, విజయనిర్మల సినిమాలకు అత్యధికంగా పనిచేశారు. గార సత్యం భార్య నాలుగేళ్ల క్రితం మరణించారు. వీరికి పిల్లలు లేరు. పంజాగుట్ట స్మశానవాటికలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు.

'ఓజీ' టికెట్ ధరలు తగ్గించాలి

పెంచిన 'ఓజీ' సినిమా టికెట్ రేట్లను వెంటనే తగ్గించి అమ్మాలని ఎగ్జిబిటర్లను తెలంగాణ పోలీస్ శాఖ ఆదేశించింది. ఈ మేరకు హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ మెమో జారీ చేశారు.



తిలక్ వర్మ

అలా కీర్తిస్తుంటే గర్వంగా ఉంది

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఆసియా టీ20 కప్ ఫైనల్లో అజేయ అర్ధ శతకం (69)తో పాకిస్థాన్‌పై విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించిన హైదరాబాద్ బ్యాటర్ తిలక్ వర్మకు సొంతగడ్డపై ఘన స్వాగతం లభించింది. సోమవారం రాత్రి దుబాయ్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న తిలక్‌కు శాట్ ఛైర్మన్ కె.శివసేనా రెడ్డి, వీసీ-ఎండీ సోనీ బాలదేవి స్వాగతం పలికి, సత్కరించారు. ఎయిర్‌పోర్టు బయట తిలక్ సోదరుడు తరుణ్, కోచ్ సలాం బయాష్ అభిమానులతో కలిసి స్వాగతం పలికారు.

అలా అంటుంటే..: దేశమంతా తన ఇన్నింగ్స్‌ను ఆకాశానికెత్తేస్తుంటే ఎంతో గర్వంగా ఉన్నదని తిలక్‌వర్మ అన్నాడు. 'ఆపరేషన్ తిలక్' అంటూ తన ఆటను కీర్తిస్తుంటే చెప్పలేనంత ఆనందంగా ఉందన్నాడు. ఇక ఫైనల్లో సాధించిన హాఫ్ సెంచరీ (69) తన కెరీర్‌లో ప్రత్యేకంగా నిలిచిపోతుందని, జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేని ఇన్నింగ్స్ అని తిలక్ అన్నాడు. 'ఫైనల్లో తీవ్రమైన ఒత్తిడి ఉంది. నేను బ్యాటింగ్ చేసే ముందు గట్టిగా ఊపిరి తీసుకొని, ప్రశాంతంగా ఆడేందుకు ప్రయత్నించా. పాక్ పేసర్లు మంచి వేగంతో బౌలింగ్ వేస్తున్నారు. బంతి.. బంతికి వైవిధ్యం చూపిస్తూ పరీక్షించారు. అవన్నీ తట్టుకొని సాధించిన ఈ అర్ధ శతకం చిరకాలం గుర్తుంటుంది. బ్యాటింగ్ ఆర్డర్‌లో ఈ స్థానంలోనైనా ఆడేందుకు జట్టంతా ముందే సన్నద్ధమై ఉంది. మధ్యలో వికెట్ నెమ్మదించినపుడు కోచ్ గౌతం గంభీర్‌తో మాట్లాడా. ఆయన సలహాలు బాగా ఉపకరించాయి. ఒత్తిడిని అధిగమించి సంజు శాంసన్, శివం దూబే ఆడిన తీరు అద్భుతం' అని తిలక్ అన్నాడు.

విండీస్‌కు ఘోర పరాభవం

నేపాల్‌తో టీ20 సిరీస్‌లో ఓటమి

షార్జా: చిట్టి..పొట్టి జట్టు నేపాల్ చేతిలో వెస్టిండీస్‌కు తీరని అవమానం జరిగింది. మూడు టీ20ల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలుండగానే కరీబియన్లు కోల్పోయారు. సోమవారం జరిగిన రెండో టీ20లో 90 పరుగులతో వెస్టిండీస్ ఘోర పరాజయం పాలైంది. 174 పరుగుల లక్ష్య ఛేదనలో ఆ జట్టు 17.1 ఓవర్లలో 83 రన్స్‌కే కుప్పకూలింది. పేసర్ మహ్మద్ ఆదిల్ నాలుగు, స్పిన్నర్ కుశాల్ బుర్టెల్ 3 వికెట్లతో విండీస్ పతనాన్ని శాసించారు. అంతకుముందు నేపాల్ 20 ఓవర్లలో 173/6 స్కోరు చేసింది.


శంషాబాద్ ఎయిర్‌పోర్టులో తిలక్‌కు స్వాగతం పలుకుతున్న శాట్ ఛైర్మన్ శివసేనా రెడ్డి, ఎండీ సోనీబాల దేవి



అమ్మాయిలూ ఇక మీవంతు

నేటి నుంచే వన్డే వరల్డ్‌కప్

- 47 ఏళ్లుగా భారత్ నిరీక్షణ
- స్వదేశీ అనుకూలతలపై ఆశాభావం
- శ్రీలంకతో ఆరంభ పోరు

మధ్యాహ్నం 3 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

గువాహటి: ఆసియాకప్ విజయ సంబరాల్లో మునిగి తేలుతున్న భారత క్రీడాభిమానులను అలరించేందుకు మరో అంతర్జాతీయ టోర్నీ సిద్ధమైంది. నేటి నుంచి 13వ మహిళల వన్డే వరల్డ్‌కప్‌కు తెర లేవనుంది. ఈ మెగా టోర్నీకి 12 ఏళ్ల తర్వాత భారత్ ఆతిథ్యమిస్తుండడం విశేషం. మంగళవారం గువాహటిలో జరిగే ప్రారంభ మ్యాచ్‌లో శ్రీలంకతో హర్మన్‌ప్రీత్ బృందం తలపడనుంది. అయితే భారత మహిళల క్రికెట్ జట్టును మాత్రం ఈ విశ్వకప్ 47 ఏళ్లుగా ఊరిస్తూనే ఉంది. 1978లో మొదటి వరల్డ్‌కప్ జరిగింది. భారత జట్టు 2005, 2017 టోర్నీల్లో రన్నరప్‌తో సరిపెట్టుకుంది. 2022లో జరిగిన చివరి వరల్డ్‌కప్‌లో ఆస్ట్రేలియా విజేతగా నిలిచింది. ఓవరాల్‌గా ఇప్పటిదాకా జరిగిన టోర్నీల్లో ఆసీస్ (7), ఇంగ్లండ్ (4) జట్లదే ఆధిపత్యం. 2000లో మాత్రమే న్యూజిలాండ్ నెగ్గింది. ఈసారి కూడా ఆసీస్, ఇంగ్లండ్ జట్లు ఫేవరెట్స్‌గా బరిలోకి దిగబోతున్నాయి. మరోవైపు భారత్ ఆతిథ్యమిచ్చిన 1978, 1997, 2013 టోర్నీల్లో ఆస్ట్రేలియా జట్టే చాంపియన్‌గా నిలవడం విశేషం.

టోర్నీ జరిగేది ఇలా..

ఈ వరల్డ్‌కప్‌లో భారత్‌తో పాటు ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, బంగ్లాదేశ్, పాకిస్తాన్ జట్లు పాల్గొంటున్నాయి. రౌండ్ రాబిన్ పద్ధతిన జరిగే 8 లీగ్ మ్యాచ్‌లకు భారత్‌లో గువాహటి, ఇండోర్, విశాఖపట్టణం, నవీ ముంబై వేదికలు కానున్నాయి. అలాగే దాయాది పాక్ ఆడే మ్యాచ్‌లతోపాటు శ్రీలంక (కొలంబో)లో 11 లీగ్ మ్యాచ్‌లు జరుగనున్నాయి. అక్టోబరు 5న భారత్-పాక్ పోరుతో పాటు, ఒకవేళ ఫైనల్‌కు ఈ రెండు జట్లు వస్తే కొలంబోనే వేదికగా ఉంటుంది. గ్రూప్ దశలో టాప్-4లో నిలిచిన జట్లు సెమీఫైనల్స్‌లో ప్రవేశిస్తాయి.

ఇటీవల వన్డే, టీ20ల్లో ఇంగ్లండ్‌పై గెలిచిన భారత మహిళల జట్టు ఆత్మవిశ్వాసంతో టోర్నీలో అడుగుపెట్టబోతోంది. ముఖ్యంగా స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన భీకర ఫామ్‌లో ఉండడం జట్టుకు సానుకూలాంశం కానుంది. ఈ ఏడాది ఆడిన 14 వన్డేల్లో 928 పరుగులు సాధించింది. ఇక కెరీర్‌లో ఐదో వరల్డ్‌కప్ ఆడనున్న కెప్టెన్ హర్మన్‌ప్రీత్ ఇంగ్లండ్‌పై శతకం, ఆసీస్‌పై హాఫ్ సెంచరీతో జోరు మీదుంది. గాయం నుంచి కోలుకున్న జెమీమా సైతం

ఆత్మవిశ్వాసంతో హర్మన్ సేన

ఇంగ్లండ్‌తో వామప్ మ్యాచ్‌లో అర్ధ సెంచరీ సాధించింది. అలాగే హర్లీన్, రిచా, దీప్తిలతో బ్యాటింగ్ ఆర్డర్ పటిష్టంగా కనిపిస్తోంది. అయితే పేస్ విభాగం కాస్త బలహీనంగానే ఉంది. ఎందుకంటే రేణుకా సింగ్ మినహాయిస్తే క్రాంతి, అరుంధతి, అమన్‌జోత్ కలిపి 25 వన్డేలు మాత్రమే ఆడారు. దీనికితోడు వామప్ గేమ్‌లో అరుంధతి గాయంతో వీల్‌చైర్‌లో మైదానం వీడింది. తను ఎన్ని మ్యాచ్‌లు ఆడగలదో సందేహమే. అయితే స్వదేశీ పిచ్‌లపై తెలుగమ్మాయి శ్రీచరణి, దీప్తి, రాధా యాదవ్, స్నేహ్ రాణాల స్పిన్ ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బందిపెట్టే అవకాశం ఉంది. కానీ ఫ్లాట్ వికెట్ లభిస్తే వీరి ప్రభావం ఏమేరకు ఉండగలదో వేచిచూడాల్సిందే. ఏదిఏమైనా క్లిష్ట పరిస్థితుల్లో తడబాటు లేకుండా ముందుకుసాగితే భారత మహిళలు ఈసారి కప్ కొట్టడం కష్టం కాకపోవచ్చు. మరోవైపు టోర్నీ సహ ఆతిథ్య శ్రీలంక జట్టు చమరి ఆటపట్టు నేతృత్వంలో బరిలోకి దిగుతోంది. విశేషంగా రాణిస్తున్న 20 ఏళ్ల స్పిన్ ఆల్‌రౌండర్ దేవ్‌మి విహంగపై భారీ ఆశలే పెట్టుకుంది. సొంత గడ్డపైనే తమ ఐదు లీగ్ మ్యాచ్‌లను ఆడబోతుండడం వారికి అనుకూలించనుంది.

క్రిస్ వోక్స్ రిటైర్మెంట్

లండన్: ఇంగ్లండ్ పేసర్, 36 ఏళ్ల క్రిస్ వోక్స్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ పలుకుతున్నట్టు ప్రకటించాడు. నవంబరులో జరిగే యాషెస్ సిరీస్ కోసం ప్రకటించిన ఇంగ్లండ్ జట్టులో వోక్స్‌కు చోటు దక్కలేదు. అతడి రిటైర్మెంట్‌కు ఇదే కారణమని సమాచారం. 2011లో అరంగేట్రం చేసిన వోక్స్ బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా పేరు తెచ్చుకున్నాడు. 62 టెస్టుల్లో 2034 పరుగులు, 192 వికెట్లు.. 122 వన్డేల్లో 1524 రన్స్, 173 వికెట్లు.. 33 టీ20ల్లో 147 రన్స్, 31 వికెట్లు తీశాడు.

ముకేష్‌కు రజతం



జూ. వరల్డ్ కప్ షూటింగ్

గుంటూరు-క్రీడలు (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో జరుగుతున్న జూనియర్ వరల్డ్ కప్ షూటింగ్ పోటీలలో గుంటూరుకు చెందిన నేలవల్లి ముఖేష్ రజత పతకంతో మెరిశాడు. సోమవారం జరిగిన 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఫైనల్ ఏడవ రౌండ్‌లో ముఖేష్, అలెగ్జాండర్ కొవలేవ్ (తటస్థ అథ్లెట్)లిద్దరూ సమంగా నిలవడంతో షూటౌట్ నిర్వహించారు. ఈ షూటౌట్‌లో కోవలేవ్ స్వర్ణం గెలవగా, ముఖేష్‌కు రజతం దక్కింది. భారత్‌కే చెందిన సూరజ్‌శర్మకు కాంస్యం లభించింది.

రింకూకు స్వర్ణం

ప్రపంచ పారా అథ్లెటిక్స్

న్యూఢిల్లీ: వరల్డ్ పారా అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పురుషుల జావెలిన్ త్రో ఎఫ్46 ఈవెంట్‌లో రింకూ హుడా స్వర్ణం కైవసం చేసుకున్నాడు. భారత్‌కే చెందిన సుందర్ రజతం గెల్చుకున్నాడు. పురుషుల షాట్‌పుట్‌లో బరిలోకి దిగిన ఆంధ్రప్రదేశ్ అథ్లెట్ రొంగలి రవి (10.10 మీటర్లు) ఆరో స్థానంతో సరిపెట్టుకున్నాడు. ప్రస్తుతం భారత్ రెండు స్వర్ణాలు, రెండు రజతాలు, ఒక కాంస్యంతో మొత్తం ఐదు పతకాలతో పట్టికలో ఆరో స్థానంలో ఉంది.

నక్వీపై ఫిర్యాదు చేస్తాం: బీసీసీఐ



దుబాయ్: ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) ఛైర్మన్, పాకిస్తాన్ మంత్రి మొహిసిన్ నక్వీ ఆసియా కప్ ట్రోఫీని, ఇతర పతకాలను తన వెంట తీసుకొని వెళ్లడంపై ఐసీసీకి ఫిర్యాదు చేయాలని బీసీసీఐ నిర్ణయించింది. పాకిస్తాన్ మంత్రిగా భారత్‌పై యుద్ధం చేస్తున్న నక్వీ నుంచి టీమిండియా ట్రోఫీ అందుకోకపోవడం సమంజసమేనని బీసీసీఐ కార్యదర్శి దేవ్‌జీత్ సైకియా అన్నాడు. 'నక్వీ చిన్న పిల్లాడిలా ప్రవర్తించాడు. వచ్చేనెలలో దుబాయ్‌లో జరిగే ఐసీసీ సమావేశంలో అతనిపై ఫిర్యాదు చేస్తాం' అని సైకియా స్పష్టంజేశాడు. అంతేకాదు ట్రోఫీని, పతకాలను సాధ్యమైనంత త్వరగా తమకు పంపాలని దేవ్‌జీత్ డిమాండ్ చేశాడు. ఇక..ట్రోఫీ చేతిలో లేకున్నా..అది స్వీకరించాక ఎలా సెలబ్రేషన్స్ నిర్వహిస్తారో అలానే భారత జట్టు సంబరాలు జరుపుకొంది.


నక్వీతో సూర్య కరచాలనం

మ్యాచ్ ఫీజు పహల్గాం దాడి బాధితులకు: ఆసియా కప్ టోర్నమెంట్ ద్వారా తనకు లభించిన మ్యాచ్ ఫీజును దేశ సాయుధ బలగాలు, పహల్గాం ఉగ్ర దాడి బాధిత కుటుంబాలకు అందజేయనున్నట్టు సూర్య ప్రకటించాడు. ఒక్కో టీ20వ మ్యాచ్ కు భారత క్రికెటర్‌కు రూ. 4 లక్షలు లభిస్తాయి. ఈమేరకు టోర్నీ ద్వారా సూర్యకు రూ. 28 లక్షలు అందనున్నాయి.

బీసీసీఐ నజరానా రూ. 21 కోట్లు: ఆసియా కప్ విజేతగా నిలిచిన టీమిండియాకు, సిబ్బందికి బీసీసీఐ రూ. 21 కోట్ల నజరానా ప్రకటించింది. ఈ విషయాన్ని కార్యదర్శి సైకియా తెలిపారు.

ద్వంద్వ ప్రమాణాలు : ప్రతిపక్షాల దాడి

పీసీబీ చీఫ్ మొహిసిన్ నక్వీతో సూర్యకుమార్ కరచాలనం చేస్తున్న వీడియోను పోస్ట్ చేసిన శివసేన యూబీటీ ఎంపీ సంజయ్ రౌత్ భారత జట్టు ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోందని ధ్వజమెత్తారు.

సూర్య నాకు షేక్‌హ్యాండిచ్చాడు : ఆఘా

ఆసియా కప్ ఆరంభానికి ముందు తనతో రెండుసార్లు కరచాలనం చేసిన సూర్యకుమార్ యాదవ్ ఆత్మవంచన చేసుకుంటున్నాడని పాక్ కెప్టెన్ సల్మాన్ ఆఘా విమర్శించాడు.

బిజినెస్

ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్‌గా శిరీష్ చంద్ర ముర్ము



న్యూఢిల్లీ: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) డిప్యూటీ గవర్నర్‌గా శిరీష్ చంద్ర ముర్ము నియమితులయ్యారు. అక్టోబరు 8వ తేదీ పదవీ విరమణ చేస్తున్న ఎం.రాజేశ్వరరావు స్థానంలో ముర్మును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మూడు సంవత్సరాల కాలానికి డిప్యూటీ గవర్నర్‌గా ఆయన నియామకానికి నియామక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదముద్ర వేసింది. ఆయన ప్రస్తుతం ఆర్‌బీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సూపర్‌విజన్‌ను పర్యవేక్షిస్తున్నారు. ఆర్‌బీఐ చట్టం 1934 కింద ఆర్‌బీఐలో నలుగురు డిప్యూటీ గవర్నర్లుంటారు. వారిలో ఇద్దరిని అంతర్గతంగా ఆర్‌బీఐ నుంచి ఎంపిక చేస్తారు. ఒకరిని వాణిజ్య బ్యాంకింగ్ రంగం నుంచి ఎంపిక చేసి మరొక డిప్యూటీ గవర్నర్‌గా ఆర్థికవేత్తను నియమిస్తారు. ప్రస్తుతం టీ.రబిశంకర్, స్వామినాథన్.జే, పూనమ్ గుప్తా ఇతర డిప్యూటీ గవర్నర్లుగా ఉన్నారు. సూపర్‌విజన్ శాఖలో ఆయనకు గల విస్తృత అనుభవం ప్రస్తుత అంతర్జాతీయ అస్థిరతలు, దేశీయ సంస్కరణల నేపథ్యంలో దేశానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అధికారులంటున్నారు.

ఎంపీసీ సమావేశం షురూ: రాబోయే రెండు నెలల కాలానికి అనుసరించాల్సిన ద్రవ్యపరపతి విధానాన్ని నిర్ణయించేందుకు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నాయకత్వంలో ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశం సోమవారం ప్రారంభమయింది. ఈ సమావేశంలో దేశంలో ప్రస్తుత ఆర్థిక స్థితిగతులు, ద్రవ్యోల్బణ కదలికలు, అంతర్గత/విదేశీ ఒత్తిడులపై సమీక్షించి ద్రవ్య విధానాన్ని రూపొందిస్తారు. 3 రోజుల సమావేశం అనంతరం బుధవారం మల్హోత్రా ఎంపీసీ నిర్ణయాలను ప్రకటిస్తారు.

ఆగస్టులో పారిశ్రామికం జోరు

న్యూఢిల్లీ : గత ఏడాది ఆగస్టుతో పోలిస్తే ఈ ఏడాది ఆగస్టులో పారిశ్రామికోత్పత్తి సూచి (ఐఐపీ) నాలుగు శాతం పెరిగింది. గనుల రంగం ఆరు శాతం పెరగడం ఇందుకు బాగా కలిసొచ్చింది. అయితే జూలైలో నమోదైన 4.3% ఐఐపీతో పోలిస్తే ఇది 0.3 శాతం తక్కువ. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) సోమవారం ఈ వివరాలు విడుదల చేసింది. ఐఐపీలో నాలుగింట మూడు వంతుల వాటా ఉన్న తయారీ రంగం గత నెల 3.8 % వృద్ధి రేటు నమోదు చేసింది. గత ఏడాది ఆగస్టులో ఇది 1.2 శాతం మాత్రమే.

వెండి కిలో లక్షన్నర



రూ.1.20 లక్షల చేరువలో పసిడి

- వెండి ధర ఒకే రోజు రూ.7,000 పెరుగుదల
- వారంలో రూ.19,050 అప్

న్యూఢిల్లీ: బులియన్ మార్కెట్ ర్యాలీకి ఇప్పట్లో బ్రేక్ పడే సూచనలు కనిపించడం లేదు. సోమవారం దేశీయ మార్కెట్లో బంగారం, వెండి ధరలు మరో జీవిత కాల గరిష్ఠ స్థాయిని తాకాయి. ఢిల్లీ స్పాట్ మార్కెట్‌లో 10 గ్రాముల మేలిమి (24 కేరట్స్) బంగారం ధర రూ.1,500 పెరిగి రూ.1,19,500కు చేరింది. కిలో వెండి ధర ఒకే రోజు రూ.7,000 పెరిగి రూ.1.5 లక్షలను తాకింది. దీంతో గత వారం రోజుల్లోనే కిలో వెండి ధర రూ.19,051 పెరిగినట్టయింది.

బంపర్ లాభాలు

ఈ ఏడాది ఇప్పటి వరకు చూస్తే దేశీయ మార్కెట్‌లో బంగారం, వెండి మదుపరులకు బంపర్ లాభాలు పంచాయి. గత ఏడాది డిసెంబరు 31న రూ.78,950 పలికిన 10 గ్రాముల మేలిమి బంగారం ఇప్పటి వరకు రూ.40,550 (51.36%) పెరిగి రూ.1,19,500కు చేరింది. ఇదే సమయంలో కిలో వెండి ధర రూ.89,700 నుంచి రూ.60,300 (67.22%) పెరిగి రూ.1.5 లక్షల రికార్డు స్థాయికి చేరింది. సెన్సెక్స్, నిఫ్టీలు ఇదే కాలంలో ఎలాంటి ఎదుగూ బొదుగూ లేకుండా మదుపరులను నిరాశ పరిచాయి.

తెలుగు రాష్ట్రాల్లో

రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ పసిడి, వెండి ధరలు రికార్డు స్థాయికి చేరాయి. 10 గ్రాముల మేలిమి బంగారం సోమవారం హైదరాబాద్‌లో రూ.1,16,400 వద్ద, కిలో వెండి రూ.1.59 లక్షల వద్ద ట్రేడయ్యాయి. గత వారం 10 గ్రాముల మేలిమి బంగారం ధర తెలుగు రాష్ట్రాల్లోనూ (ప్రొద్దుటూరు) రికార్డు స్థాయిలో రూ.1.19 లక్షలకు చేరింది. విశాఖలో కిలో వెండి ధర గత వారం రికార్డు స్థాయిలో రూ.1.59 లక్షలు నమోదు చేసింది.

అంతర్జాతీయ మార్కెట్

అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు సరికొత్త రికార్డు స్థాయికి చేరాయి. డిసెంబరులో డెలివరీ ఇచ్చే బంగారం ఔన్స్ (31.10 గ్రాములు) ధర సోమవారం రెండు శాతానికి పైగా పెరిగి 3,860.45 డాలర్లను తాకింది. ఔన్స్ వెండి ధర 2 శాతం పైగా పెరిగి 47.39 డాలర్లను తాకింది.

ఫ్యూచర్స్ మార్కెట్

ఫ్యూచర్స్ మార్కెట్‌లోనూ సోమవారం బంగారం, వెండి ధరలు రికార్డు స్థాయికి చేరాయి. అక్టోబరులో డెలివరీ ఇచ్చే 10 గ్రాముల పసిడి ధర మల్టీ కమోడిటీస్ ఎక్స్ఛేంజిలో రూ.1,204 (1.06%) లాభంతో రూ.1,14,992కి, డిసెంబరు కాంట్రాక్టు ధర రూ.1,034 (0.9%) లాభంతో రూ.1,15,925కు చేరాయి. గత వారం రోజుల్లోనే ఫ్యూచర్స్ మార్కెట్‌లో పసిడి ధర రూ.4,188 (3.77%) పెరిగింది. డిసెంబరులో డెలివరీ ఇచ్చే కిలో వెండి ధర సోమవారం ఎంసీఎక్స్‌లో రూ.2,290 (1.61%) లాభంతో రూ.1,44,179కు చేరి రికార్డు సృష్టించింది. వచ్చే ఏడాది మార్చిలో డెలివరీ ఇచ్చే కిలో వెండి ధర ఎంసీఎక్స్‌లో రూ.2,559 లాభంతో రూ.1,45,817ను తాకింది.

మరింత ముందుకే!

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ప్రధాన ఆర్థిక పరిస్థితుల్లో ఎలాంటి మార్పులు కనిపించడం లేదు. దీంతో బంగారం, వెండి ధరలు రికార్డుల మీద రికార్డులు నమోదు చేస్తున్నాయి. ప్రస్తుతం 3,860.45 డాలర్లను బ్రేక్ చేసిన ఔన్స్ పసిడి ధర త్వరలోనే 4,000 డాలర్లకు చేరే అవకాశం ఉందని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థ ప్రెషియస్ మెటల్స్ సీనియర్ అనలిస్ట్ మానవ్ మోదీ అంచనా. అదే జరిగితే దేశీయ మార్కెట్ 10 గ్రాముల పసిడి ధర రూ.1.25 లక్షలకు, కిలో వెండి ధర రూ.1.75 లక్షలకు చేరే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా. అయితే ఈ వారాంతంలో బులియన్ మార్కెట్‌లో కొద్దిపాటి ప్రాఫిట్ బుకింగ్ అమ్మకాలు జరిగే అవకాశం కూడా ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

అక్టోబరు 6న టాటా క్యాపిటల్ ఐపీఓ

ఇష్యూ ధర రూ.310-326

ముంబై: టా టా సన్స్ అనుబంధ ఎన్‌బీఎఫ్‌సీ టాటా క్యాపిటల్ అక్టోబరు 6వ తేదీన తొలి పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) జారీ చేయనున్న ట్టు ప్రకటించింది. రూ.15,512 కోట్ల సమీకరణ లక్ష్యం గా రంగంలోకి దిగుతున్న ఈ సంస్థ షేరు ధర శ్రేణిని రూ.310-326గా ప్రకటించింది. గరిష్ఠ ధరలో కంపెనీ విలువ రూ.1.38 లక్షల కోట్లవుతుంది. అక్టోబరు 8వ తేదీన ఇష్యూ ముగుస్తుంది. మొత్తం 47.58 కోట్ల షేర్లను విడుదల చేస్తుండగా అందులో 21 కోట్ల తాజా షేర్లున్నాయి. 26.58 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) విధానంలో విక్రయిస్తారు.

ఆర్థిక రంగంలో అతి పెద్ద ఇష్యూ: ఈ ఏడాది లో ఇదే అతి పెద్ద ఇష్యూ అవుతుంది. దేశీయ ఆర్థిక రంగంలో అయితే ఇప్పటివరకు ఇదే అతి పెద్ద ఇష్యూ. ఇటీవల సంవత్సరాల్లో టాటా గ్రూప్ నుంచి విడుదలవుతున్న రెండో ఇష్యూ ఇది. ఎన్‌బీఎఫ్‌సీగా గుర్తించిన 3 సంవత్సరాల్లోగా ఐపీఓ జారీ చేయాలన్న నిబంధనకు అనుగుణంగా ఈ ఇష్యూ జారీ చేస్తున్నారు.

రెండేళ్ల కనిష్ఠానికి టాటా మార్కెట్ క్యాప్

స్టాక్ మార్కెట్ ఆటుపోట్లు టాటా గ్రూప్‌లోని 16 కంపెనీల షేర్ల ధరలను గుంజేస్తున్నాయి. గత ఏడాది కాలంలో ఈ కంపెనీల షేర్ల మార్కెట్ విలువ (మార్కెట్ క్యాప్) 7,500 కోట్ల డాలర్ల (సుమారు రూ.6.65 లక్షల కోట్లు) మేర క్షీణించింది. గత అక్టోబరులో దాదాపు 40,000 కోట్ల డాలర్ల వరకు ఉన్న ఈ కంపె నీల మార్కెట్‌విలువ ప్రస్తుతం 32,500 కోట్ల డాలర్లకు (సుమారు రూ.28.84 లక్షల కోట్లు) పడిపోయింది. టాటా గ్రూప్ లిస్టెడ్ కంపెనీల షేర్ల మార్కెట్ విలువ గత రెండేళ్లలో ఇంత కనిష్ఠ స్థాయికి పడిపోవడం ఇదే మొదటిసారి. హెచ్-1బీ వీసాల ఫీజును లక్ష డాలర్లకు పెంచుతున్నట్టు అమెరికా అధ్యక్షుడు ఈ నెల 19న ప్రకటించారు. అప్పటి నుంచి చూసినా ఈ కంపెనీల షేర్ల మార్కెట్ క్యాప్ 2,000 కోట్ల డాలర్లు పతనమయింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

30వ తేదీ			
హైదరాబాద్	500	విజయవాడ	530
వరంగల్	502	గోదావరి	530
చిత్తూరు	543	విశాఖపట్నం	520
		డజను గుడ్లు రూ. 72	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,16,400 ▲	1,06,700 ▲	1,59,000 ▲
విజయవాడ	1,20,000 ▲	1,14,000 ▲	1,49,000 ▲
విశాఖపట్నం	1,18,950 ▲	1,06,700 ▲	1,60,000 ▲
రాజమండ్రి	1,16,400 ▲	1,06,700 ▲	1,47,000 ▼
ప్రొద్దుటూరు	1,20,300 ▲	1,10,680 ▲	1,49,000 ▲
ముంబై	1,15,454 ▲	1,05,760 ▲	1,44,100 ▲

ఆర్‌బీఐ పాలసీపై అప్రమత్తం

ఏడో రోజూ నష్టాల్లో మార్కెట్

ముంబై: ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశం నేపథ్యంలో మార్కెట్లో అప్రమత్త వాతావరణం నెలకొంది, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలు, విదేశీ నిధుల తరలింపు వరుసగా ఏడో రోజు కూడా మార్కెట్‌ను నష్టాల్లోకి నెట్టాయి. సోమవారం ప్రారంభం నుంచి చివరి వరకు సూచీలు భారీ ఊగిసలాట ధోరణిలో ట్రేడయ్యాయి. సెన్సెక్స్ 61.52 పాయింట్ల నష్టంతో 80,364.94 వద్ద ముగియగా నిఫ్టీ 19.80 పాయింట్ల నష్టంతో 24,634.90 వద్ద క్లోజయింది. ఏడు వరుస సెషన్లలో సెన్సెక్స్ 2,649.02 పాయింట్లు, నిఫ్టీ 788.7 పాయింట్లు నష్టపోయాయి. అమెరికన్ డాలర్ మారకంలో రూపాయి 3 పైసలు నష్టపోయి 88.75 వద్ద ముగిసింది. విదేశీ ఇన్వెస్టర్లు శుక్రవారం రూ.5,687.58 కోట్ల విలువ గల ఈక్విటీలు విక్రయించారు.

జొమాటోలో 'హెల్దీ మోడ్' ఫీచర్

న్యూఢిల్లీ: ప్రముఖ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటో.. వినియోగదారులు ఆరోగ్యకరమైన ఆహారాన్ని గుర్తించి సులభంగా ఆర్డర్ చేసుకునేందుకు వీలుగా తన యాప్‌లో కొత్త 'హెల్దీ మోడ్' ఫీచర్‌ను ప్రవేశపెట్టింది. ఇందుకోసం రెస్టారెంట్ భాగస్వాముల సహకారంతో.. ఏఐ, లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ (ఎల్ఎల్ఎమ్) వంటి సాంకేతికతలను ఉపయోగించి వంటకాలకు సంబంధించిన మాక్రో న్యూట్రియెంట్ ప్రొఫైల్స్‌ను రూపొందించినట్లు తెలిపింది. ప్రతి వంటకానికి పోషక విలువలు ఆధారంగా 'తక్కువ' నుంచి 'సూపర్' వరకు 'హెల్దీ స్కోర్'ను కేటాయించింది. కాగా ప్రస్తుతం ఈ కొత్త ఫీచర్ గురుగ్రామ్‌లోని కస్టమర్లకు అందుబాటులో ఉండగా, త్వరలో దేశవ్యాప్తంగా దీనిని విస్తరించనున్నట్లు జొమాటో తెలిపింది.

'సంగం' టర్నోవర్ లక్ష్యం రూ.2,300 కోట్లు


త్వరలో వరంగల్‌లో ఉత్పత్తుల విక్రయం: ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్ (ఆంధ్రజ్యోతి): సంగం డెయిరీ 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.2,019 కోట్ల టర్నోవర్ నమోదు చేసింది. వచ్చే ఏడాది రూ.2,300 కోట్ల టర్నోవర్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ వెల్లడించారు. వడ్లమూడిలో సోమవారం వార్షిక సర్వసభ్య సమావేశంలో (ఏజీఎం) మాట్లాడుతూ ప్రస్తుతం సంగం డెయిరీ రోజుకు 8.20 లక్షల లీటర్ల పాలు సేకరిస్తున్నట్టు చెప్పారు. త్వరలోనే ఇన్నోవేషన్ సెంటర్‌ను ప్రారంభించి దాని ద్వారా మరిన్ని నూతన ఉత్పత్తులను మార్కెట్లో ప్రవేశపెడతామన్నారు. గత ఐదేళ్లుగా తిరుమల శ్రీవారి ప్రసాదాల తయారీకి అవసరమైన నెయ్యిని కూడా సరఫరా చేస్తున్నట్టు ఛైర్మన్ తెలిపారు. త్వరలో సంగం ఉత్పత్తులను తెలంగాణలోని వరంగల్ జిల్లాలోనూ విక్రయిస్తామన్నారు. నాయుడుపేట సెజ్‌లో కేటాయించిన భూమిలో త్వరలోనే కొత్త ప్లాంటు నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్టు చెప్పారు.

ఫామ్‌గేట్ ధర		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	105	విజయవాడ	117
వరంగల్	105	గుంటూరు	120
కరీంనగర్	105	ఒంగోలు	120
మహబూబ్‌నగర్	105	చిత్తూరు	100
కర్నూలు	105	నెల్లూరు	105
విశాఖపట్నం	122	అనంతపురం	105
గోదావరి	117		

స్థానిక సమరంలో కొత్త చరిత్ర సృష్టిస్తాం

- కరీంనగర్, సిరిసిల్ల జడ్పీ పీఠాలను గెలుచుకుంటాం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ధీమా



హైదరాబాద్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి బీజేపీ సిద్ధంగా ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చెప్పారు. పార్టీని నమ్ముకున్న కార్యకర్తలను గెలిపించడం కోసం ఢిల్లీ ఎన్నికల్లోనే కాదు, గల్లీ ఎన్నికల్లోనూ కొట్లాడేందుకు సిద్ధమని ప్రకటించారు. స్థానిక సమరంలో ఈసారి బీజేపీ కొత్త చరిత్రను లిఖించబోతోందని, కరీంనగర్, సిరిసిల్ల జిల్లా పరిషత్ పీఠాలపై కాషాయ జెండా ఎగరేస్తామన్నారు. ఆసియా కప్‌లో ఇండియా ఘన విజయం సాధించినట్లుగానే కరీంనగర్ పల్లె లీగ్(కేపీఎల్ లీగ్), సిరిసిల్ల పల్లె లీగ్(ఎస్పీఎల్) స్థానిక పోటీల్లోనూ బీజేపీ అభ్యర్థుల గెలుపు తథ్యమని చెప్పారు. పార్టీని నమ్ముకుని పనిచేస్తున్న నిఖార్సైన బీజేపీ కార్యకర్తలకే ఈసారి ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో టిక్కెట్లు ఇస్తామని బండి సంజయ్ ప్రకటించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల పాలనా వైఫల్యాలవల్ల స్థానిక సంస్థలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయని బండి సంజయ్ ఆరోపించారు. స్థానిక సంస్థల పాలక మండళ్ల గడువు ముగిసి రెండేళ్లు కావొస్తున్నా ఎన్నికలను నిర్వహించకపోవడంవల్ల రాజ్యాంగం ప్రకారం కేంద్రం నుంచి వచ్చే నిధులు కూడా ఆగిపోయాయని చెప్పారు. దీనికి ప్రస్తుత కాంగ్రెస్ పాలకులే కారణమన్నారు.

బాకీ కార్డుతో రేవంత్ భరతం పడతాం: కేటీఆర్



హైదరాబాద్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ మోసాలను ఎండగట్టేందుకు బీఆర్ఎస్ ప్రారంభించిన బాకీ కార్డు ఉద్యమంతో రేవంత్‌రెడ్డి సర్కారు భరతం పడతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అభయహస్తం పేరిట కాంగ్రెస్ ఇచ్చిన మోసపూరిత హామీలు ఆ పార్టీ పాలిట భస్మాసుర హస్తంగా మారనున్నాయని వ్యాఖ్యానించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో టీడీపీ సీనియర్ నేత ప్రదీప్ చౌదరి బీఆర్ఎస్‌లో చేరారు. గులాబీ కండువా కప్పి ఆయన్ను పార్టీలోకి ఆహ్వానించిన అనంతరం కేటీఆర్ మాట్లాడారు. తామిచ్చిన హామీలను ప్రజలు మరచిపోయారన్న భ్రమలో కాంగ్రెస్ నేతలు ఉన్నారని, వారి అబద్ధపు హామీలను అందరికీ గుర్తు చేసేందుకే బాకీ కార్డు ఉద్యమాన్ని చేపట్టామన్నారు. ఎన్నికలు ఏవైనా విజయం బీఆర్ఎస్ పార్టీదేనని ధీమా వ్యక్తం చేశారు. ఉన్న నగరాన్ని ఉద్ధరించలేని వారు కొత్త నగరం కడతామని ఫోజులు కొట్టడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. ప్రభుత్వ అసమర్థతతో హైదరాబాద్‌లో చెత్త తీసేవారు కరవయ్యారని, డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయని, వీధిదీపాలు వెలగడంలేదని మండిపడ్డారు. కాగా, సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకొని రాష్ట్ర ప్రజలకు కేటీఆర్ ఎక్స్‌వేదికగా శుభాకాంక్షలు తెలిపారు.

కేటీఆర్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు మానుకో: మల్లు రవి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కేటీఆర్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు మానుకోవాలని కాంగ్రెస్ ఎంపీల తెలంగాణ ఫోరం కన్వీనర్ మల్లు రవి హితబోధ చేశారు. ముఖ్యమంత్రి అనే కనీస గౌరవం లేకుండా రేవంత్‌రెడ్డిని చిల్లర భాషతో నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారన్నారు. తనపై దాడి జరగాలనే ఉద్దేశంతోనే కేటీఆర్ ఇలా వ్యవహరిస్తున్నారని, తద్వారా సానుభూతి సంపాదించుకోవాలనే నీచ రాజకీయాలకు తెరలేపారని మండిపడ్డారు. పదేళ్లు నిరుద్యోగ యువత ఉసురు పోసుకుని, ఇప్పుడేమో నియామక పత్రాలు ఇస్తుంటే సహించలేక అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తుంటే, తట్టుకోలేక ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని మల్లు రవి మండిపడ్డారు.

చంచల్‌గూడలో విచారణ ఖైదీలను హింసించారు

- ఏడుగురిని తీవ్రంగా కొట్టారు: పౌరహక్కుల సంఘం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): చంచల్‌గూడ కారాగారంలో విచారణ ఖైదీలుగా ఉన్న ఏడుగురిని జైలు అధికారులు తీవ్రంగా కొట్టారంటూ పౌర హక్కుల సంఘం కన్వీనర్ గుంటి రవి ఆరోపించారు. మావోయిస్టులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ ఖైదీలను శనివారం డిప్యూటీ జైలర్ లక్ష్మణ్ బాబు, జవాన్ సందీప్‌లు కొట్టారని, అనంతరం వారిని వేర్వేరు సెల్‌లలో నిర్బంధించారని పేర్కొన్నారు. అధికారుల హింసాకాండను నిరసిస్తూ ఖైదీలు నిరాహార దీక్ష చేపట్టినట్లు సోమవారం రవి ఓ ప్రకటనలో తెలిపారు. ఏడుగురు ఖైదీలు గిరిజనులు కాగా, వారిలో కొందరు మైనర్లు కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై జిల్లా న్యాయమూర్తితో స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు.

రిజర్వేషన్ల పెంపును ఆమోదించేలా గవర్నర్‌ను ఒప్పించండి

- రాంచందర్‌రావును కోరిన బీసీ నేతలు

హైదరాబాద్, సెప్టెంబర్29(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లను 42 శాతం పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనను ఆమోదించేలా గవర్నర్‌ను ఒప్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ బీజేపీని కోరారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మరికొందరు నాయకులతో కలిసి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుతో భేటీ అయ్యారు. బీసీ రిజర్వేషన్ల పెంపును ఆమోదించేలా రాష్ట్ర గవర్నర్‌ను కలిసి ఒత్తిడి తీసుకురావాలంటూ ఆయనకు వినతి పత్రాన్ని అందజేశారు. అసెంబ్లీలో ప్రతిపాదించిన బిల్లుకు బీజేపీ మద్దతు ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. గవర్నర్ ఆమోదం లేకుండా జీవో నెంబర్ 9ని ఎలా జారీ చేశారని హైకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించిందని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో గవర్నర్‌ను కలిసి నచ్చజెప్పాలని కోరారు.

24 మంది 'అక్రమ విదేశీయులు' డిపోర్ట్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో అక్రమంగా నివాసం ఉంటున్న పలువురు విదేశీయులను సైబరాబాద్ పోలీసులు సాగనంపారు. ఇటీవల ఓ ఫాంహౌస్‌లో డీజే మోతతో పుట్టిన రోజు వేడుకలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో రాజేంద్రనగర్ జోన్ పోలీసులు దాడులు చేశారు. ఈ క్రమంలో అక్కడ విదేశీయులైన 14 మంది పురుషులు, 37 మంది మహిళలను గుర్తించారు. వారిలో 36 మంది నగరంలో అక్రమంగా ఉంటున్నట్లు విచారణలో తేలింది. అందులో ఏడుగురు పురుషులు, 29 మంది మహిళలు ఉన్నారు. వారంతా ఉగాండా, నైజీరియా, లైబీరియా, బోట్స్వానా, కెన్యా, కామెరూన్, మొజాంబిక్, జింబాబ్వే, ఘనా, మలావి దేశాలకు చెందిన వారని తెలిసింది. ఈ 36 మందిలో 21 మంది వద్ద సరైన పాస్‌పోర్టులు ఉండటంతో వారిని స్వదేశాలకు పంపించారు. ఢిల్లీలోని సంబంధిత విదేశీ రాయబార కార్యాలయాల నుంచి మరో ముగ్గురికి వన్ టైమ్ ట్రావెల్ డాక్యుమెంట్లు ఇప్పించి సాగనంపారు. 12 మంది వద్ద ఎటువంటి పత్రాలు లేవు. దీంతో వారిని పంపించేందుకు సంబంధిత దేశాల రాయబార కార్యాలయాలకు అధికారులు లేఖలు రాశారు.

మిథున్‌రెడ్డికి బెయిల్

విజయవాడ/రాజమహేంద్రవరం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో ఏ4 నిందితుడిగా ఉన్న రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డికి విజయవాడ ఏసీబీ కోర్టు సోమవారం బెయిల్ మంజూరు చేసింది. దీనికి సంబంధించిన తీర్పును న్యాయాధికారి పి.భాస్కరరావు వెలువరించారు. రూ. 2 లక్షల పూచీకత్తును సమర్పించాలని, సోమవారం, శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల్లోపు సిట్ ఎదుట హాజరుకావాలని, అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదని, కేసు గురించి బయట మాట్లాడొద్దని, ల్యాండ్‌లైన్, ఆధార్‌కార్డు, మొబైల్ నంబరు కోర్టులో ఇవ్వాలని షరతులు విధించింది. జూలై 19న సిట్ అధికారులు మిథున్‌రెడ్డిని అరెస్టు చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో 71 రోజులపాటు రిమాండ్ ఖైదీగా ఉన్నారు. బెయిల్‌పై కోర్టు తీర్పు అనంతరం సోమవారం సాయంత్రం జైలు నుంచి మిథున్‌రెడ్డి విడుదలయ్యారు.



గిన్నిస్‌బుక్‌లోకి

మహా బతుకమ్మ



బతుకమ్మ ఆడుతున్న మిస్ వరల్డ్ సుచాత తదితరులు

(మొదటిపేజీ తరువాయి)

సోమవారం 'మన బతుకమ్మ' ఉత్సవాల్లో భాగంగా ఈ బతుకమ్మ స్థానికులను ఔరా అనిపించింది. కార్యక్రమంలో 10వేల మంది మహిళలు పాల్గొన్నారు. ఈ మహా బతుకమ్మ చుట్టూ 1354 మంది మహిళలు కొన్ని వరుసలుగా చేరి బతుకమ్మ ఆడిపాడారు. మరి.. ఇంతటి భారీ బతుకమ్మను పేర్చడం, ఇంతపెద్ద సంఖ్యలో మహిళలు ఆడిపాడటం మామూలు విషయమా? గిన్నిస్ అధికారులే అచ్చెరువొంది.. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల్లో చోటు కల్పించారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ సంస్థ ప్రతినిధి స్వప్నిల్ ఈ వేడుకను వీక్షించారు. గతంలో 36.08 అడుగుల ఎత్తున్న బతుకమ్మ చుట్టూ 474 మంది చేరి ఆడారని.. ఆ రికార్డును ఈ మహా బతుకమ్మ బద్దలు కొట్టిందని స్వప్నిల్ వెల్లడించారు. ఈ కార్యక్రమానికి సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క ముఖ్య అతిథులుగా విచ్చేశారు. నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, ప్రజాగాయకురాలు విమలక్క, సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. భారీ ఎత్తుతో కూడిన బతుకమ్మ, భారీ సంఖ్యలో మహిళలు ఆడిపాడటానికి సంబంధించి రికార్డు పత్రాలను గిన్నిస్ ప్రతినిధి మంత్రులకు అందజేశారు. విమలక్క, ప్రముఖ సినీ గాయని గీత తమ గాత్రంతో ఆకట్టుకున్నారు. వేడుకల్లో మిస్ వరల్డ్, థాయ్ అమ్మాయి ఓపెల్ సుచాట చువాంగ్‌శ్రీ, మిస్ అమెరికా, మిస్ ఏషియా, మిస్ యూరప్, మిస్ కరేబియన్, మిస్ అర్జెంటీనా పాల్గొని సందడి చేశారు.



హనుమకొండలోని పద్మాక్షిగుట్ట ఆలయం వద్ద..



తీరొక్క పూలతో ఘనమైన పండుగ

- ప్రజా ప్రభుత్వంలో ప్రకృతి పరిరక్షణకు ప్రాధాన్యం
- రాష్ట్ర మహిళలందరికీ సీఎం.. సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

హైదరాబాద్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సద్దుల బతుకమ్మ సందర్భంగా రాష్ట్రంలోని మహిళలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతిని.. పూలను పూజించే గొప్ప సంస్కృతికి ఈ పండుగ నెలవని తెలిపారు. తీరొక్క పూలతో తయారుచేసిన ఘనమైన బతుకమ్మలతో ఆడబిడ్డలందరూ ఆటపాటలతో సద్దుల బతుకమ్మ సంబురాలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. తెలంగాణ సామూహిక జీవన విధానానికి, కష్టసుఖాలను కలిసి పంచుకునే ప్రజల ఐక్యతకు ఈ పండుగ నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజాప్రభుత్వంలో ప్రకృతి పరిరక్షణకు ప్రాధాన్యమిస్తున్నామని, చెరువులు, కుంటలను పదిలంగా కాపాడి భవిష్యత్ తరాలకు వారసత్వంగా అందిస్తున్నామన్నారు. అందుకే అంబర్‌పేటలో బతుకమ్మ కుంటను పునరుద్ధరించామన్న విషయాన్ని గుర్తుచేశారు.

మహాగౌరి అలంకరణలో భ్రమరాంబికాదేవి

శ్రీశైలం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో ఎనిమిదో రోజు సోమవారం భ్రమరాంబికాదేవి భక్తులకు మహాగౌరి అలంకరణలో దర్శనమిచ్చారు.

విజయవాడకు పోటెత్తిన భక్తులు

విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ సోమవారం సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు.. సోమవారం సాయంత్రానికి 1,37,463 మంది భక్తులు అమ్మవారి దర్శనం చేసుకున్నారు.



మహాగౌరి అలంకరణలో భ్రమరాంబికాదేవి



రేపటి నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభించండి!

- పత్తి రైతుకు కనీస మద్దతు ధర దక్కాల్సిందే
- సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయాలి
- కేంద్రమంత్రి గిరిరాజ్‌సింగ్‌కు తుమ్మల లేఖ

హైదరాబాద్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బుధవారం నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం లేఖ రాశారు. పత్తి రైతులకు కనీస మద్దతు ధర అందేలా సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. "రాష్ట్రంలో ఈ వానాకాలంలో 43.29 లక్షల ఎకరాల పత్తి సాగైంది. సుమారు 24.70 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తిని అంచనా వేశాం. చిన్న, సన్నకారు రైతులే ఎక్కువగా పత్తి సాగుచేస్తున్నారు. దీనికి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలి. ఈ సీజన్‌లో జాబ్ వర్క్ చేయటానికి సీసీఐ రెండుసార్లు టెండర్లు పిలిచినా.. జిన్నింగ్ మిల్లర్లు టెండర్లలో పాల్గొనలేదు." అని కేంద్ర మంత్రి దృష్టికి తుమ్మల తీసుకెళ్లారు. నిరుడు అమలు చేసిన విధానాన్నే ఈసారి కొనసాగించాలని తెలంగాణ కాటన్ మిల్లర్లు, ట్రేడర్ల సంక్షేమ సంఘం కోరుతున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా ఎల్-1, ఎల్-2 అలాట్మెంట్లు, లింట్ రికవరీ శాతం, జోన్ల వారీగా లింట్ శాతం, రైతుల స్లాట్ బుకింగ్, ఏరియా మ్యాపింగ్ అంశాలపై అభ్యంతరాలు వ్యక్తం చేశారని మంత్రి లేఖలో పేర్కొన్నారు.

సీసీఐ, మార్కెటింగ్ అధికారులు కలిసి పనిచేయాలి

పత్తి రైతులకు కనీస మద్దతు ధర అందించటమే లక్ష్యమని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ప్రస్తుతం మార్కెట్ ధర ఎమ్మెస్పీ కంటే క్వింటాలుకు రూ. 1,410 చొప్పున తక్కువగా ఉంద న్నారు. క్వింటాలుకు రూ. 8,110 చొప్పున రైతులకు కనీస మద్దతు ధర దక్కాల్సిందేనని చెప్పారు. పత్తి కొనుగోళ్లు పారదర్శకంగా జరిగేలా సీసీఐ, మార్కెటింగ్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. తేమశాతం, నాణ్యత, తూకం, ధరల విషయంలో రైతులకు అన్యాయం జరగకుండా మానిటరింగ్ కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. రైతుల ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నెంబరు 1800 599 5779, వాట్సప్ హెల్ప్‌లైన్ నెంబరు 88972 81111 అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. సీసీఐ సెంటర్లలో సీసీ కెమెరాలతో పాటు రోజువారీ క్రయవిక్రయాలు పరిశీలించేందుకు డైరెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటుచేయాలన్నారు.

ఎల్బీనగర్, అల్వాల్ టిమ్స్‌లలో ఉచిత, చెల్లింపు వైద్యసేవలు!

పేదలకు ప్రత్యేకంగా 350 పడకలు.. కావాలనుకుంటే చెల్లింపు వైద్య సేవలు.. వారికి 650 పడకలు ఉండేలా ప్రణాళిక

- సనత్‌నగర్‌లో నిమ్స్ తరహా సేవలు
- 'ఉచితం' స్థానంలో ఆరోగ్య శ్రీ వైద్యం

హైదరాబాద్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజధాని హైదరాబాద్‌లో కొత్తగా నిర్మిస్తున్న మూడు తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, రీసెర్చ్(టిమ్స్)ల్లో అత్యుత్తమ వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా ఎల్బీనగర్, అల్వాల్ టిమ్స్‌లలో ఉచిత, చెల్లింపు వైద్య సేవలు అందించేలా, సనత్‌నగర్ టిమ్స్‌లో నిమ్స్ తరహాలో సేవలు అందించేలా వైద్య శాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఎల్బీనగర్, అల్వాల్ టిమ్స్‌లలో పేదలకు ఉచిత వైద్యం అందించడంతోపాటు స్తోమత ఉన్న వారు డబ్బులు చెల్లించి వైద్య సేవలు పొందే వెసులుబాటు కల్పించనున్నారు. సనత్ నగర్ మినహా మిగిలిన రెండు చోట్లా మెడికల్ కాలేజీల కోసం 350 పడకలు కేటాయించనున్నారు. వీటిలో ప్రజలకు ఉచిత వైద్య సేవలందించనున్నారు. మిగిలిన 650 పడకల్లో చెల్లింపు సేవలు అందించనున్నారు. ఇక, సనత్‌నగర్ టిమ్స్‌లో మాత్రం చెల్లింపు వైద్య సేవలు మాత్రమే అందుబాటులో ఉంటాయి. కానీ, నిమ్స్ తరహాలో ఆరోగ్య శ్రీ కింద రోగులను చేర్చుకుని, సేవలందిస్తారు. హైదరాబాద్ చుట్టూ మూడు టిమ్స్‌లతోపాటు వరంగల్‌లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం కోసం బ్యాంకుల నుంచి అప్పులు తీసుకోవాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. అందుకోసం సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కార్పొరేషన్ లిమిటెడ్(టీఎస్ఎస్‌హెచ్‌సీఎల్)ను ఏర్పాటు చేసింది. తొలుత హన్మకొండలోని 56 ఎకరాలను(వరంగల్ జైలు స్థలాన్ని) తాకట్టు పెట్టి బ్యాంకు ఆఫ్ మహారాష్ట్ర నుంచి రూ.1173 కోట్ల రుణాన్ని తీసుకుంది. ఆ తర్వాత రూ.10వేల కోట్ల రుణానికి ప్రతిపాదనలు పెట్టగా, ఎస్బీఐ కన్సార్టియం దశల వారీగా మరో రూ.4800 కోట్లు రుణం ఇచ్చింది. ఇందుకోసం నిమ్స్‌తో పాటు సనత్ నగర్, కొత్తపేట, అల్వాల్ టిమ్స్ భూములను గత ప్రభుత్వం తాకట్టు పెట్టింది. పేమెంట్ కేర్ ద్వారా వచ్చే డబ్బులతో రుణాలు చెల్లిస్తామని ఒప్పందాలు చేసుకుంది. అందులో భాగంగానే చెల్లింపు వైద్య సేవల విధానాన్ని అమలు చేయాల్సి వస్తోందని వైద్య వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎల్బీనగర్ టిమ్స్‌ను మహేశ్వరం మెడికల్ కాలేజీ, అల్వాల్ టిమ్స్‌ను కుత్బుల్లాపూర్ వైద్య కళాశాల పరిధిలోకి తీసుకొచ్చింది. దీంతో ఆయా ఆస్పత్రుల్లో చెల్లింపు సేవలతోపాటు ఉచిత సేవలు అందనున్నాయి.

వేర్వేరుగా ఏర్పాట్లు

ఎల్బీనగర్, అల్వాల్ టిమ్స్‌ల్లోకి అడుగుపెట్టగానే ఎడమవైపు ఉచిత వైద్య సేవలు, కుడివైపు చెల్లింపు సేవలు ఉండేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. డబ్బులు చెల్లించి వైద్యం పొందాలనుకునే వారినే చెల్లింపు సేవల విభాగంలోకి అనుమతిస్తారు. విశ్వసనీయ సమాచారం మేరకు టిమ్స్‌లోని పై అంతస్తుల్లో లగ్జరీ రూమ్‌లను కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు. చెల్లింపు, ఉచిత సేవలు అందించే సూపర్ స్పెషాలిటీ వైద్యులు, వైద్య సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది కూడా వేర్వేరుగానే ఉంటారని వైద్యవర్గాలు చెబుతున్నాయి. సెల్ఫ్ మనీ జనరేటెడ్ విధానం అమలు చేయడం ద్వారా సర్కారుపైనా భారం తగ్గుతుందని పేర్కొంటున్నాయి. అదే సమయంలో కార్పొరేషన్ పేరిట తీసుకున్న అప్పులను చెల్లించే వెసులుబాటు కలుగుతుందని భావిస్తున్నాయి. కాగా, అక్టోబరు చివరి నాటికి సనత్ నగర్ టిమ్స్ నిర్మాణాన్ని పూర్తి చేసి అప్పగిస్తామని నిర్మాణ సంస్థలు వైద్యశాఖకు తెలిపాయి. డిసెంబరులో అక్కడ వైద్య సేవలు ప్రారంభించేందుకు సర్కారు సన్నాహాలు చేస్తోంది. వచ్చే ఏడాది మార్చి నాటికి ఎల్ బీనగర్, అల్వాల్ టిమ్స్‌లను నిర్మాణ సంస్థలు వైద్య శాఖకు అప్పగించనున్నాయి.

హైకోర్టులో అఫిడవిట్ సమర్పించండి

- బీసీ రిజర్వేషన్లపై రాజకీయ పార్టీలకు మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి
- ఈడబ్ల్యూఎస్‌తో 50% రిజర్వేషన్ పరిమితి దాటిపోయిందని వ్యాఖ్య
- పిటిషన్ ఉపసంహరించుకోవాలని పిటిషనర్‌కు వినతి
- రిజర్వేషన్లను వ్యతిరేకించి బీసీల ఆగ్రహానికి గురి కాకండి: మంత్రి వాకిటి





హైదరాబాద్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ కల్పనకు ఏకగ్రీవంగా అసెంబ్లీ ఆమోదించిన బిల్లుకు సంపూర్ణ మద్దతునిస్తున్నట్లు హైకోర్టులో అఫిడవిట్ సమర్పించాలని అన్ని రాజకీయ పార్టీలకు రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. గాంధీ భవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ విషయమై హైకోర్టులో అక్టోబర్ 8న విచారణ జరుగుతున్న నేపథ్యంలో జీవోకి అనుగుణంగా బీసీలకు 42% రిజర్వేషన్ కొనసాగించాలని కోరుతూ హైకోర్టు చీఫ్ జస్టిస్ బెంచ్‌కు అఫిడవిట్లు సమర్పించాలన్నారు. మంత్రులు వాకిటి శ్రీహరి, కొండా సురేఖలతో కలిసి తాను త్వరలోనే అన్ని పార్టీల అధ్యక్షులను కలిసి విజ్ఞప్తి చేస్తానన్నారు. దీనిపై భవిష్యత్తులో దేశవ్యాప్త చర్చ జరుగుతుందన్న పొన్నం.. ఈడబ్ల్యూఎస్‌తో 50% రిజర్వేషన్ పరిమితి దాటిపోయిందని గుర్తించాలని పేర్కొన్నారు. ఇందిరా సహానీ, కృష్ణమూర్తి కేసులు, రాష్ట్రపతి వద్ద బిల్లుల పెండింగ్‌పై సుప్రీంకోర్టు తీర్పులను పరిగణనలోకి తీసుకున్నాకే.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ పెంచుతూ 9వ నంబర్ జీవో జారీ చేశామని తెలిపారు. జీవోకు వ్యతిరేకంగా హైకోర్టులో వేసిన పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని పిటిషనర్‌కు బీసీ సంఘాల తరపున విజ్ఞప్తి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. బీజేపీ అధిష్ఠానంతో మాట్లాడి రాష్ట్రపతి వద్ద పెండింగ్ బిల్లును ఆమోదింప జేయాలని ఆ పార్టీ ఎంపీ కె.లక్ష్మణ్‌ను కోరిన పొన్నం.. అందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడూ మద్దతు తెలపాలన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. ఈ రిజర్వేషన్లను వ్యతిరేకించి బీసీ బిడ్డల ఆగ్రహానికి గురి కావద్దని కోరారు. దసరాకు ముందే బీసీ బిడ్డలకు పండుగ వాతావరణం వచ్చిందని, తాము ఎవరికీ వ్యతిరేకం కాదని, ఎవరి నోటి కాడి ముద్ద లాక్కోవడం లేదని చెప్పారు. వాస్తవంగా జనాభా దామాషా ప్రకారం బీసీల వాటా పెరగాల్సి ఉన్నా.. 42 శాతానికే కుదించుకున్నామని వాకిటి తెలిపారు.

ఆ హామీలు అమలు చేయాలి:కోదండరాం

అసెంబ్లీ ఎన్నికల ముందు తెలంగాణ ఉద్యమకారులు, అమర వీరుల కుటుంబాలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను టీజేఎస్ అధ్యక్షుడు ఎం. కోదండరాం కోరారు. గాంధీభవన్‌లో పొన్నంకు సోమవారం వినతిపత్రం సమర్పించిన కోదండరాం.. ఈ విషయమై సీఎం రేవంత్ రెడ్డి చొరవ తీసుకోవాలన్నారు. మంత్రి పొన్నం స్పందిస్తూ.. ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలుకు కార్యాచరణ చేపడతామని హామీ ఇచ్చారు.

దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతు చేయాలి

» సీఎం రేవంత్‌తో మాట్లాడి హ్యామ్ విధానం తెస్తాం

» రోడ్లు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత దెబ్బ తిన్న రోడ్లకు తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టాలని తన శాఖ అధికారులను రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి ఆదేశించారు. శాశ్వత పనులు చేపట్టడానికి మరోమారు క్షేత్రస్థాయిలో సర్వే జరపాలని సూచించారు. తన శాఖ పరిధిలోని రోడ్ల పురోగతిపై సోమవారం ఆయన అధికారులతో సమీక్షించారు. ఇటీవల కురిసిన వర్షాలతో 1,062 ప్రాంతాల్లో 1,370 కి.మీ పరిధిలో రోడ్లు దెబ్బ తినగా, కొన్ని చోట్ల కోతకు గురయ్యాయని మంత్రికి ఈఎన్‌సీ మోహన్‌నాయక్ వివరించారు. వాటి తాత్కాలిక మరమ్మతు పనులకు రూ.72 కోట్లు, శాశ్వత పునరుద్ధరణకు రూ.1,263 కోట్లు అవసరమన్నారు. నిర్ణీత గడువులోగా టెండర్లను పూర్తి చేయాలని అధికారులను మంత్రి కోమటిరెడ్డి ఆదేశించారు. కరీంనగర్, ములుగు, వరంగల్ కలెక్టరేట్ల నిర్మాణం పూర్తి చేయడంతోపాటు నారాయణపేట, ఆదిలాబాద్ కలెక్టరేట్‌ల పనుల్లో వేగం పెంచి త్వరగా ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. ఎన్నికల్ కోడ్ ముగిశాక పూర్తిస్థాయిలో సమీక్షిస్తానని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి హ్యామ్ రోడ్లపై ఒక స్పష్టమైన విధానాన్ని తెస్తామని అధికారులకు మంత్రి కోమటిరెడ్డి చెప్పారు. ఈ సమీక్షలో చీఫ్ ఇంజినీర్లు రాజేశ్వరరెడ్డి, బీవీ రావు, లక్ష్మణ్, శ్రీనివాస రెడ్డి, కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తలకిందులైన విద్యుత్ కొనుగోళ్ల ధర!

» నాన్‌పీక్ అవర్స్‌లో రాయితీ ఎత్తివేయాలని డిస్కమ్‌ల వినతి.. త్వరలో ఈఆర్‌సీ నిర్ణయం

హైదరాబాద్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బహిరంగ విపణిలో కరెంట్ కొనుగోళ్ల ఆధారంగా ఇప్పటిదాకా నిర్ధారించుకున్న ప్రామాణికతలు మారాయా? డిమాండ్ ఉన్న (పీక్), డిమాండ్ లేని (నాన్ పీక్) సమయాల మధ్య గీత చెరిగిపోయిందా? అంటే.. అవుననే చెబుతున్నాయి గణాంకాలు. డిమాండ్ లేని సమయం(రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల మధ్య)లో విద్యుత్ వాడుతున్నవారికి ఇప్పటిదాకా యూనిట్‌కు ఇస్తున్న రూ.1.50 రాయితీని ఎత్తివేయాలని భావిస్తున్న డిస్కమ్‌లు.. ఈమేరకు అనుమతి కోరుతూ తెలంగాణ విద్యుత్తు నియంత్రణ మండలి(టీజీఈఆర్‌సీ)లో పిటిషన్ వేశాయి. 2025-26లో (ఏప్రిల్, మే, జూన్ నెలల్లో) మార్నింగ్ పీక్ అవర్స్‌లో రూ.4.79, సాధారణ సమయంలో రూ.4.24, ఈవినింగ్ పీక్ అవర్స్‌లో రూ.5.77, ఇన్సెంటివ్ సమయంలో రూ.5.59 చొప్పున కొన్నామని లెక్కలు అందించాయి. విద్యుత్తు కొనుగోళ్ల ధర తలకిందులైన నేపథ్యంలో నాన్‌పీక్ అవర్స్‌లో రూ.1.50రాయితీని ఎత్తివేయాలని డిస్కమ్‌లు కోరాయి. ఈ పిటిషన్‌పై అభ్యంతరాలు స్వీకరించిన ఈఆర్‌సీ.. బహిరంగ విచారణ ప్రక్రియను సైతం పూర్తి చేసింది. ఈ అంశంపై ఈఆర్‌సీ త్వరలోనే నిర్ణయం తీసుకోనుంది.

ప్రజా కేంద్రీకృత పోలీసింగ్‌కు ప్రాధాన్యం

» డీజీపీ జితేందర్

హైదరాబాద్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో పోలీస్ అధికారులు ప్రజా కేంద్రీకృత పోలీసింగ్(సిటిజెన్ సెంట్రిక్ పోలీసింగ్)కు ప్రాధాన్యం ఇవ్వాలని డీజీపీ జితేందర్ అభిప్రాయపడ్డారు. పదవీ విరమణ సందర్భంగా డీజీపీ కార్యాలయంలో మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర డీజీపీగా 14 నెలలు పని చేసినందుకు గర్వపడుతున్నానన్నారు. తాను డీజీపీగా ఉన్న సమయంలోనే.. ప్రజలకు ఉత్తమ సేవలు అందించడంలో తెలంగాణ పోలీస్ విభాగం దేశంలోనే మొదటి స్థానంలో నిలవడం సంతోషంగా ఉందని చెప్పారు. డీజీపీ కార్యాలయ ఉద్యోగులు సమర్థంగా పనిచేస్తేనే రాష్ట్ర పోలీస్‌కు మంచి గుర్తింపు లభిస్తుందని ఆయన అన్నారు. కాగా, అగ్నిమాపక శాఖ డీజీగా విక్రం సింగ్ మాన్ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఆ శాఖ డీజీగా కొనసాగిన వై. నాగిరెడ్డి నుంచి సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

పౌర సరఫరాల కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన స్టీఫెన్ రవీంద్ర

హైదరాబాద్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి స్టీఫెన్ రవీంద్ర... సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పౌరసరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా, కమిషనర్‌గా, కార్పొరేషన్‌కు వీసీ- ఎండీగా పనిచేసిన మరో సీనియర్ ఐపీఎస్ అధికారి చౌహాన్‌కు... అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (మల్టీజోన్-2)గా ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. దీంతో సోమవారం డీఎస్ చౌహాన్ రిలీవ్ అయ్యారు. ఎఫ్‌సీఐ జనరల్ మేనేజర్ నరసింహరాజు, పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ హన్మంతు జండేజ్ కొండిబా, అదనపు డైరెక్టర్ రోహిత్‌సింగ్ సహా అధికారులు... పౌరసరఫరాల భవన్‌లో చౌహాన్‌కు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు.

దసరాకు ఒక్క బకాయి అయినా ఇవ్వండి

» ముఖ్యమంత్రికి ఇండియన్ బిల్డర్స్ అసోసియేషన్ లేఖ

హైదరాబాద్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న బకాయిల్లో కనీసం ఒక్కటైనా ఇవ్వాలని కోరుతూ ఇండియన్ బిల్డర్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర విభాగం సీఎం రేవంత్‌కు లేఖ రాసింది. రాష్ట్రంలోని వివిధ విభాగాల్లో కాంట్రాక్టర్లకు చాలా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, దీంతో వారంతా ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని లేఖలో ప్రస్తావించింది. ఒక్క బకాయి విడుదల చేసినా ఎంతో ఉపశమనం లభిస్తుందని అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షులు డీవీఎన్ రెడ్డి, రాష్ట్ర విభాగం తరపున యు.సురేందర్ లేఖలో రాశారు.

రూ.531 కోట్ల పెండింగ్ బిల్లులను చెల్లించండి

వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి సర్పంచులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని సర్పంచుల సంఘం జేఏసీ కోరింది. ఈమేరకు సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాసింది. 2019 నుంచి 2024 వరకు ఐదేళ్లకు సంబంధించిన రూ.531 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుంటి మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, కార్యదర్శి కేశబోయిన మల్లయ్య తెలిపారు. ఈ విషయంలో సీఎం చొరవ తీసుకోవాలని కోరారు.

కాంగ్రెస్‌కు మళ్లీ అధికారంపై చర్చకు సిద్ధమా?

» కేటీఆర్‌కు మంత్రి జూపల్లి సవాల్

» కేటీఆర్‌కు ధైర్యం ఉంటే నిజం చెప్పాలని సూచన

హైదరాబాద్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తదో రాదోనని తానన్నట్లు అసత్య ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో మీడియా సాక్షిగా బహిరంగ చర్చకు రావాలని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సవాల్ చేశారు. 'ఆయన వ్యాఖ్యల్లో పస లేదు. అబద్ధాలు మాట్లాడుతున్నారు. ఆ వ్యాఖ్యలపై చర్చకు సిద్ధమా..? నేను మీడియాతో వస్తా.. నేడు.. రేపు.. ఎల్లుండి.. ఎప్పుడు ఎక్కడికి రావాలో చెప్పండి' అని సోమవారం రవీంద్ర భారతిలో మీడియాతో చెప్పారు. 'నువ్వు చేసిన వ్యాఖ్యలు వాస్తవమని తేలితే నేను ఎమ్మెల్యే పదవికి, మంత్రి పదవికి రాజీనామా చేస్తా' అని సవాల్ విసిరారు. నిజం మాట్లాడే ధైర్యం ఉంటే కేటీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. కొల్లాపూర్‌లో 7సార్లు పోటీ చేస్తే 6సార్లు విజయం సాధించిన తాను.. ఏనాడూ హామీలివ్వలేదని, అభివృద్ధి చేసుకుంటూ వెళ్తానని, ప్రజలు అవసరాలు తీర్చడమే తన విశ్వసనీయత అని పేర్కొన్నారు. తాను అబద్ధాలు చెప్పనని, హామీలివ్వకుండా అభివృద్ధి చేసి చూపుతానన్న జూపల్లి.. కేటీఆర్ మాత్రం తప్పుడు హామీలు, అబద్ధాలతో రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని మండిపడ్డారు. వచ్చే పదేళ్లు రాష్ట్రంలో కాంగ్రెస్‌దే అధికారమని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో ప్రతిపక్షం లేకుండా చేసేందుకు ప్రయత్నించిందన్నారు. కానీ, 2023లో రేవంత్ రెడ్డి విసిరిన పంజాకు బీఆర్ఎస్ ఓటమి పాలైందని, స్థానిక ఎన్నికల్లో మరోసారి రేవంత్ పంజా సత్తా ఏమిటో కేటీఆర్‌కు తెలిసొస్తుందని చెప్పారు.

అనర్హత పిటిషన్లపై విచారణ ప్రారంభం

» పిటిషన్‌దారులను క్రాస్ ఎగ్జామిన్ చేసిన న్యాయవాదులు

» రేపు ఎమ్మెల్యేలను క్రాస్ ఎగ్జామిన్ చేయనున్న పిటిషన్‌దారుల న్యాయవాదులు

హైదరాబాద్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న పది మంది ఎమ్మెల్యేలలో ప్రకాశ్‌గౌడ్, కాలె యాదయ్య, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డిలపై దాఖలైన పిటిషన్లపై విచారణ ప్రారంభమైంది. స్పీకర్ ప్రసాద్‌కుమార్ చాంబర్లో సోమవారంనాడు ఒక్కో ఎమ్మెల్యేపై దాఖలైన పిటిషన్‌కు ఒక్కో గంట చొప్పున కేటాయించి విచారణ నిర్వహించారు. ఈ విచారణకు పిటిషన్‌దారులుగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కల్వకుంట్ల సంజయ్, చింతా ప్రభాకర్, పల్లా రాజేశ్వర్‌రెడ్డిలు.. వారి తరపు న్యాయవాదులు హాజరయ్యారు. తొలి రోజున ఎమ్మెల్యేల తరపు న్యాయవాదులు వాదనలు వినిపించారు. ఆ ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని, ఇప్పటికీ బీఆర్ఎస్ పార్టీ సభ్యులుగానే కొనసాగుతున్నారంటూ బలమైన వాదనలు వినిపించారు. పిటిషన్‌దారులను క్రాస్ ఎగ్జామిన్ చేశారు. పార్టీ మారినట్లుగా పిటిషన్‌దారులు తమ అఫిడవిట్‌లలో ఇచ్చిన ఆధారాలపై ప్రశ్నలు వేశారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన విచారణ.. సాయంత్రం 5 గంటల వరకూ సాగింది. ఇదే నలుగురు ఎమ్మెల్యేల మీద పిటిషన్లపై బుధవారంనాడూ విచారణ కొనసాగనుంది. బుధవారంనాటి విచారణలో.. పిటిషన్‌దారుల న్యాయవాదులు ఆ ఎమ్మెల్యేలను క్రాస్ ఎగ్జామిన్ చేయనున్నారు. కాగా.. విచారణ ముగిసిన అనంతరం.. అసెంబ్లీ బయట మీడియాతో పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఫిరాయింపు ఎమ్మెల్యేల తరఫున వచ్చిన న్యాయవాది అసంబద్ధమైన ప్రశ్నలు వేస్తూ తిమ్మిని బమ్మిని చేసే ప్రయత్నం చేశారని, అయినా ఓపికతో సమాధానం చెప్పామన్నారు. ఆ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరలేదంటూ నిస్సిగ్గుగా చెబుతున్నారన్నారు. పార్టీ మారి అధికారాన్ని అనుభవిస్తున్న వారిపై అనర్హత వేటు వేయాలని స్పష్టంగా చెప్పామన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు రాజీనామా చేసి గెలవాలని సవాల్ విసిరారు.

సమరానికి సై

(మొదటిపేజీ తరువాయి)



జడ్పీటీసీలు	565
ఎంపీటీసీలు	5,749
సర్పంచులు	12,733
వార్డు సభ్యులు	1,12,288

పంచాయతీ, వార్డుల వారీగా డీపీవోలు, ఎంపీడీవోల ద్వారా పరిశీలన జరుపుతారు. కాగా, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు పార్టీ గుర్తులతోనే ఎన్నికలను నిర్వహిస్తారు. సర్పంచి, వార్డు సభ్యుల ఎన్నికలు మాత్రం పార్టీరహితంగా చేపడతారు. ఇందుకు అనుగుణంగా ఎస్ఈసీ ఎన్నికల సామగ్రిని ఇప్పటికే సిద్ధం చేసింది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు కేటాయించాల్సిన గుర్తులు, బ్యాలెట్ పత్రాలను ఇప్పటికే ముద్రించారు. స్థానికంగా వచ్చే నామినేషన్ల ఆధారంగా ఆయా గుర్తులను అభ్యర్థులకు కేటాయిస్తారు.

ప్రభుత్వ గజిట్ ఆధారంగా షెడ్యూల్: రాణి కుముదిని

రాష్ట్రంలోని జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల ఖాళీల పరిధిలో ఎన్నికలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం కోరిందని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన గజిట్ నోటిఫికేషన్ ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ ఖరారు చేశామని వెల్లడించారు. ఎస్ఈసీ కార్యాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి ఎన్.శ్రీధర్, ఆ శాఖ డైరెక్టర్ సృజన, పోలీసు ఉన్నతాధికారులతో కలిసి సోమవారం ఆమె మీడియాతో మాట్లాడారు. "అక్టోబరు 9 నుంచి నవంబరు 11 వరకు ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుంది. షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో ఇప్పటి నుంచే రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుంది. కేంద్ర ఎన్నికల సంఘం అందజేసిన ఓటరు జాబితాను ఆధారంగా చేసుకొని తుది ఓటర్ల జాబితాను గ్రామ పంచాయతీ, వార్డుల వారీగా ఇప్పటికే ప్రకటించాం. విడతల వారీగా చేపట్టే ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ జారీ చేసే రోజు నుంచే ఆ విడత ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణ మొదలవుతుంది. పోలింగ్ పూర్తయిన తర్వాత అదే రోజు పంచాయతీల ఓట్ల లెక్కింపు చేపడతాం" అని వివరించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి క్షేత్రస్థాయిలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ఎక్కడా అడ్డంకులు లేకుండా సమర్థంగా నిర్వహించేలా కలెక్టర్లతో సమన్వయం చేసుకుంటామని తెలిపారు.

గ్రామ పంచాయతీ సర్పంచ్ వార్డు సభ్యుల ఎన్నికలు

	తొలి విడత	రెండో విడత	మూడో విడత
నామినేషన్ల స్వీకరణ మొదలు	అక్టోబరు 17	అక్టోబరు 21	అక్టోబరు 25
నామినేషన్ల స్వీకరణకు చివరితేది	అక్టోబరు 19	అక్టోబరు 23	అక్టోబరు 27
నామినేషన్ల పరిశీలన	అక్టోబరు 20	అక్టోబరు 24	అక్టోబరు 28
నామినేషన్ల ఉపసంహరణ	అక్టోబరు 23	అక్టోబరు 27	అక్టోబరు 31
పోలింగ్, ఓట్ల లెక్కింపు తేది	అక్టోబరు 31	నవంబరు 4	నవంబరు 8

విడతల వారీగా ఎన్నికల షెడ్యూల్ ఇలా...!

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు	తొలి విడత	రెండో విడత
నామినేషన్ల స్వీకరణ మొదలు	అక్టోబరు 9	అక్టోబరు 13
నామినేషన్ల స్వీకరణకు చివరి తేది	అక్టోబరు 11	అక్టోబరు 15
నామినేషన్ల పరిశీలన	అక్టోబరు 12	అక్టోబరు 16
నామినేషన్ల ఉపసంహరణ	అక్టోబరు 15	అక్టోబరు 19
పోలింగ్ తేదీ	అక్టోబరు 23	అక్టోబరు 27
ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి	నవంబర్ 11	నవంబర్ 11

మొత్తం ఓటర్ల సంఖ్య	
మొత్తం ఓటర్ల సంఖ్య	1,67,03,168
పురుషులు	81,65,894
మహిళలు	85,36,770
ఇతరులు	504

పోలింగ్ కేంద్రాల వివరాలు	ఎంపీటీసీ ఎన్నికలకు	జడ్పీటీసీ ఎన్నికలకు	సర్పంచ్ ఎన్నికలకు	వార్డు సభ్యుల ఎన్నికలకు
	31,300	15,302	15,522	1,12,474

ఇద్దరి కన్నా ఎక్కువ పిల్లలుంటే అనర్హులు

స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఇద్దరు కంటే ఎక్కువమంది పిల్లలుంటే అనర్హులనే విధానం ఏళ్ల తరబడి కొనసాగుతోంది. అయితే, ఈ ఎన్నికల్లో దానికి సడలింపు ఇస్తారని ఆశావహులు భావించినా..ప్రభుత్వం ఏ నిర్ణయం ప్రకటించలేదు. దీంతో ఈ ఎన్నికల్లో ఇద్దరి కన్నా ఎక్కువమంది పిల్లలున్న వారు పోటీకి అనర్హులేనని సంబంధిత విభాగాలు వెల్లడించాయి. ఎక్కువ మంది పిల్లల నిబంధనను ఏపీలో ఇటీవల ఎత్తివేశారు.



పంచాయతీ కార్యదర్శులకు రూ. 104 కోట్ల బకాయిల విడుదల

» మంత్రి సీతక్క వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పంచాయతీ కార్యదర్శులకు రావాల్సిన రూ.104కోట్ల పెండింగ్ బకాయిలను రాష్ట్రప్రభుత్వం విడుదల చేసిందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క తెలిపారు. గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య చర్యలు, నీటి సరఫరా మోటార్ల మరమ్మతులకు, ఇతర పనులకు సొంతంగా ఖర్చు చేసినట్లు పంచాయతీ కార్యదర్శులు ఇటీవలే మంత్రి సీతక్క దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ప్రభుత్వం ఈ బకాయిలను విడుదల చేసిందని మంత్రి పేర్కొన్నారు. రూ.104కోట్ల విడుదలతో పంచాయతీ కార్యదర్శుల పెండింగ్ బిల్లులన్నీ క్లియర్ అయ్యాయని సీతక్క తెలిపారు.

ఈరోజు 300 కోట్లయినా విడుదల చేస్తాం

ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలకు చెల్లించాల్సిన ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిల్లో మంగళవారం రూ.300 కోట్లయినా విడుదల చేస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. వెంటనే బకాయిలు విడుదల చేయాలని కోరుతూ ప్రైవేట్ కాలేజీ యాజమాన్యాల సంఘం ప్రతినిధులు భట్టిని కలిశారు. దీనిపై స్పందించిన ఆయన ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నిధులు కేటాయిస్తామని చెప్పారు. అంతకుముందు సంఘం ప్రతినిధులు మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డిని, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాను కలిశారు.

స్థానికానికి సన్నద్ధం!

రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రుణమాఫీ, సన్నబియ్యం, బీసీ రిజర్వేషన్‌పై కాంగ్రెస్ ఆశలు

» ప్రభుత్వ వ్యతిరేకతపై బీఆర్ఎస్ నేతల ఆశాభావం

» ఆ పార్టీల వైఫల్యాలపై ప్రచారానికి బీజేపీ నిర్ణయం

» ఎనిమిదో తేదీన హైకోర్టు ఆదేశాలపై పార్టీల్లో ఉత్కంఠ

హైదరాబాద్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగుతాయా లేదా అన్న అనుమానం మనసులో మెదులుతున్నా.. షెడ్యూల్ విడుదల కావడంతో రాష్ట్రంలోని ప్రధాన పార్టీలన్నీ వ్యూహ, ప్రతివ్యూహాల రచనలో మునిగిపోయాయి. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ... ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తుండడం, స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడం, అధికార పార్టీ కావడం.. తమకు లాభం చేకూరుస్తుందని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. కాంగ్రెస్ ప్రకటించిన పథకాలు, హామీల అమల్లో వైఫల్యమే తమను గెలిపిస్తుందన్న అంచనాల్లో బీఆర్ఎస్ నేతలు ఉన్నారు. ఈ రెండు పార్టీల వైఫల్యాలే.. తమను విజయతీరాలకు చేరుస్తుందని బీజేపీ భావిస్తోంది.

వ్యూహ, ప్రతివ్యూహాల్లో పార్టీలు

ప్రభుత్వ పని తీరు ఎలా ఉందో తెలియజేయడానికి ప్రజలకు వచ్చిన తొలి అవకాశం కావడంతో అధికార కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికలు చాలా కీలకంగా మారాయి. అయితే, అధికార పార్టీ కావడం, అభివృద్ధి కార్యక్రమాలు, పథకాల అమలు చేస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ వైపే ప్రజలు మొగ్గు చూపుతారని ఆ పార్టీ వర్గాలు విశ్వసిస్తున్నాయి. కొత్త రేషన్ కార్డుల మంజూరు, సన్నబియ్యం పంపిణీ, రూ.500కే వంట గ్యాస్ సిలిండర్, పంట రుణాల మాఫీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం తదితర సంక్షేమ పథకాల అమలుతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం పట్ల సానుకూల వాతావరణం ఉందని భావిస్తున్నాయి. వీటికి తోడు ఇచ్చిన హామీ మేరకు స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్‌ను 42 శాతానికి పెంచడం సానుకూల అంశంగా మారనుందని అంచనా వేస్తున్నాయి. ఈ ఎన్నికల్లో బీసీ ఓటు బ్యాంకును కొల్లగొట్టనున్నామని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. ప్రభుత్వ పనితీరుకు ఈ ఎన్నికలు గీటురాయి కావడంతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నారు. కాగా, పథకాల అమల్లో ప్రభుత్వం వైఫల్యంతో ప్రజల్లో అసంతృప్తి పెరిగిందని బీఆర్ఎస్ నేతలు అంచనా వేస్తున్నారు. అయితే, పార్టీ నుంచి కేసీఆర్ కూతురు కవిత సస్పెన్షన్, కాళేశ్వరంపై కేసీఆర్, హరీశ్‌ను సీబీఐ విచారించే అవకాశం ఉండటం, ఫార్ములా ఈ రేసు కేసు కేటీఆర్ మెడకు చుట్టుకోవడం వంటి పరిస్థితులతో ఆ పార్టీ క్యాడర్ గందరగోళంలో ఉందన్న చర్చ జరుగుతోంది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఓటమితో డీలా పడిన గులాబీ పార్టీ.. మళ్లీ నిలదొక్కుకునేందుకు ఈ ఎన్నికలు కీలకంగా మారాయి. మరోవైపు.. బీఆర్ఎస్, కాంగ్రెస్ వైఫల్యాలను విస్తృతంగా ప్రచారం చేయాలని బీజేపీ నిర్ణయించింది. పంచాయతీల్లో చేపట్టిన ప్రతీ అభివృద్ధి పనికీ కేంద్రమే నిధులిస్తోందంటూ విస్తృతంగా ప్రచారం చేయనుంది. పంచాయతీల్లో సిబ్బందికి జీతాలు ఇవ్వలేని దుస్థితికి కాంగ్రెస్సే కారణమన్న అంశాన్ని క్షేత్రస్థాయికి తీసుకువెళ్లాలని భావిస్తోంది. 'మా విజయం కోసం కార్యకర్తలు శ్రమించారు.. ఇప్పుడు వారిని గెలిపించడం మా లక్ష్యం' అని ఎంపీలు, ఎమ్మెల్యేలు పేర్కొంటున్నారు.

అందరి చూపూ ఎనిమిదో తారీఖువైపు

నోటిఫికేషన్ ఇచ్చినా పిటిషన్లను విచారిస్తామని హైకోర్టు వ్యాఖ్యానించిన నేపథ్యంలో రాజకీయ పార్టీల నాయకుల్లో ఈనెల ఎనిమిదో తేదీన న్యాయస్థానం ఎటువంటి ఆదేశాలను ఇస్తుందనే ఉత్కంఠ నెలకొంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడం.. దానిని విచారించిన న్యాయస్థానం ప్రభుత్వం బిల్లు గవర్నర్ వద్ద పెండింగులో ఉండగా జీవో ఎలా ఇస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించిన విషయం తెలిసిందే. వివరణ ఇవ్వాలంటూ రాష్ట్ర ప్రభుత్వం, ఎస్ఈసీకి నోటీసులు జారీ చేసి విచారణను ఎనిమదో తేదీకి వాయిదా వేసింది. అదే సమయంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ కూడా తొమ్మిదో తేదీ నుంచి నామినేషన్ల స్వీకరణ మొదలు పెట్టేలా షెడ్యూలు విడుదల చేసింది. ఈ నేపథ్యంలో పార్టీలన్నీ ఎనిమిదో తేదీ ఏం జరుగుతుందనే ఉత్కంఠతో ఉన్నాయి.

అభ్యర్థే లేరు.. సర్పంచ్ ఎవరు?

బీసీల్లేని చోట బీసీలకు రిజర్వేషన్లు.. ఎస్సీల్లేని చోట ఎస్సీలకు కేటాయింపు

» కొన్నిచోట్ల అనివార్యంగా ఒక ఇంటికే పదవి

» ఖమ్మం జిల్లాలో మంగలితండా బీసీ మహిళకు

» ఆ ఊర్లోని 829 మందిలో బీసీ మహిళ ఒక్కరే

» నల్లగొండ జిల్లాలో ఏడు తండాలు బీసీలకు

» ఆ తండాల్లో ఒక్కరంటే ఒక్క బీసీ ఓటరు లేరు

» రాష్ట్రవ్యాప్తంగా పలుగ్రామాల్లో విచిత్రమైన పరిస్థితి

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ఆ ఊర్లో పంచాయతీ ఎన్నిక నిర్వహించినా, లేదా ఏకగ్రీవంగా ఎన్నుకున్నా 'అతడు' మాత్రమే సర్పంచ్ అవుతాడు! మరొకరయ్యే అవకాశం లేనే లేదు. మరో ఊర్లోనూ అంతే.. వెయ్యిమంది దాకా ఓటర్లు ఉన్నా, ప్రధాన పార్టీల మద్దతుతో నువ్వానేనా అన్నట్లుగా గట్టి పోటీ ఉన్నా.. 'ఆ కుటుంబం' నుంచి మాత్రమే ఎవరో ఒకరు సర్పంచ్ పదవి చేపట్టక తప్పని పరిస్థితి నెలకొంది. ఇంకో ఊర్లో గణనీయంగా జనాభా ఉన్నా సర్పంచ్ పదవికి ఏకంగా 'అభ్యర్థే' దొరకని పరిస్థితి నెలకొంది. మరో గ్రామంలోనేమో అక్కడికి వలసొచ్చిన ఆ యువకుడినే అనివార్యంగా సర్పంచ్‌గా ఎన్నుకునే పరిస్థితి ఏర్పడింది. ఎందుకిలా? అనంటే రిజర్వేషన్లు అమలులో పారదర్శకత పాటించక పోవడం, అధికారుల నిర్లక్ష్యమే కారణం అన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. సర్పంచ్ ఎన్నికల కోసం 2018 రిజర్వేషన్లను పరిగణనలోకి తీసుకొని, రొటేషన్ పద్ధతిని అవలంబించడం.. ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్ల కోసం 2011 జనాభా లెక్కలను, బీసీ రిజర్వేషన్ల కోసం 2024 కులగణనను ప్రామాణికంగా తీసుకోవడంతోనే కొన్నిచోట్ల ఈ గందరగోళ పరిస్థితి నెలకొందనే అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి.



- ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం మంగలితండాలో 829 మంది ఉంటారు. అంతా గిరిజనులే. ఇక్కడ సర్పంచ్ పదవి బీసీ మహిళకు రిజర్వు చేశారు. ఇక్కడ.. బానోత్ అనిత అనే బీసీ మహిళ తండాకు కోడలిగా వచ్చింది. ఆమె నిరుడు తండాలోని సైదులు అనే ఓ గిరిజన యువకుడిని ప్రేమించి పెళ్లి చేసుకుంది. ఫలితంగా అనితకే సర్పంచ్ పదవి ఏకగ్రీవంగా దక్కనుంది. సోమవారం అనితకు మంత్రి పొంగులేటి కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారు. ఈమె ఒక్కరే బీసీ కావడంతో బీసీలకు కేటాయించిన వార్డు పదవులూ ఖాళీగానే ఉండనున్నాయి.
- ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని ధర్మాతండాను బీసీ జనరల్‌కు రిజర్వు చేశారు. ఇక్కడ అంతా గిరిజనులే. కుమ్మరికుంట్ల నాగరాజు అనే యువకుడు పక్కనే ఉన్న కేశ్వాపురం గ్రామం నుంచి తన భార్యతో కలిసి ధర్మాతండాకు వలసొచ్చి ఓ నర్సరీ నడుపుతున్నాడు. అక్కడ నాగరాజు, అతడి భార్య మాత్రమే బీసీ ఓటర్లు కావడంతో ఇద్దరిలో ఎవరో ఒకరికి పదవి దక్కే అవకాశం ఉంది. నాగరాజుకు మంత్రి పొంగులేటి కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారు.
- ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం చింతకాని మండలం రాఘవాపురంలో ఎస్సీ మహిళకు రిజర్వు చేశారు. అయితే ఇక్కడ మొత్తమ్మీద ఇద్దరే ఎస్సీ ఓటర్లున్నారు. ఆ ఇద్దరూ తల్లీకొడుకులే. సర్పంచ్ పదవి ఇద్దరిలో ఎవరో ఒకరికి దక్కనుంది. గ్రామంలోని రెండో వార్డు ఎస్సీ మహిళకు కేటాయించడంతో ఆ పదవి తల్లికి వెళితే.. కొడుకు సర్పంచ్ కానున్నాడు. నాలుగో వార్డును ఎస్సీ జనరల్‌కు ఇవ్వడంతో కొడుకు వార్డు మెంబర్ అయితే.. తల్లి సర్పంచ్ కానుంది.
- సత్తుపల్లి నియోజకవర్గం పెనుబల్లి మండలం ఉప్పలచలక గ్రామపంచాయతీ షెడ్యూల్ ఏరియాలో ఉన్నందున సర్పంచ్‌తో పాటు 4వార్డు పదవులు ఎస్టీకి రిజర్వు అయ్యాయి. ఈ పంచాయతీలో ఒక్క ఎస్టీ కుటుంబమే ఉంది. అందులో ముగ్గురు ఓటర్లుండగా వారిలో ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులున్నారు. ఆ ఇంట్లో మిగిలిన రుద్రజారాణి అనే యువతి ఒక్కరే సర్పంచ్ పదవికి పోటీచేసే అవకాశం ఉంది. ఎస్టీలకు కేటాయించిన 4వార్డులు ఖాళీగా ఉండనున్నాయి.
- వైరా నియోజకవర్గం ఏన్కూరు మండలం నూకాలంపాడు పంచాయితీ షెడ్యూల్ ఏరియాలో ఉంది. దీంతో ఇక్కడ సర్పంచి ఎస్టీ మహిళకు రిజర్వు చేశారు. అలాగే నాలుగువార్డులు ఎస్టీలకు రిజర్వు చేశారు. అయితే ఇక్కడ ఎస్టీ ఓటర్లే లేరు. అంటే.. సర్పంచ్ పదవి, ఆ నాలుగు వార్డులు ఖాళీగానే ఉండనున్నాయి.
- నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలో బీసీలకు తూర్పుతండా, జైత్రాంతండా, నూనావత్‌తండా, బాండావత్‌తండా, గోన్యతండా, మాన్‌తండా, బాలాజీనగర్ పంచాయతీలను బీసీలకు రిజర్వు చేశారు. ఈ ఏడు చోట్ల కూడా ఒక్కరంటే ఒక్క బీసీ ఓటరు లేరు. ఫలితంగా సర్పంచ్ పదవికి నామినేషన్ వేసే వారే కరువయ్యారు. మాడ్గులపల్లి మండలం అభంగాపురం సర్పంచ్ పదవిని ఎస్టీకి రిజర్వ్ చేయగా, ఆ గ్రామంలో ఒక్క ఎస్టీ కూడా లేరు. అడవిదేవులపల్లి మండలంలోనూ బీసీకి కేటాయించిన చంప్లతండా గ్రామపంచాయతీలో ఒక్క బీసీ ఓటరు లేరు.
- నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం గజలాపురంలో ఒక్క ఎస్టీ ఓటరే ఉన్నారు. అక్కడ ఎస్టీకే రిజర్వ్ చేయడంతో ఆయనే సర్పంచ్ కానున్నారు. చందంపేట మండలం గుంటిపల్లిని బీసీలకు రిజర్వ్ చేశారు. ఈ ఊర్లో ఒక్క బీసీ కుటుంబమే ఉంది. ఆ ఇంట్లోంచే ఎవరో ఒకరు పదవి చేపట్టనున్నారు. అడవిదేవులపల్లి మండలం గోన్యతండా, జిలకరకుంట తండాలు బీసీలకు రిజర్వ్ కాగా, ఇక్కడ ఒక్కో బీసీ కుటుంబం మాత్రమే ఉంది. ముదిమాణిక్యం గ్రామపంచాయతీ ఎస్సీలకు రిజర్వ్ కాగా, ఇక్కడా ఒక్క కుటుంబమే ఉంది.
- కామారెడ్డి జిల్లా నసురుల్లాబాద్ మండలం అంకోల్ గ్రామం సర్పంచ్ ఎస్టీకి రిజర్వు అయింది. ఊర్లో ఒక్క ఎస్టీ కూడా లేరు.
- నిర్మల్ జిల్లా మామడ మండలంలోని వాస్తాపూర్, రాసిమెట్ల గ్రామాల్లో అందరూ గిరిజనులే. ఈ రెండు గ్రామాల్లో బీసీ మహిళకు రిజర్వేషన్ కేటాయించారు. లింగాపూర్ గ్రామంలో ఎస్సీలు, ఎస్టీలు ఉండగా బీసీ జనరల్‌కు కేటాయించారు.
- నిర్మల్ జిల్లా రంగాపూర్ మండలం హన్మాన్ తండాలో బీసీలే లేరు. ఇక్కడ బీసీలకు సర్పంచ్ పదవి రిజర్వ్ చేశారు.
- ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని సావర్గాం, పీచర, అరెపల్లిలో బీసీలు లేరు. కానీ వీటిని బీసీలకు రిజర్వ్ చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.


MARUTI SUZUKI
NEXA
THIS NAVRATRI, FIND INSPIRATION IN EVERY MILE.
AVAIL GST BENEFITS OF UP TO ₹1 07 000*
NOW STARTING AT ₹10 76 500 FOR GRAND VITARA AND ₹11 52 300 FOR XL6.
GRAND VITARA
XL6
NEXA SAFETY SHIELD
*OFFER VALID TILL 30TH SEPTEMBER 2025 ONLY
CONSUMER OFFERS OF UP TO ₹1 63 000^
EXCHANGE BONUS OF UP TO ₹1 00 000^
UP TO 100% WAIVER ON CAR LOAN PROCESSING FEE**
SCAN TO CONNECT TO A SHOWROOM NEAR YOU
E-BOOK TODAY @ WWW.NEXAEXPERIENCE.COM
Contact us at 1800-200-6392 1800-102-6392
For detailed T&C kindly visit nearest dealership. Maruti Suzuki India Limited reserves the rights to discontinue offers without notice and offers may vary across variants. ^Offers include consumer offer, exchange bonus and institutional or rural offers (wherever applicable) on select models/variants. Finance is at the sole discretion of the financer. 3 years or 100 000 km, whichever is earlier. Above offers are valid until stocks last. Black glass shade on the vehicle is due to the lighting effect. Images used are for illustration purposes only. Car colour may vary due to printing on paper. Revised prices effective from September 22, 2025. *Prices subject to applicable GST rates as notified by the Government. **By selected finance partners.